ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY








శుక్రవారం 17 జూలై 2026 | Friday 17 July 2026 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 103 | Vol.No 28 Issue No .103 | www.visionandhra.in


## సిఎంతో టిజి 20 లీగ్ విజేతల భేటీ

- విజేతలకు చెక్కులు అందచేసిన రేవంత్ రెడ్డి





హైదరాబాద్,జూలై16 : టీజీ20 లీగ్ విజేతలైన హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జట్టు సభ్యులు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన సీఎం, జట్టు సభ్యులకు మిగతా 2లో..

## తెలంగాణలో ఆషాఢ బోనాల సందడి

### ప్రజలకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు



హైదరాబాద్,జూలై16 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, ఆధ్యాత్మిక విశ్వాసానికి అద్దం మిగతా 2లో..

## గోల్కొండ కోటలో ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు

- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు
- కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ పూజలు
- వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి సురేఖ



మిగతా 2లో..

# గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం సస్యశ్యామలం

- నీటిని మళ్లించి జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటాం
- ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే కెసిఆర్ డబ్బులు వృధా
- సీతారామ ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన మంత్రులు
- ఖజనాపై భారం మోపారన్న డిప్యూటి సిఎం భట్టి



భద్రాద్రి కొత్తగూడెం,జూలై16 : గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇటీవల దేవాదుల ప్రాజెక్టును సందర్శించామని, నేడు సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తెలంగాణలో చివరి ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా గోదావరి నీటిని గరిష్టంగా సద్వినియోగం చేసుకుంటామని ప్రకటించారు. అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం గోదావరి తీరంలో మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో సీతారామ ప్రాజెక్ట్ స్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు మిగతా 2లో..

## ప్రాణహితకు మళ్లీ ప్రాణం పోస్తాం

- సీతారామ, సీతమ్మసాగర్, దేవాదుల ప్రాజెక్టులు పూర్తి ,
- ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలే లక్ష్యం ,
- సాగునీటి రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం ,
- అడ్డంకులన్నీ తొలగించి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం ,
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

### జగన్నాథ రథయాత్రలో
## అపశ్రుతి

- తొక్కిసలాటలో ఊపిరాడక ఒకరు మృతి
- వందమందకి పైగా భక్తులకు గాయాలు



పూరీ,జూలై16 : ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రాండ్ రోడ్డులో రద్దీ విపరీతంగా పెరగడంతో తొక్కిసలాట తరహా పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో ఒకరు మరణించగా 100 మందికి పైగా గాయపడ్డారు. వెంటనే స్పందించిన సిబ్బంది క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, రద్దీ విపరీతంగా పెరగడంతో ఓ వ్యక్తికి ఊపిరాడక స్పృహ తప్పిపోయినట్టు తెలిసింది. వెంటనే ఆ వ్యక్తిని పూరీ జిల్లా మిగతా 2లో..

## 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు

- ఎంపిలకు కొత్త మార్గదర్శకాలు జారీ

న్యూఢిల్లీ,జూలై16 :ఈ నెల 20 నుంచి ఆగస్టు 17 వరకు అత్యంత ప్రాధాన్యంతో జరగనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం ఎంపీల కోసం సరికొత్త మార్గదర్శకాల ను జారీ చేస్తూ అధికారిక బులిటెన్ విడుదల చేసింది. ముఖ్యంగా సభలో ప్రజాప్రతినిధుల వ్యక్తిగత గోప్యతను కాపాడటంతో పాటు పార్లమెంటు అంతర్గత భద్రతను మరింత బలోపేతం చేయడంపై ఈసారి ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా.. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలపై సచివాలయం మిగతా 2లో..

## పట్టాలెక్కనున్న తొట్టతొలి హైడ్రోజన్ రైలు

- నేడు జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోడీ




మిగతా 2లో..

## ఎడ్యుకేషన్ జిహాద్ పై బిజెపి ఆగ్రహం

- సైదాబాద్ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి
- బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు డిమాండ్



హైదరాబాద్,జూలై16 :'ఎడ్యుకేషన్ జిహాద్' ఉదంతాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసారి స్పష్టం చేశారు. ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిష్పాక్షికమైన, సమగ్రమైన దర్యాప్తు జరపాలన్నారు. మిగతా 2లో..

## యూకెతో ఆర్థిక ఒప్పందంతో అధిక ప్రయోజనం

- తెలంగాణకు అనుకూలంగా మలుచుకుంటాం
- యుకెకు ఎగుమతులు పెంచుతాం: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్,జూలై16 : భారత్ - యునైటెడ్ కింగ్ డమ్ ల మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం వల్ల తెలంగాణా గరిష్ఠ ప్రయోజనం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ ఒప్పందం వల్ల దేశం నుంచి ఎగుమతి అయ్యే 99 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై యుకె సుంకాలను తొలగించిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. యుకె డిప్యూటి ట్రేడ్ కమిషనర్ చంద్రు కె అయర్ ఆధ్వర్యంలో గురువారం నాడు సచివాలయంలో తనను కలిసిన ప్రతినిధి బృందంతో శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం భారీగా వృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేసారు. రెండు దేశాల మధ్య రూ.32.56 లక్షల కోట్ల వాణిజ్యానికి అవకాశం ఉందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మిగతా 2లో..

### కోకాపేటలో తొలిసారి
## శ్రీ జగన్నాథ రథయాత్ర

- జూలై 19న వైభవంగా
- హరే కృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు...
- వేలాది మంది భక్తులతో కోకాపేట వీధులు భక్తిమయం..
- రాత్రి మహా ప్రసాద వితరణ...



నార్సింగి,హైదరాబాద్, జూలై 17 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాజధాని హైదరాబాద్ లోని కోకాపేటలో తొలిసారిగా శ్రీ జగన్నాథ రథయాత్ర... హైదరాబాద్ హరే కృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో ఈ రథయాత్రను జూలై 19 ఆదివారం నాడు వైభవోపేతంగా నిర్వహించనున్నారు. భారతదేశపు చిరకాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక మిగతా 2లో..

## ఇస్రోలో శాస్త్రవేత్తల మూకుమ్మడి రాజీనామాలు

- అప్రమత్తం అయిన అంతరిక్ష విభాగం
- రాజీనామా నిబంధనలు కఠినతరం చేస్తూ ఆదేశాలు




న్యూఢిల్లీ,జూలై16 :భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు భారీ ఎత్తున రాజీనామాలు చేస్తున్నారు. వీటిని నియంత్రించేందుకు అంతరిక్ష విభాగం డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ కీలక మిగతా 2లో..

## దేశంలో జగన్నాథ రథయాత్రకు ఎంతో ప్రత్యేకత


- అమరావతిలో రథయాత్ర నిర్వహించడం ముదావహం
- రథయాత్రలో రథాన్ని లాగిన సిఎం చంద్రబాబు
- అమరావతి, పోలవరం పూర్తి చేస్తామని ప్రకటన
- ఆధ్యాత్మిక చింతన జీవితంలో భాగం కావాలని పిలుపు



అమరావతి,జూలై16 : భారతదేశంలో జగన్నాథ రథయాత్రకు ఎంతో ప్రత్యేకత ఉందన్న సీఎం చంద్రబాబు, ఒడిశాలోని పూరీలో జరిగే రథయాత్రలో అందరూ పాల్గొనడం మిగతా 2లో..

## సైదాబాద్ సక్సెస్ స్కూల్‌లో ఇస్లాం బోధన

- రెండో తరగతి విద్యార్థికి మతపరమైన హోం వర్క్
- టీచర్‌ను నిలదీత..పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు
- ఘటనపై మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్,జూలై16 :హైదరాబాద్‌లోని సైదాబాద్ ప్రాంతంలోని సక్సెస్ స్కూల్‌లో మతపరమైన హోంవర్క్ ఇచ్చారనే ఆరోపణలు వివాదానికి దారితీశాయి. రెండో తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి 'కల్మా', 'సూరహ్ ఫాతిహా' రాసి, పఠించాలని హోంవర్క్ ఇచ్చినట్లు విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనపై తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా, మిగతా 2లో..

# భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం

- పీపీపీ ప్రాజెక్టులతోనే వేగంగా అభివృద్ధి
- ప్రతీ ప్రభుత్వ శాఖకూ ఓ ఫైనాన్షియల్ ప్లాన్
- నిరర్ధకంగా ఉన్న ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం
- మెడికల్ కాలేజీల నిర్మాణంలో పీపీపీ విధానంపై కేంద్రం ప్రశంసలు
- పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0 మార్గదర్శకాలు త్వరలో విడుదల
- పీపీపీ ప్రాజెక్టులు, పీపీపీ విధానంపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి, జూలై 16 : భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌తో కూడిన ప్రాజెక్టులే కీలకంగా మారనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గతంలో ఆర్థిక సంస్కరణలు, ప్రస్తుతం మౌలిక సదుపాయాల విప్లవం దేశంలో నడుస్తోందని అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతోనే వివిధ రంగాల్లో ప్రాజెక్టులు చేపట్టి వేగంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. రాష్ట్రంలో పీపీపీ కింద చేపట్టిన ప్రాజెక్టులు, ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం పోర్టులు, షిప్ యార్డులు, ఎయిర్ మిగతా 2లో..

## పవన్ కళ్యాణ్‌కు గవర్నర్ నజీర్ పరామర్శ

- ఆరోగ్యం, ఆపరేషన్‌పై గవర్నర్ ఆరా
- త్వరగా కోలుకుని మళ్లీ విధుల్లోకి రావాలని ఆకాంక్ష



హైదరాబాద్,జులై16 : కుడి భుజానికి శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ మర్యాదపూర్వకంగా పరామర్శించారు. పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లిన గవర్నర్.. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులు సూచించిన జాగ్రత్తలను తప్పకుండా పాటించాలని సూచించారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని మిగతా 2లో..

## పవన్ కళ్యాణ్‌కు గవర్నర్ నజీర్ పరామర్శ

ఆకాంక్షించారు. పరామర్శ అనంతరం గవర్నర్, పవన్ కళ్యాణ్ నివాసంలోని లైబ్రరీని కూడా సందర్శించారు. అక్కడ రచయితలు, పరిశోధకులు, విశ్లేషకులు, ప్రజా విధాన రూపకర్తలు రచించిన పలు విలువైన పుస్తకాలను పరిశీలించారు. పుస్తకాలలోని అంశాలు, సమకాలీన సామాజిక, పరిపాలనా, ప్రజా విధానాలపై పవన్ కళ్యాణ్‌తో గవర్నర్ ఆసక్తికరంగా చర్చించారు. ఈ సందర్భంగా పవన్ అభ్యర్థన మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఒక పుస్తకంపై తన ఆటోగ్రాఫ్ కూడా చేశారు. ఈ ఆత్మీయ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. తన ఆరోగ్యాన్ని తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చి పరామర్శించిన గవర్నర్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గవర్నర్ చూపిన ఆప్యాయత, శుభాకాంక్షలు తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ కొద్దిసేపు పలు సమకాలీన అంశాలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం.

## జగన్నాథ రథయాత్రలో అపశృతి

ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు అయితే, ఈ విషయంపై అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. మరోవైపు, రద్దీ ఎక్కువైన ప్రాంతంలోని మిగిలిన వారిని సహాయక సిబ్బంది తక్షణం తరలించారు. సుమారు 120 మందిని ఆసుపత్రిలో చేర్పినట్టు తెలుస్తోంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటన నేపథ్యంలో రద్దీ నియంత్రణకు అధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టినట్టు సమాచారం. ప్రపంచప్రఖ్యాతి గాంచిన పూరీ జగన్నాథుడి రథయాత్ర లక్షల మంది భక్తుల మధ్య గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే.

## తెలంగాణలో ఆషాఢ బోనాల సందడి

పల్లె ఈ వేడుకల ప్రారంభం సందర్భంగా నగర ప్రజలకు, భక్తులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బోనాల పండుగ సామాజిక ఐక్యతకు ప్రతీక అని కొనియాడిన ఆయన.. భక్తుల నమ్మకాలు, సంప్రదాయాలకు భంగం కలగకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.20 కోట్ల నిధులను కేటాయించిందని గుర్తుచేశారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. త్రువాల నిర్వహణలో భాగంగా దేవాలయాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, నిరంతర తాగునీటి సరఫరా, నిరంతరాయ విద్యుత్, వైద్య సేవలతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, కట్టుదిట్టమైన భద్రత, అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని వేలాది ఆలయాల్లో భక్తుల రద్దీని తట్టుకునేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనివేయాలని సీఎం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ అధికారిక పర్యవేక్షణలో నేటి నుంచి ప్రారంభం కానున్న ఈ బోనాల జాతరను విజయవంతం చేసేందుకు సర్వం సిద్ధమైంది.

## ఇస్రోలో శాస్త్రవేత్తల మూకుమ్మడి రాజీనామాలు

నిర్ణయం తీసుకుంది. శాస్త్రవేత్తలకు రాజీనామాల నిబంధనలను కఠినతరం చేసింది. ఈ ఆదేశాలను అంతరిక్ష విభాగం గురువారం జారీ చేసింది. వాటిని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ లతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న పలు కేంద్రాలకు కూడా పంపింది. భారత్ చేపట్టిన ప్రతిష్ఠాత్మక మానవ అంతరిక్ష యాత్ర కార్యక్రమం గగన్‌యాన్‌తోపాటు ఇతర 'ముఖ్యమైన మిషన్ల'కు అనుబంధంగా పని చేస్తున్న గ్రూప్- ఏ శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది నుంచి వచ్చే రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ అభ్యర్థనలు యథావిధిగా అంగీకరించ వద్దని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఉద్యోగుల రాజీనామాతో జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. శాస్త్రవేత్త, ఇంజనీర్ హోదా లేదా అంతకంటే తక్కువ స్థాయిలోని సాంకేతిక సిబ్బంది నుంచి స్వీకరించిన రాజీనామాలను తమకు పంపాలని సదరు కేంద్రాలకు అంతరిక్ష విభాగం స్పష్టం చేసింది. అదికూడా ఆయా కేంద్రాల్లోని డైరెక్టర్ల స్పష్టమైన సిఫార్సులతో పంపాలని కోరింది. అయితే గ్రూప్- ఏ స్థాయిలోని ఉద్యోగుల రాజీనామాలను ఆమోదించేందుకు ఈ కేంద్రాల డైరెక్టర్లకు గతంలో ఇచ్చిన ఆదేశాలను తాజాగా అంతరిక్ష విభాగం రద్దు చేసింది. ఇటీవల ఇస్రో నుంచి 100 మందికి పైగా సిబ్బంది రాజీనామా చేశారంటూ వార్తా కథనాలు వెలువడ్డాయి. అందులో బెంగళూరులోని యూఆర్ఎస్‌సి, తిరువనంతపురంలోని వీఎస్ఎస్‌సి నుంచి పెద్ద ఎత్తున శాస్త్రవేత్తలు రాజీనామాలు చేశారు. ఆ జాబితాలో ప్రముఖ శాస్త్రవేత్తలు కూడా ఉన్నారని తెలుస్తోంది. ఈ రాజీనామాలు చేసిన శాస్త్రవేత్తలు అంతా.. స్పేస్ స్టార్టప్‌లలో చేరుతున్నట్లు సమాచారం. 2020లో అంతరిక్ష రంగంలోకి ప్రవేశించేందుకు ప్రైవేట్ సంస్థలను కేంద్రం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. 2023లో భారత అంతరిక్ష విధానాన్ని ప్రారంభించింది. నాటి నుంచి స్పేస్ స్టార్టప్‌లు దూసుకు వెళ్తున్నాయి. దేశంలో ప్రస్తుతం 400కు పైగా అంతరిక్ష స్టార్టప్‌లు ఉన్నాయి. అవి 500 మిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాయి. 2025లో వాటికి 150 మిలియన్ డాలర్లు సమకూరాయి. పిక్సెల్, ధ్రువ స్పేస్, స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ వంటి కంపెనీలు ఈ పోటీలో ముందున్నాయి.

## యూకెతో ఆర్థిక ఒప్పందంతో అధిక ప్రయోజనం

తెలంగాణాలో పారిశ్రామిక వస్తూత్పత్తి, లైఫ్ సైన్సెస్, ఏవియేషన్, డిఫెన్స్, ఐటి, సెమికండక్టర్స్, చిప్ ల డిజైన్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను వృద్ధి చేసామని, యుకె పారిశ్రామికవేత్తలు వీటిని వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రం నుంచి యుకెకు ప్రస్తుతం రూ.3,553 కోట్ల విలువైన ఎగుమతులు మాత్రమే జరుగుతున్నాయని తెలిపారు. కొత్త ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాల వల్ల ఎగుమతులను భారీగా పెంచుకునే అవకాశం ఏర్పడిందని వివరించారు. దేశంలోని ఫార్మా ఉత్పత్తుల్లో 40 శాతం తెలంగాణాలోనే జరుగుతున్నాయని, వ్యాక్సిన్ ఎగుమతుల్లో 30 శాతం రాష్ట్రానిదేనని శ్రీధర్ బాబు తెలిపారు. విమానయాన రంగానికి అవసరమైన ప్రిసిషన్ విడిభాగాల ఉత్పత్తిలో తెలంగాణా అగ్రస్థానంలో ఉందని గుర్తు చేసారు. ప్రపంచ ప్రఖ్యాత ఏవియేషన్ సంస్థలు ఎయిర్ బస్, బోయింగ్, రోల్స్ రాయిస్, విమాన ఇంజన్ల తయారీ సంస్థ ప్రాట్ అండ్ విట్నీస్, దసో ఏవియేషన్ ఉత్పత్తి చేసే రఫేల్ విమానాల విడిభాగాల తయారీ, ఓవర్ హాలింగ్ సదుపాయాలు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. టాటా అడ్వాన్సుడ్ సిస్టమ్స్, సఫ్రాన్ ఏవియేషన్ సంస్థలు పరిశ్రమలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేసారు. హైదరాబాద్ లో ఫార్చ్యూన్ 500 కంపెనీలతో సహా పలు ప్రఖ్యాత సంస్థలు 350 జిసిసి కేంద్రాలను ఏర్పాటు చేసాయని చెప్పారు. యుకెకు ఎగుమతి చేయగలిగే వస్తువుల తయారీపై స్థానిక పారిశ్రామిక వేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి సిఇటిఏ ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఇండస్ట్రీస్ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆధిత్యకు శ్రీధర్ బాబు సూచించారు. యుకె నుంచి భారత్ పర్యటించే మేయర్ల బృందాన్ని హైదరాబాద్ ను కూడా సందర్శించేలా చూడాలని చంద్రు కె అయర్ ను మంత్రి కోరారు. అధికారులతో కలిసి యుకెను సందర్శించి అక్కడ పారిశ్రామిక, వాణిజ్య ఎకోసిస్టంను పరిశీలించాలని చంద్రు అయర్ శ్రీధర్ బాబును ఆహ్వానించారు. యుకె ప్రతినిధి బృందంలో సిద్దార్థ్ విశ్వనాథన్, నళిని రఘురామన్, ప్రవీణ్ పద్మనాభన్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## సిఎంతో టిజి 20 లీగ్ విజేతల భేటీ

విజేతల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలో క్రీడలకు ప్రాధాన్యం పెంచే లక్ష్యంతో కొత్త స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని సీఎం వెల్లడించారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ, మౌలిక వసతులు, ప్రోత్సాహం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. టీజీ20 లీగ్‌లో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జట్టు రాష్ట్ర యువతకు ఆదర్శంగా నిలవాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణకు పేరు తీసుకురావాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని టీజీ 20 లీగ్ విజేత 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' ఫ్రాంచైజీ యాజమాన్యం, జట్టు సభ్యులు కలిశారు. సీఎంను కలిసిన వారిలో రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, దివిజ, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశివరావు, ఈటీవీ ఎండీ బాపినీడు, జట్టు సభ్యులు ఉన్నారు. టోర్నీ తొలి విజేతగా నిలిచిన 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' టీమ్‌కు సీఎం అభినందనలు తెలిపారు.

## 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు

పూర్తిస్థాయి ఆంక్షలు విధించింది. సభా రికార్డులకు భిన్నంగా రహస్యంగా చిత్రాలు తీయడం, వీడియోలు రికార్డ్ చేయడం వంటి అనధికారిక చర్యలకు ఆస్కారం లేకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. డిజిటల్ భద్రతా ప్రమాణాల దృష్ట్యా సభలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. నూతన ఆదేశాల ప్రకారం.. సభలోకి స్మార్ట్ వాచీలు, స్మార్ట్ కళ్లద్దాలు, పెన్ కెమెరాల వంటి ఎలాంటి నిఘా ఆధారిత గ్యా÷-జడెట్లనూ అనుమతించరు. కేవలం సాంకేతిక ఆంక్షలకే పరిమితం కాకుండా పార్లమెంట్ ప్రాంగణంలో ప్రజాస్వామ్య యుతమైన గౌరవాన్ని కాపాడేందుకు మరికొన్ని కఠిన నిబంధనలనూ ఈ బులిటెన్‌లో చేర్చారు. పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, రాజకీయ నిరసనలు చేపట్టడంపై పూర్తి నిషేధం విధించారు. అలాగే సభా సమయాన్ని, వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు తీసుకురావడం వంటి చర్యలను పూర్తిగా నిరాకరించారు. వీటితో పాటు పార్లమెంటు పరిధిలో ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు లేదా పూజలు నిర్వహించకూడదని స్పష్టం చేస్తూ, సభా మర్యాదలను, శాంతిభద్రతలను కాపాడేందుకు ఎంపీలందరూ సహకరించాలని లోక్‌సభ సచివాలయం ఈ విస్తృతమైన మార్గదర్శకాల ద్వారా కోరింది.

# గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం సస్యశ్యామలం

అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దుమ్ముగూడెం రాజీవ్ సాగర్', 'రుద్రంకోట ఇందిరా సాగర్' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అయితే, గత కేసీఆర్ ప్రభుత్వం రీ-డిజైనింగ్ పేరుతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచిందని విమర్శించారు. రీ-డిజైనింగ్ నెపంతో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. 24,000 కోట్లకు పెంచేసి ఖజానాపై అదనపు భారం మోపారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజాధనం ఇప్పటికే అధిక మొత్తంలో వ్యయం కావడం వల్ల ఇప్పుడు ఈ ప్రాజెక్టులను నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే వీటిని ఎలాగైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన, అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సీతారామ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తాం. గోదావరిపై చివరి ప్రాజెక్ట్ ఇది. దీనిపై ఆర్థిక భారం పడింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్మార్గంగా ఆలోచించి బడ్జెట్ పెంచి ప్రాజెక్టును రీడిజైన్ చేశారు. గోదావరిపై జరుగుతున్న అక్రమాలపై ఆనాడు శాసనసభలో, బయట కూడా గళం విప్పాం. పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నారు. ఇప్పటివరకు ఎంతమేర పనులు పూర్తయ్యాయో చూసేందుకు ఈ పర్యటన చేపట్టాం. ప్రజా ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా ప్రాజెక్టును పూర్తిచేస్తాం అని భట్టి విక్రమార్క అన్నారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్‌పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమిషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్ట్‌ను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పారిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సీతారామసాగర్‌కు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు వచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్‌లో ఉన్న ఫౌండేషన్‌ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు. సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. రైతుల నుంచి తాము వరి కోనుగోళ్లు చేసి నేరుగా అకౌంట్‌లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్‌గా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట్ కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉద్ఘాటించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రాణహితకు మళ్లీ ప్రాణం పోస్తాం

తెలంగాణ రైతాంగ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాగునీటి రంగంలో చారిత్రాత్మక నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టు, దేవాదుల ఎత్తిపోతల పథకాలను ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి రైతుల కలలను సాకారం చేస్తామని ఆయన ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సత్తుపల్లి టన్నెల్ వద్ద సీతారామ ప్రాజెక్టు పనులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించిన అనంతరం జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి ఈ ప్రకటన చేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కిం చేందుకు తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం అవసరమైన పర్యావరణ అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించడంతో న్యాయపరమైన సమస్యలు తలెత్తాయని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ప్రభుత్వం సమర్థంగా పోరాడుతోందని, అవసరమైన అన్ని కేంద్ర అనుమతులు సాధించి చట్టబద్ధంగా పనులు పూర్తి చేస్తామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టుకు అవసరమైన 67 టీఎంసీల గోదావరి జలాల వినియోగానికి కేంద్ర జల సంఘం తుది అనుమతి ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ గొప్ప విజయమని మంత్రి పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు పూర్తి మరింత వేగవంతం కానుందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి సాగుభూమికి గోదావరి జలాలు అందించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, సాంకేతిక అంశాలన్నింటినీ వేగంగా పరిష్కరించి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ సూచనల మేరకు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కొనసాగుతోందని మంత్రి తెలిపారు. అన్ని పరీక్షలు పూర్తయి భద్రతా ధ్రువీకరణ లభించిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీరు నిల్వ చేయకుండానే తెలంగాణ రైతులు రికార్డు స్థాయిలో పంట పండించారని మంత్రి తెలిపారు. యాసంగి సీజన్‌లో సుమారు 82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి దాదాపు రూ.19 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు ద్వారా రైతులకు దాదాపు రూ.80 వేల కోట్లకు పైగా నేరుగా చెల్లించినట్లు వెల్లడించారు.నీటిపారుదల శాఖలో వెయ్యికి పైగా ఇంజినీర్ల నియామకం, దాదాపు 1,800 మంది ఫీల్డ్ సిబ్బంది నియామకం, పెండింగ్ పదోన్నతుల మంజూరు వంటి చర్యలతో శాఖకు కొత్త ఊపు తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. రైతుల శాశ్వత ప్రయోజనాల కోసం, ప్రజల భద్రత కోసం, శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగానే ప్రతి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు

## కోకాపేటలో తొలిసారి శ్రీ జగన్నాథ రథయాత్ర

వారసత్వానికి ప్రతీక అయిన ఈ ఉత్సవంలో శ్రీ జగన్నాథ, బలదేవ, సుభద్ర దేవతా విగ్రహాలను అందంగా అలంకరించిన రథంపై ఊరేగించనున్నారు. ఈ రథయాత్ర లిది ట్విలైట్, గోల్డెన్ మైల్ లేఅవుట్ రోడ్, కోకాపేటలి నుండి ప్రారంభమై, కోకాపేట ప్రధాన వీధుల గుండా, రాజపుష్ప అట్రియా మీదుగా లిహరే కృష్ణ హెరిటేజ్ టవర్, నార్సింగిలి వద్ద ముగుస్తుంది.

సమయాల వారీగా కార్యక్రమాలు

సాయంత్రం 5:00 గంటలకు రథయాత్ర ప్రారంభమవుతుంది. హరే కృష్ణ కీర్తనలు, భజనల నడుమ శ్రీ జగన్నాథ, బలదేవ, సుభద్రలకు ప్రారంభ పూజలు నిర్వహిస్తారు. 5:20 గంటలకు ప్రముఖులు రథ మార్గానికి సంప్రదాయబద్ధంగా తొలి హారతి ఇచ్చి, చీపురుతో మార్గాన్ని శుద్ధి చేస్తారు. 5:30 గంటలకు ఇస్కాన్ వ్యవస్థాపక ఆచార్యులు శ్రీల ప్రభుపాద పేరిట రథాన్ని లాగడం ప్రారంభిస్తారు. ఆ తర్వాత భక్తులు డోలు, తప్పెట్ల చప్పుళ్లతో, హరే కృష్ణ నామస్మరణతో రథాన్ని లాగుతారు. 5:30 నుంచి 7:30 వరకు రథయాత్ర కోకాపేట అంతా సాగుతుంది. మార్గం పొడవునా నివాసితులు ఇళ్ల ముందు నుంచి రథాన్ని దర్శించుకుని రథాన్ని లాగే భాగ్యాన్ని పొందనున్నారు.రాత్రి 7:30 గంటలకు రథయాత్ర హరే కృష్ణ హెరిటేజ్ టవర్ చేరుకుంటుంది. అక్కడ మహా కీర్తనలు, హైదరాబాద్ హరే కృష్ణ మూవ్మెంట్ అధ్యక్షులు మరియు అక్షయ పాత్ర తెలంగాణ, ఏపీ రీజినల్ ప్రెసిడెంట్ లిశ్రీ సత్య గౌర చంద్ర దాస ప్రభుజీలి ప్రవచనం ఉంటుంది. రాత్రి 8:00 గంటలకు తుది హారతితో కార్యక్రమం ముగిసి, భక్తులందరికీ మహా ప్రసాదం వితరణ చేస్తారు.

ప్రభుజీ ఆహ్వానం



ఈ సందర్భంగా శ్రీ సత్య గౌర చంద్ర దాస ప్రభుజీ మాట్లాడుతూ, "రథంపై భగవానుడిని దర్శించడం వల్ల జన మరణ చక్రం నుండి విముక్తి లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ చారిత్రాత్మక రథయాత్రలో భక్తులు, కుటుంబాలు, యువత అందరూ పాల్గొని జగన్నాథుని ఆశీస్సులు పొందాలని" కోరారు. ఈ ఉత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు, హరే కృష్ణ మూవ్మెంట్ సభ్యులు, యువత పెద్ద ఎత్తున తరలి వస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రసాదం, తాగునీరు, భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వారు వెల్లడించారు. పూర్తి వివరాలకు ఈ క్రింది నంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

9640086664 9396416341

## ఎడ్యుకేషన్ జిహాద్ పై బిజెపి ఆగ్రహం

పాఠశాల యాజమాన్యంతో పాటు కారకులైన ప్రతి ఒక్కరిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని రాంచందర్ రావు పేర్కొన్నారు. సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో 'ఎడ్యుకేషన్ జిహాద్' తారాస్థాయికి చేరిందంటూ ఆయన మండిపడ్డారు. ఇందుకు పాతబస్తీ సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఆ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి కల్మా, సూరా అల్-ఫాతిహాలను చదివి రావాలని హోమ్‌వర్క్‌గా ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పూర్తి బాధ్యత వహించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా 'కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్' అని, రేవంత్ చేసిన ఓటు బ్యాంకు, ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాల వల్లే ఇలాంటి తీవ్రవాద ఆలోచనలు ఉన్న శక్తులకు తెగింపు పెరిగిందని రాంచందర్ రావు మండిపడ్డారు. తమ బిడ్డ చేత బలవంతంగా కల్మా రాయించడాన్ని గమనించి, పాఠశాల యాజమాన్యాన్ని ధైర్యంగా నిలదీసిన ఆ చిన్నారి తల్లి సాహసాన్ని తాను మనస్ఫూర్తిగా అభినందిస్తు న్నానని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఇంతటి తీవ్రమైన ఉదంతం వెలుగులోకి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ సదరు పాఠశాల యాజమాన్యంపై ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేవలం ఒక ముస్లిం టీచర్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తే సరిపోదని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్‌దేనని ఆయన స్పష్టం చేశారు.

## గోల్కొండ కోటలో ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు

హైదరాబాద్,జూలై16 : గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారి బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రిగారికి అర్చకులు మంత్రోచ్ఛారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శివసత్తులతో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కళాకారుల కోరిక మేరకు మంత్రి సురేఖ ఈరగోల చేతిలో ధరించి, వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాడ బోనాల ఉత్సవాల బుక్ లెట్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరపున రూ. 11 లక్షల చెక్కును ఇరువురు మంత్రులు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో జగన్నాథ రథయాత్రకు ఎంతో ప్రత్యేకత

సాధ్యం కాదన్నారు. ప్రతిఏటా ఇక నుంచి జగన్నాథ రథయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఇస్కాన్ ప్రకటించడం సంతోషదాయకమని తెలిపారు. పూరీ రథయాత్రకు ఎంతో విశిష్టత ఉందని, అలాంటి కార్యక్రమాన్ని అమరావతిలోనూ చేపట్టడం ఆనందంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో తొలిసారిగా నిర్వహించిన జగన్నాథ రథయాత్ర కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని గుంటూరు జిల్లా వెంకటపాలెంలోని టీటీడీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి జగన్నాథ రథయాత్రకు శ్రీకారం చుట్టారు. రథాన్ని లాగే ముందు ఒడిశాలోని పూరీలో జగన్నాథ స్వామికి నిర్వహించే ప్రత్యేక పూజలను సీఎం చంద్రబాబు నిర్వహించారు. అనంతరం అమరావతి రాజధాని నగర బృహత్ ప్రణాళికతో కూడిన చిత్ర పటాన్ని తలపై పెట్టుకుని అమరావతి విశ్వ నగరంగా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పూరీలో నిర్వహించే సంప్రదాయ క్రతువులో భాగంగా జగన్నాథ రథం ముందు భాగాన్ని బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రం చేశారు. ఆపై జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రమ్మలు ఆశీనులైన రథాన్ని తాడుతో లాగారు. సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, స్థానిక శాసనసభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు రథాన్ని లాగారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. అమరావతిలో మొదటిసారిగా నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక సేవతో పాటు ప్రజా సేవలో ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్‌లు చక్కగా పనిచేస్తున్నాయని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. దేశంలోని 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 25 వేలకు పైగా పాఠశాలలు, అంగన్‌వాడీల్లో ఆహారం అందిస్తున్నాయని తెలిపారు.

## భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం

పోర్టులు, పర్యాటక ప్రాజెక్టులు సహా మొత్తం 260 ప్రాజెక్టులను పీపీపీ కింద చేపట్టినట్టు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పరిశ్రమలు, మౌలికసదుపాయాలు, పురపాలక, టూరిజం, వైద్య కళాశాలలు, రహదారులు, సౌర విద్యుత్ లాంటి రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం అన్ని పీపీపీ ప్రాజెక్టులనూ సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని... ప్రతీ ప్రాజెక్టు వద్దా ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఇచ్చే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లాంటి వాటిని కూడా సమర్థంగా వినియోగించుకోవాలని అన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమర్థంగా నడిపేందుకు అవసరమైన మెకానిజమ్ సిద్ధం చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టుల్లో స్థానిక మత్స్యకారులను కూడా భాగస్వాములను చేసి వారికి ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద పబ్లిక్ టచ్ పాయింట్ల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలకు అవకాశాలు కల్పించాలన్నారు. విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు రూ.178 కోట్ల వీజీఎఫ్‌ను కేంద్రం ఇస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మెడికల్ కాలేజీలకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని.. ఈ ప్రాజెక్టులు చేపట్టిన విధానంపై కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని అధికారులు తెలిపారు. వచ్చే కేబినెట్‌కు నూతన విధానంఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం-వీజీఎఫ్ పాలసీ 1.0 ను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేర్వేరు విధానాలను కూడా అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల మేరకు ప్రతీ ఏటా పీపీపీ కింద రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కింద వీటిని చేపట్టాల్సి రావొచ్చని సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం స్వర్ణాంధ్ర విజన్ మైక్రో, మ్యాక్రో లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టాలని అన్నారు. ఎప్పటికప్పుడు లోటుపాట్లను సరిదిద్దుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

## పట్టాలెక్కనున్న తొట్టతొలి హైడ్రోజన్ రైలు

న్యూఢిల్లీ,జూలై16 :దేశంలో తొట్టతొలి హైడ్రోజన్ రైలు పట్టాలెక్కనున్నది. హర్యానాలోని జింద్ నుంచి ఆ రైలు ప్రారంభంకానున్నది. ప్రధాని మోదీ నేడు ఆ కొత్త రైలుకు పచ్చజెండా ఊపనున్నారు. హైడ్రోజన్ రైలు భారతీయ రైల్వే చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నది. జింద్ నుంచి సోనిపట్ మధ్య ఆ రైలు నడవనున్నది. ఈ రెండు స్టేషన్ల మధ్య 89 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉంటాయి. గరిష్టంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీన్ని డిజైన్ చేశారు. ఫ్యూయల్ సెల్ డీపీఆర్ఎస్ విధానంలో రైలు నడవనున్నది. 1200 కిలోవాట్ల ప్రొపల్షన్ సిస్టమ్ ఆ రైలుకు ఉంటుంది. 2025లో జింద్-సోనిపట మధ్య ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించారు. మే 22వ తేదీన 10 కోచ్‌ల హైడ్రోజన్ రైలు కోసం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. హైడ్రోజన్ ట్రైన్ నెంబర్ 74010 జింద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత సోనిపేట్‌కు 9.40 నిమిషాలకు చేరుకుంటుంది. ఫ్యూయల్ సెల్స్ ఆధారంగా హైడ్రోజన్ రైలు విద్యుత్తను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రియాక్షన్‌తో విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఆనోడ్‌పై హైడ్రోజన్, క్యాథోడ్‌పై ఆక్సిజన్ రియాక్ట్ అవుతుంది. ఆనోడ్‌లో హైడ్రోజన్ కణాలు.. ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లుగా విభజన అవుతాయి. ప్లాటినం ఉత్ప్రేరకం ఆధారంగా ప్రోటాన్లతో ఆక్సిజన్ కలిసి వాటర్‌గా మారుతుంది. ఈ విధానంలో రైలు ఇంజిన్ నడుస్తుంది. హైడ్రోజన్ రైళ్లను 2018లో తొలిసారి జర్మనీలో ప్రవేశపెట్టారు. ఫ్రెంచ్ కంపెనీ ఆల్‌స్టామ్ వీటిని డెవలప్ చేశాయి. ఈ రైలు కోసం జింద్‌లో హైడ్రోజన్ జనరేషన్, రీఫ్యూయలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్‌ను నిల్వ చేసేందుకు పెట్రోలియం శాఖ లైసెన్సు జారీ చేసింది. మొత్తం 12 స్టేషన్లలో రైలు ఆగుతుంది. జింద్ సిటీ, పాండు పిండర, లలిత్ ఖేరా, భంబేవా, ఇషాపూర్ ఖేరి, బూటానా, ఖంద్రాయి, గోహనా, రబ్రా, లాత్, మోహనా హర్యానా, భర్వాస్ని స్టేషన్లలో ఆ రైలు ఆగనున్నది. శిలాజ ఇంధనాల తరహాలో హైడ్రోజన్ మూడు రెట్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అయితే ప్రస్తుతం ఈ విశ్వంలో హైడ్రోజన్ ఎక్కువ స్థాయిలో లభిస్తుంది. దీన్ని ఇంధనంగా వాడితే, అది కేవలం నీటి ఆవిరిని, వేడిని మాత్రమే బై ప్రోడక్ట్స్‌గా రిలీజ్ చేస్తుందని చెబుతున్నారు. దీని వల్ల పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.

## సైదాబాద్ సక్సెస్ స్కూల్‌లో ఇస్లాం బోధన

ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అనంతరం పాఠశాల యాజమాన్యం స్పందించి, సంబంధిత ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీన్‌ను విధుల నుంచి తొలగించింది. అలాగే భవిష్యత్తులో సక్సెస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థల్లో ఆమెకు ఉద్యోగావకాశం కల్పించబోమని తెలిపింది. ఘటనపై విద్యార్థి కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుకు సంబంధించి న్యాయపరమైన అభిప్రాయం తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇదే సమయంలో పాఠశాల వద్ద బీజేపీ నాయకులు నిరసన చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పిల్లలకు మతపరమైన అంశాలను నేర్చుకోవాలని చెప్పడంపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయగా, 'మా స్కూల్‌లో చదవాలంటే ఇవి నేర్చుకోవాల్సిందే' అని సదరు టీచర్ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై స్కూల్ యాజమాన్యం, సంబంధిత టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. కాగా, ఈ వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. హిందూ విద్యార్థికి కల్మా, సూరా ఫాతిహా చదవాలని హోమ్‌వర్క్ ఇవ్వడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారని మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యం.. కల్మా చదవాలని విద్యార్థికి హుకుం జారీ చేయడం దుర్మార్గం అన్నారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోకాల్డ్ సెక్యూలర్ సంఘాలు దీనిపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. హిందూ సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## దేశంలో డీ లిమిటేషన్ రాజకీయాలు !


మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కార్ దృష్టి అంతా ఇప్పుడు డీలిమిటేషన్‌పై ఉంది. ఈనెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. దీంతో ఈసారి ఎలాగైనా గండం గట్టెక్కేందుకు అవసర మైన వ్యూహాలతో సిద్ధం అవుతోంది. ఆయా రాష్ట్రాల్లోని రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకుని ముందుకు సాగబోతున్నట్లు తాజా పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. రాజకీయాల్లో శాశ్వత శతృవులు, శాశ్వత మిత్రులు ఉండరని ఈ సమావేశాలు బహుశా నిరూపించనున్నాయి. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు ముందు దేశ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ 131వ సవరణ బిల్లు మళ్లీ చర్చకు రావచ్చున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ బిల్లును ఆమోదించాలంటే లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. ఇటీవల మారుతున్న రాజకీయ సమీకరణాలు ఎన్డీఏ ప్రభుత్వానికి ఈ లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలను మరింత పెంచుతున్నాయనే చర్చ సాగుతోంది. గతంలో ఈ బిల్లుకు తగిన మద్దతు లభించక పోవడంతో అది ఆమోదం పొందలేదు. అయితే ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, శివసేనలో జరిగిన మార్పులు, అలాగే శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గం నుంచి వస్తున్న సంకేతాలు ఎన్డీఏకు అనుకూలంగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా సుప్రియా సూలే చేసిన వ్యాఖ్యలు ఈ అంశంపై కొత్త చర్చకు దారితీశాయి. డీలిమిటేషన్ విషయంలో అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరిగేలా లోక్‌సభ సీట్లను 50 శాతం వరకు పెంచితే తమ పార్టీ సానుకూలంగా ఆలోచించే అవకాశముందని సుప్రియా సూలే వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరిం చుకుంది. గతంలో ఇదే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా సీట్ల పెంపుపై చర్చించేందుకు సిద్ధమని పేర్కొనడం ఇప్పుడు మరోసారి ప్రస్తావనకు వస్తోంది. ఇటీవల ఎన్సీపి అధినేత శరద్ పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటి సిఎం ఏక్‌నాథ్ షిండే కలుసుకుని చర్చించారు. బయటకు సాదాసీదా భేటీ అయినా రేపటి పార్లమెంట్ సమావేశాల్లో మద్దతకు సంబంధించిన వ్యవహారం సాగిందనే అంటున్నారు. ఇప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఎన్డీఏకు ఇప్పటికే ఉన్న బలానికి అదనంగా తిరుగుబాటు చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, శివసేన నుంచి మారిన సభ్యులు, శరద్ పవార్ వర్గానికి చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడంలో డీఎంకే వైఖరి అత్యంత కీలకంగా మారింది. డీఎంకేకు చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే ప్రభుత్వం లక్ష్యానికి మరింత చేరువ అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రాజ్యాంగ 131వ సవరణ బిల్లు ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన, సీట్ల సంఖ్య పెంపు, అలాగే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధించిన అంశాలు వేగవంతం చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అందుకే ఈ బిల్లుకు కేంద్రం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అయితే, ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై ఇంకా పూర్తి స్థాయిలో తమ వైఖరిని వెల్లడించలేదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశాలపై గతంలో వ్యక్తమైన ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలను ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత డీలిమిటేషన్ బిల్లుపై ఎలాంటి చర్చ జరుగుతుంది..ఎన్డీఏ మూడింట రెండు వంతుల మెజారిటీని సమీకరించగలదా.. శరద్ పవార్ వర్గం, డీఎంకే వంటి పార్టీల తుది నిర్ణయం ఎలా ఉంటుంది.. అనే అంశాలపై దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సమావేశాల్లో జరిగే పరిణామాలు దేశ రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో ఇండియా కూటమిలో ఉన్న డిఎంకె బయటకు వచ్చింది.దీంతో డిఎంకె కూడా కొంత మెత్తబడి ఎన్‌డిఎకు అనుకూలంగా మారనుందన్న సమాచారం. మరోవైపు తమిళనాడులో రాజకీయం మరింత వేడెక్కుతోంది. ఆ రాష్ట్రంలోని ఇండియా కూటమిలో విభేదాలు మరింత బయటపడుతున్నాయి. సీఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో చేతులు కలిపేందుకు ద్రవిడ మున్నేట్ర కళగం(డీఎంకే) విముఖత చూపుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు.. జాతీయ స్థాయిలో మాత్రం కూటమిలో భాగస్వాములుగా కొనసాగవచ్చని విడుతలై చిరుతైగల్ కట్చి(వీసీకే) అధ్యక్షుడు తిరుమావళవన్ సూచించారు. దీనికి కాంగ్రెస్ మద్దతు తెలుపగా.. డీఎంకే మాత్రం ససేమిరా అంటోంది. ఈ సందర్భంగా డీఎంకే ఎంపీ గణపతి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. 'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొమ్మిదేళ్లుగా మాతో ఉన్న కాంగ్రెస్.. ఇప్పుడు టీవీకేకు మద్దతిస్తోంది. ఇది వెన్నుపోటుతో సమానం. మంత్రి పదవుల కోసమే కాంగ్రెస్ డీఎంకేను వదిలేసింది. ఇప్పుడు వీసీకేను మధ్యవర్తిగా వాడుకుంటూ మళ్లీ డీఎంకేను ఒప్పించే ప్రయత్నం చేస్తోందని వ్యాఖ్యానించారు. కేరళ, బెంగాల్ తరహా రాజకీయాలు తమిళనాడులో పనికిరావని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం.. తమిళనాడులో టీవీకే మూడో ప్రధాన రాజకీయ పార్టీగా అధికారంలోకి వచ్చిందని, దీంతో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. అంతేకాకుండా.. ప్రస్తుతం పార్లమెంట్‌లో ఒక్క ఎంపీ కూడా లేని టీవీకేను ఇండియా కూటమిలో భాగంగా పరిగణించాలా అనే అంశంపైనా చర్చించాల్సిన అవసరముందని రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ తమను వదులుకోవడం ద్వారా అది ఇండియా కూటమికే నష్టం చేకూరుస్తుందని ఆయన చెప్పుకొచ్చారు. మొత్తంగా ఇప్పుడు బిజెపి గేమ్‌ప్లాన్ బాగా వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది.

# ఎస్ఐఆర్ ఫారాల సేకరణ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

### విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి

### అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 16 (విజన్ ఆంధ్ర) వనపర్తి మండలంలోని చిట్యాల, చిమనగుంటపల్లి గ్రామాల్లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, ఆన్‌లైన్ డేటా నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం చిన్నగుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు ( బిఎల్ ఓలు) ఇంటింటికి వెళ్లి అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, పూర్తి చేసిన ఫారాలను త్వరితగతిన సేకరించాలని ఆదేశించారు. సేకరించిన ఫారాల వివరాలను రోజువారీగా ఆలస్యం లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫారాలు నింపడంలో ప్రజలకు ఎదురయ్యే సందేహాలను బీఎల్‌ఓలు నివృత్తి చేసి, అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. నిర్దేశించిన



గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేందుకు గ్రామపంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.పాఠశాల ఆకస్మిక తనిఖీ అనంతరం చిమనగుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి, మెనూ అమలుపై విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, బూత్ లెవల్ అధికారులు (బిఎల్ ఓలు), రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ కేసులపై త్వరితగతిన ఛార్జిషీట్ వేయాలి

### నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి

### గత ఆరేళ్లుగా ఒక్క కేసులోనూ నేరారోపణ జరగకపోవడం విచారకరం

### బాధితులకు భరోసా కల్పించడమే పోలీస్, రెవెన్యూ శాఖల బాధ్యత

### జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కీలక ఆదేశాలు

వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 16 (విజన్ ఆంధ్ర) ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సాధ్యమైనంత త్వరగా కేసు నమోదు చేసి దోషులకు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి నాగర్ కర్నూలు పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొనగా నిర్మాణాత్మక చర్చలు జరిగాయి.ఈ సమావేశంలో 2018 నుంచి నమోదు అయిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు, వాటి విచారణ, ప్రస్తుతం కేసు ఏ స్థాయిలో ఉన్నాయి, బాధితులకు అందిన పరిహారం పై ఒక్కో కేసు వారిగా సమీక్ష నిర్వహించారు. 2025 నుండి 2026 వరకు విచారణలో ఉన్న 12 కేసులపై కేసు వారిగా చర్చించారు. జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి కేసు వారిగా వాటి పురోగతి స్థితిగతులను కమిటి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ 2020 నుండి 2026 వరకు ఒక్క కేసు నేరారోపణ జరగలేదని ఇందుకు బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. తప్పు చేసిన వారికి చట్టం ప్రకారం ఖచ్చితంగా శిక్ష పడాలని బాధితులకు న్యాయం జరగాలన్నారు. ఒకవేళ తప్పుడు కేసులు నమోదు చేస్తే విజిలెన్స్ కమిటీ సభ్యులు నచ్చచెప్పి కేసు ఉపసంహరించుకునే విధంగా చూడాలని సూచించారు. తప్పుడు కేసులు పెట్టడం, తప్పు చేసినప్పటికీ శిక్ష పడకుండా బయట దర్జాగా తిరుగుతుండటం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని చెప్పారు. అట్రాసిటీ కేసు నమోదు అయిన వాటిని సమగ్రంగా విచారించి తగిన ఆధారాలతో ఛార్జి షీట్ దాఖలు చేసి తప్పు చేసిన వారికి శిక్షలు పడే విధంగా చూడాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.2020 లో నమోదు అయిన ఒక కేసు 2026లో ట్రయల్ కొరకు రావడం ఇంకా తేది ఖరారు కాకపోవడం పై విస్మయం వ్యక్తం చేశారు.వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హాజరు కాకపోవడం చర్చనీయాంశం అయ్యింది.ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో భూ సమస్యలు, ఎస్సీ ఎస్టీల భూములు కబ్జా వంటి కేసులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఎస్సీ ఎస్టీలకు న్యాయం చేకూర్చి అండగా నిలవాలని పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.ప్రతినెల పౌర హక్కుల దినోత్సవం పకడ్బందీగా నిర్వహించి ఎస్సీ ఎస్టీలకు చట్టంపై అవగాహన కల్పించి




భరోసా ఇవ్వాలని అధికారులకు కమిటీ సభ్యులకు సూచించారు. సంక్షేమ శాఖల అధికారులతో ఆయా సంక్షేమ శాఖల ద్వారా మంజూరు అయిన సంక్షేమ పథకాల పై శాఖల వారిగా ఆరా తీశారు. ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో లబ్ధి చేకూర్చే విధంగా సంక్షేమ శాఖ అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా మెస్ ఛార్జీలు కాస్మోటిక్ చార్జీలు వంటివి పెంచి విద్యార్థులకు అండగా నిలిచేందుకు కృషి చేస్తుంటే వసతి గృహాల్లో వార్డెన్లు సరిగ్గా ఉండటం లేదని, దాని పర్యావసానంగా విద్యార్థులు నష్టపోతున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న స్థానిక శాసనసభ్యులు తూడి మెగా రెడ్డి మాట్లాడుతూ వనపర్తి పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించడమే కాకుండా తాను సైకిళ్లు, ఇతర సహకారం అందించడం వల్ల గత సంవత్సరం కంటే ఈసారి విద్యార్థుల నమోదు.శాతం గణనీయంగా పెరిగిందని, వారికి అదనంగా వసతి గృహాలు మంజూరు అయ్యేవిధంగా చూడాలని పార్లమెంట్ సభ్యులను కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసుల్లో తప్పు చేసిన వారికి శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలనీ అందుకు లైన్ డిపార్ట్మెంట్ అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. పౌర హక్కుల దినోత్సవం ప్రతి నెల సజావుగా నిర్వహించడం జరుగుతోందని దీనిని మరింత పకడ్బందీగా నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. అట్రాసిటీ కేసులో బాధితులకు పరిహారం అందించే విషయంలో దాదాపు 75 లక్షల రూపాయలు పరిహారం అందించాల్సి ఉన్నా నిధులు మంజూరు కాకపోవడం వల్ల పెండింగ్ లో ఉన్నాయని, నిధులు మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ సభ్యులను కోరారు. ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యుడు మాదారి భోజరాజు కొన్ని సమస్యలను కమిటి దృష్టికీ తీసుకువచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్య నాయక్, జడ్పీ సీఈవో యాదయ్య, షెడ్యూల కులాల సంక్షేమ అధికారి రాంజీ రావు, ఈ డి ఎస్సి కార్పొరేషన్ సిరాజుద్దీన్ , ఆర్డిఓ సుబ్రహ్మణ్యం పిడి డి ఆర్ డి ఓ ఉమాదేవి, కమిటీ సభ్యులు డి.పి ఆర్.ఓ సీతారాం, డి డబ్ల్యు ఓ సుధారాణి, సి. విశ్వం బాబు, శంకర్ నాయక్, నాగన్న, రామచంద్రయ్య, వీరప్ప మాదారి భోజరాజు, స్వచ్ఛంద సంస్థల నుండి చిన్నమ్మ థామస్, వెంకట గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగష్టు 10న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ పిలుపు



వనపర్తి జిల్లా ప్రతినిధి,జులై 16 (విజన్ ఆంధ్ర)కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగష్టు 10న జరగనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల సంయుక్త జిల్లా సదస్సుకు ఆయన ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి బీజేపీ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో డిస్కమ్‌లు ఏర్పాటు చేసి రైతు మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టే దుర్మార్గపు విధానాన్ని వ్యతిరేకించాలన్నారు. మహాత్మా ఉపాధి హామీ పథకం పేరు మార్చి, జూలై 1 నుంచి కొత్త చట్టం అమలు చేస్తున్నారని, కేంద్రం నిధుల వాటాను 90% నుంచి 60%కి తగ్గించి రాష్ట్రాలపై 40% భారం మోపిందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని దుయ్యబట్టారు.ఈ విధానాలకు వ్యతిరేకంగా మండల, గ్రామ స్థాయిల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు నిర్వహించాలని తీర్మానించారు. ఆగష్టు 10న జిల్లా కేంద్రాల్లో జరిగే జైలు భరో కార్యక్రమంలో రైతులు, కార్మికులు, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సదస్సుకు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.ఎన్.రమేష్, టీఎస్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.అజయ్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేశ్వర చారి అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మండ్ల రాజ, టీఎస్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ సంచార లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సేవలు

### డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డి.కృష్ణయ్య

వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 16 (విజన్ ఆంధ్ర)ఉచిత న్యాయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డి.కృష్ణయ్య అన్నారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.కళార్చన ఆదేశాల మేరకు బుధవారం జిల్లాలోని అమడబాకుల గ్రామం, విలియం కొండ పాఠశాల, పెబ్బేరు మండలంలోని హమాలి సంఘం కార్మికులకు చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం, మోటార్ వాహన చట్టం, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్స్, లేబర్ చట్టం, లేబర్ కార్డుల గురించి వివరించారు. మొబైల్ సంచార లోక్ అదాలత్ ద్వారా గ్రామాల్లోనే మెరుగైన న్యాయ సేవలు పొందవచ్చున్నారు. తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన




న్యాయ అవగాహన లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ శ్రీదేవి, గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హమాలి కార్మికులు పాల్గొన్నారు.

# స్మార్ట్ క్లాస్‌రూమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

### నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి

వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 16 (విజన్ ఆంధ్ర) విద్యార్థులు ఆధునిక సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు.గురువారం వనపర్తి జిల్లా మర్రికుంట కేజీబీవీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్‌ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఆయన ప్రారంభించారు. స్మార్ట్ బోర్డుపై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సంతకం చేశారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్య అందించేందుకు హెచ్‌డీఎఫ్‌సీ సీఎస్‌ఆర్ నిధులతో జిల్లాలో రూ. 1.35 కోట్ల వ్యయంతో 16 ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.9వ తరగతి విద్యార్థులతో ముచ్చటించిన ఎంపీ, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని కష్టపడి చదివి పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతతో పాటు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



మాట్లాడుతూ, స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల ద్వారా బోధన మరింత ప్రభావవంతంగా మారి విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలు పెరుగుతాయన్నారు.కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ డీఎం శివకుమార్, హెచ్‌డీఎఫ్‌సీ మహబూబ్‌నగర్ క్లస్టర్ హెడ్ ప్రవీణ్ కుమార్ ఝా, జీఐబీ స్టేట్ హెడ్ పి.జె.శ్రావణ్ కుమార్, బ్రాంచ్ మేనేజర్‌లిసి. హెచ్.వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యాదవ్ ల పై అనుచిత వాక్యలు చేసిన జక్కిడి శివ చరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

### -మల్కాజిగిరి యాదవ సంఘాల నాయకులు డిమాండ్

మల్కాజిగిరి, జూలై 16,(విజన్ ఆంధ్ర): యాదాద్రి యాదగిరి లక్ష్మీ నారసింహా స్వామి దేవస్థానం బోర్డు సభ్యులు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ పై అనుచిత వాక్యలు చేసిన జక్కిడి శివ చరణ్ రెడ్డి పై తగిన చర్యలు తీసుకోవాలనిమల్కాజిగిరి యాదవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు, ఆమెనుకలిసి తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి యాదవ సంఘాల నాయకులు మాట్లాడుతూ..నారసింహా స్వామి దేవస్థానం బోర్డు సభ్యులు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ పై అనుచిత వాక్యలు చేసిన జక్కిడి శివ చరణ్ రెడ్డి యాదవ్ కులస్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. ఒక బజారు రౌడీగా ప్రవర్తించిన అతనికి యూత్ కాంగ్రెస్ పదవికి అనర్హుడు అని, ఆ పదవి నుండి ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ యూత్ విభాగానికి రాష్ట్ర అధ్యక్షుడు గా ఉండి ఆయన ఇలా మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రేపటి తరం యువతకి ఏ విధమైన సందేశం ఇస్తున్నారని, ఇలాంటి వారి వల్ల సమాజానికి కీడు



జరుగుతుందని, ఇకనైనా పద్దతి మార్చుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని యాదవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘాల నాయకులు మండలి రాధాక్రిష్ణ యాదవ్, పూలపల్లి సుందర్ యాదవ్, ఆకుల బాలేష్ యాదవ్, గోట్ల వెంకటేశ్ యాదవ్, ఎం ఆర్ శ్రీను యాదవ్, శెట్టి వెంకటేశ్ యాదవ్, చిలుకల చందర్ యాదవ్, మండల వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి: ప్రేమ్ కుమార్



మల్కాజిగిరి, జూలై 16,(విజన్ ఆంధ్ర): కాలనీలలో ప్రజలకు అవసరమైనమౌలిక సదుపాయాల కల్పనపై తాను ప్రత్యేక దృష్టి సారించానని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధి లోని బ్యాంకు కాలనీలో 22 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన, కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ..అన్ని కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు,విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు కాలనీ అసోసియేషన్ సభ్యులు తులసీదాస్, ఈశ్వర్, వాసుదేవరావు, యాదగిరి, మూర్తి, భార్గవి, సూర్య, సురేష్, బాబు, ప్రవీణ్, సిద్ధూ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు

## కృష్ణమోహన్ సమర్పణలో సందేశాత్మక నాటిక "ప్రేమకు-పరాకాష్ఠ" ప్రదర్శన



హైదరాబాద్ జూలై 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 50 ఏళ్ళ కు పైగా ఘన చరిత్ర కలిగి ఉన్న ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'రవి అండ్ రవి ఆర్ట్స్ అసోసియేషన్' నిర్వహణలో సందేశాత్మక నాటిక "ప్రేమకు - పరాకాష్ట" 385 వ ప్రదర్శనకు ప్రేక్షకుల నుండి విశేష స్పందన లభించింది. ప్రముఖ జోతిష్య పండితులు తెలుగు వెలుగు సాహితీ సాంస్కృతిక సంస్థ మల్లాపూర్, హైదరాబాద్ 66వ వార్సికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సందేశాత్మక నాటిక "ప్రేమకు పరాకాష్ఠ" 385వ ప్రదర్శనను, కాన్ఫరెన్స్ హాల్ సమావేశ మందిరం" మొదటి అంతస్తు, రవీంద్రభారతి, హైదరాబాద్ లో మంగళవారం సాయంత్రం ఆకట్టుకునేలా ప్రదర్శించారు. ఈ సందేశాత్మక నాటిక ప్రదర్శన రచన, నటన, నిర్వహణ దర్శకత్వం "రక్తకన్నీరు నాగభూషణం", "బళ్ళారి రాఘవ" బిరుదుల గ్రహీత, ప్రఖ్యాత నటుడు మాడుగుల కృష్ణమోహన్ ఈ నాటికలో ముఖ్య పాత్ర ఐన ప్రసాద్ పాత్రలో అద్భుతంగా నటించి అందరి ప్రశంశలను అందుకున్నారు. సహజనటి, నటచంద్రికళ, చలాకీ తార బిరుదుల గ్రహీత ప్రముఖ నటీమణి జి. మనుప్రియ ప్రమీల పాత్రలో, గోవింద రాజుల నాగేశ్వర రావు ధనుంజయ పాత్ర అలాగే గోవింద్ సత్యనారాయణ ఆటో డ్రైవర్ పాత్రలో నటించి ప్రేక్షకులను ఆలోచింపజేసి అలరించారు. వివాహ బంధం అంటే భార్యా భర్తలు ఒకరిని ఒకరు అర్థం చేసుకుని సుఖ సంతోషాలతో ఆనందంగా బతకాలనే గొప్ప సందేశాన్ని తెలుపుతూ, ప్రదర్శించిన "ప్రేమకు-పరాకాష్ఠ"నాటిక గొప్ప సందేశాన్ని అందించింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా డాక్టర్. నాలేశ్వరం శంకరం కవి, రచయిత, సాహితీవేత్త, డాక్టర్. కంద్రాతి సాంబశివరావు ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం, హైమావతి సహజనటి ప్రముఖ రంగస్థల టీవీ సినీ నటీమణి, వీరబొమ్మరమేష్ ఆడిటర్, బాషా చార్టెడ్ అకౌంటెంట్, ఎం.వి.వి. సత్యనారాయణ కళాభిమాని హాజరైయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుపులిగడ్డ హనుమంతరాయ శర్మ,ప్రముఖ జ్యోతిష్యపండితుడు, మురళీకృష్ణారెడ్డి "యూట్యూబ్ ఫేం" హాజరై సంస్థ సంస్థ 'రవి అండ్ రవి ఆర్ట్స్ అసోసియేషన్' తరఫున పురస్కారాలు అందుకున్నారు. అలాగే నటి జి. మనుప్రియ కు "నటకళాస్రవంతి" పురస్కారం ప్రదానం చేశారు. అతిథులు కృష్ణమోహన్ బృందానికి తమ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# ల్యాండ్ చీటింగ్ కేసులో నిందితుడి అరెస్టు



సూర్యాపేట చివ్వేంల, జూలై 16:(విజన్ ఆంధ్ర)అయిలాపురం గ్రామ శివారులో ఉన్న భూమిని ప్లాట్లుగా విక్రయిస్తానని చెప్పి, ఇతరుల భూమిని తనదిగా నమ్మబలికి కోడదల వెంకన్న, కోడదల కనకయ్యల వద్ద నుంచి భారీ మొత్తంలో నగదు వసూలు చేసిన కాసర్ల సురేందర్ రెడ్డి, అనంతరం భూమిని రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితుడు కోడదల వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది.కేసు దర్యాప్తును చివ్వెంల ఎస్ఐ వి. మహేశ్వర్ చేపట్టగా, విచారణలో సంబంధిత భూమి కాసర్ల సురేందర్ రెడ్డికి చెందినది కాదని, ఇతరుల భూమిని తనదిగా చూపించి బాధితులను మరియు ఇతరులను కూడా మోసం చేసినట్లు తెల్సింది. భాదితులు ఎవరైనా ఉంటే పోలీస్ ల ను ఆశ్రయించగలరు.దర్యాప్తులో సేకరించిన ఆధారాల మేరకు నిందితుడు కాసర్ల సురేందర్ రెడ్డి తండ్రి దామోదర్ రెడ్డి ను గురువారం సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ జి. రాజశేఖర్ అరెస్టు చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది.భూముల కొనుగోలు, విక్రయాల సందర్భంగా సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, యాజమాన్య హక్కులను రెవెన్యూ అధికారుల ద్వారా ధృవీకరించుకున్న అనంతరమే లావాదేవీలు నిర్వహించాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# ఆపరేషన్ ముస్కాన్12లో భాగంగా 8 మంది బాలలను రక్షించిన అధికారులు

అయిజ జూలై 16 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా సంబంధిత శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ ' 12 కార్యక్రమంలో భాగంగా బుధవారం అయిజ పట్టణంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పెంటర్ షాపుల్లో బాల కార్మికులుగా పనిచేస్తున్న 5 మంది బాలలను, బైక్ మెకానిక్ షాపుల్లో పనిచేస్తున్న 2 మంది మైనర్ బాలులను గుర్తించి రక్షించారు. అదేవిధంగా గొర్రెల కాపరిగా పనిచేస్తున్న ఒక బాలుడిని కూడా అధికారులు రక్షించారు.రక్షించిన మొత్తం 8 మంది బాలలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సి డబ్ల్యూసి) ఎదుట హాజరుపరచనున్నట్లు సహాయ కార్మిక అధికారి వేణుగోపాల్, బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్ తెలిపారు.గొర్రెల కాపరిగా బాలుడిని పనిలో పెట్టుకున్న యజమానిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు వారు వెల్లడించారు.ఈ సందర్భంగా బాలలను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమని, 14 సంవత్సరాల లోపు పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ పనిలో నియమించరాదని, అలాగే 14 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలలను ప్రమాదకర పనుల్లో నియమించడం కూడా నేరమని ప్రజలకు సూచించారు. బాల కార్మికులను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి బాలల రక్షణకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ కానిస్టేబుల్ (బ్లూజ) సుధారాణి, పోలీస్ కానిస్టేబుల్ భరత్ పాల్గొన్నారు.



## కేసుల విచారణలో నాణ్యతే లక్ష్యం - ఎస్పీ రాజేష్ చంద్ర






కామారెడ్డి బ్యూరో జులై 16 (విజన్ఆంధ్ర)కేసుల విచారణలో నాణ్యతే లక్ష్యం అని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు.సీసీటీఎన్ఎస్-2.0, ఆధునిక పోలీసింగ్ సాఫ్ట్‌వేర్‌లపై జిల్లా స్థాయి రైటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.కేసుల విచారణలో నాణ్యతే లక్ష్యం బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రతి పోలీసు అధికారి బాధ్యతగా కృషి చేయాలి సూచించారు.సీసీటీఎన్ఎస్-2.0ను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని సిబ్బందిని ఆదేశించారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల రైటర్లు, సీఐ కార్యాలయాలు ,డీఎస్పీ కార్యాలయాల రైటర్లకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం సీసీటీఎన్ఎస్-2.0 ఇతర ఆధునిక పోలీసింగ్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, పాల్గొని రైటర్లకు పలు కీలక సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే ప్రతి బాధితుడికి వేగవంతంగా, పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందన్నారు. బాధితుల సమస్యల పరిష్కారంలో రైటర్ల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.కేసుల దర్యాప్తు, విచారణ, పరిశోధనలో నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన దశ నుంచి చార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ప్రతి వివరాన్ని సమగ్రంగా, స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. సాక్షులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు కేసుల విజయవంతమైన విచారణలో కీలక పాత్ర పోషిస్తాయని, తప్పుడు లేదా అసంపూర్ణ సమాచారం కేసులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్-2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి ఆధునిక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి అవగాహనతో పని చేసి, నేరాల నియంత్రణలో మరింత సమర్థవంతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. సీసీటీఎన్ఎస్-2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజలకు చేరువగా అందించవచ్చని పేర్కొన్న ఎస్పీ , సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం ద్వారా దర్యాప్తు నాణ్యతతో పాటు ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు."బాధితుడికి సమయానికి న్యాయం లభిస్తేనే చట్టంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది. ఆ విశ్వాసాన్ని నిలబెట్టడం ప్రతి పోలీసు అధికారికి ఉన్న అత్యంత ముఖ్యమైన బాధ్యత" అని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ శిక్షణ కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఇతర పోలీసు అధికారులు, జిల్లా లోని అని పోలీస్ స్టేషన్ రైటర్లు, సీఐ డీఎస్పీ కార్యాలయాల రైటర్లు తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ ఓం ప్రకాష్ ను ఘనంగా సన్మానం



దుబ్బాక విజన్ ఆంధ్ర రిపోర్టర్ సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఓం ప్రకాష్ ఘనంగా కస్టమర్లు సన్మానం చేశారు. ఈ సందర్భంగా 2024 నుండి 2026 వరకు రెండు సంవత్సరాలు కష్టమర్లకు సేవలు అందించి ఈరోజు నంగునూరు బ్రాంచ్ కు బదిలీ అయ్యారు. సందర్భంగా ఓం ప్రకాష్ మీనం మేనేజర్ మాట్లాడుతూ తిమ్మాపూర్ పరిధిలోని ఏడు గ్రామాల ప్రజలతో సన్మాన నిలకలపై యూనియన్ బ్యాంకు ను తిమ్మాపూర్ జిల్లాలోని అగ్రస్థానం నిలబెట్టారు. ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని మళ్లీ కొత్త ఉత్సవంతో నూతన స్థానంలో పనిచేస్తానని మేనేజర్ గా బదిలీ అయినా ఓం ప్రకాష్ పేర్కొన్నారు. నూతన మేనేజర్ గా కె వీరేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దినేష్ కుమార్ మనోజ్ పవర్ ప్రత్యూష ఫీల్డ్ ఆఫీసర్ సింగ్ క్లర్క్ కృష్ణ సహాయకుడు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలుకు ఏర్పాట్లు వేగవంతం

### ఆహార తయారీ కేంద్రాల కోసం భవనాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, జూలై 16 (విజన్ ఆంధ్ర బ్యూరో): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం వేగవంతం చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించే కార్యక్రమానికి అవసరమైన ఆహార తయారీ కేంద్రాల ఏర్పాటుకు అనువైన భవనాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు.సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని పలు ప్రభుత్వ భవనాలను సందర్శించిన కలెక్టర్, వంటశాలల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్థల విస్తీర్ణం, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించేందుకు అన్ని ఏర్పాట్లు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ (హెచ్‌కేఎంసీఎఫ్) ప్రతినిధులతో కలిసి పథకం అమలుకు సంబంధించిన అంశాలపై చర్చించారు. జిల్లాలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు మహేష్, జయంత్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాన్సువాడ డివిజన్‌లో శారీరక దివ్యాంగుల కోసం ప్రత్యేక యు డి ఐ డి (సదరం) క్యాంపు



కామారెడ్డి బ్యూరో జులై 16(విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ చంద్ర,సంయుక్తంగా 12-07-2026 (ఆదివారం) బాన్సువాడ డివిజన్‌కు చెందిన శారీరక దివ్యాంగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక యుడిఐడి(సదరం) క్యాంపును ప్రారంభించారు.జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా బాన్సువాడ డివిజన్ పరిధిలోని శారీరక దివ్యాంగులకు స్థానికంగానే యుడిఐడి (సదరం) సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేయబడిందని అన్నారు. బుధవారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయింది. ట్రయల్ రన్ సందర్భంగా దివ్యాంగుల నమోదు, వైద్య మూల్యాంకనం ఇతర ప్రక్రియలు సజావుగా నిర్వహించబడ్డాయి, (సదరం) క్యాంపులు ప్రతి నెలలో రెండుసార్లు బాన్సువాడ డివిజన్‌లో నిర్వహించబడనున్నాయి. దీని ద్వారా శారీరక దివ్యాంగులు తమ ప్రాంతంలోనే సులభంగా సేవలను పొందే అవకాశం కలుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్ పోలీసు సూపరింటెండెంట్ , వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్య బృందం సంబంధిత శాఖల అధికారులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ( డి ఆర్ డి ఏ), కామారెడ్డి జిల్లా తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# భూ భారతి రీ-సర్వే కార్యక్రమంలో ప్రతి గ్రామస్థుడు భాగస్వామి కావాలి

### గుర్రంగడ్డలో శ్రీ జమ్మమ్మ అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ కలెక్టర్లు నన్నూరి మనోజ్ కుమార్ రెడ్డి, జి. రాజ్ కుమార్

గద్వాల జూలై 16( విజన్ ఆంధ్ర బ్యూరో)భూ భారతి రీ-సర్వే కార్యక్రమంపై గ్రామీణ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలంలోని గుర్రంగడ్డ గ్రామాన్ని డిప్యూటీ కలెక్టర్లు నన్నూరి మనోజ్ కుమార్ రెడ్డి, జి. రాజ్ కుమార్ సందర్శించి గ్రామసభ నిర్వహించారు.కృష్ణా నది ఒడ్డున ఉన్న ప్రత్యేక భౌగోళిక పరిస్థితులు కలిగిన గుర్రంగడ్డ గ్రామానికి ప్రస్తుతం నదిలో నీటి మట్టం తగ్గిపోవడంతో గ్రామస్థులు స్వయంగా ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక దారి ద్వారా అధికారులు గ్రామానికి చేరుకున్నారు. గ్రామసభలో భూ భారతి రీ-సర్వే కార్యక్రమం లక్ష్యాలు, భూ రికార్డుల ఖచ్చితత్వం, రైతులకు కలిగే ప్రయోజనాలు, భవిష్యత్తులో భూ వివాదాల నివారణ, రికార్డుల పారదర్శకత వంటి అంశాలపై గ్రామస్థులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్థులు తమ సమస్యలు, అభిప్రాయాలను అధికారులతో పంచుకున్నారు.గ్రామస్థులు మాట్లాడుతూ, కృష్ణా నది పూర్తిస్థాయిలో ప్రవహించే సమయంలో గుర్రంగడ్డకు పడవ మార్గం తప్ప మరో మార్గం ఉండదని తెలిపారు. సుమారు ఏడు సంవత్సరాల క్రితం మంజూరైన వంతెన నిర్మాణం ఇప్పటికీ సగంలోనే నిలిచిపోయిందని, దీంతో వర్షాకాలంలో గ్రామ ప్రజలు విద్య, వైద్యం, అత్యవసర సేవలు, నిత్యావసరాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వంతెన నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను కోరారు.అదేవిధంగా ప్రభుత్వం అన్ని వసతులతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనం సిద్ధంగా ఉన్నప్పటికీ, అంగన్‌వాడీ టీచర్ మరియు ఆయా పోస్టులు ఖాళీగా ఉండటంతో



ఇప్పటివరకు కేంద్రం ప్రారంభం కాలేదని గ్రామస్థులు వివరించారు. దీంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వం అందించే సేవలకు దూరమవుతున్నారని పేర్కొంటూ వెంటనే సిబ్బందిని నియమించి కేంద్రాన్ని ప్రారంభించాలని కోరారు.డిప్యూటీ కలెక్టర్లు అనంతరం గద్వాల ప్రాంత ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ జమ్ములమ్మ అమ్మవారి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, స్థానికులు మాట్లాడుతూ గుర్రంగడ్డే జమ్ములమ్మ అమ్మవారి జన్మస్థలమని పేర్కొంటూ, ఈ ప్రాంతానికి ఆధ్యాత్మికంగా విశేష ప్రాధాన్యత ఉందన్నారు. కృష్ణా నది ఒడ్డున ఉన్న ఆలయాన్ని ఘాట్ మెట్లు, స్నాన ఘట్టాలు, చేంజింగ్ రూములు, యాత్రికులకు విశ్రాంతి కేంద్రాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని కోరారు.ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ నన్నూరి మనోజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,గుర్రంగడ్డ గ్రామానికి ప్రత్యేకమైన భౌగోళిక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. గద్వాల ప్రాంత ప్రజల ఆరాధ్య దైవమైన జమ్ములమ్మ అమ్మవారి జన్మస్థలంగా గ్రామస్థులు విశ్వసిస్తున్న ఈ ప్రాంతం, కృష్ణా నది ఒడ్డున ఉన్న సహజ అందాలు, పడవ విహారానికి ఉన్న అవకాశం, స్థానిక చేపల వంటకాలు వంటి ప్రత్యేకతలతో పర్యాటక అభివృద్ధికి ఎంతో అనుకూలంగా ఉంది. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి చేస్తే గుర్రంగడ్డ భవిష్యత్తులో జమ్ములమ్మ ఆధ్యాత్మిక క్షేత్రంగా, జూరాల తరహా పర్యాటక కేంద్రంగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఉంది. గ్రామస్థులు వినిపించిన వంతెన నిర్మాణం, ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ ప్రారంభం, తాత్కాలిక దారికి సంబంధించిన బిల్లులు, భూమిలేని పేదలకు భూమి కేటాయింపు వంటి అంశాలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం." అని తెలిపారు.డిప్యూటీ కలెక్టర్ జి. రాజ్ కుమార్ మాట్లాడుతూ,గుర్రంగడ్డ గ్రామం భౌగోళికంగా ప్రత్యేక పరిస్థితులు కలిగిన గ్రామం. ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించాము. వంతెన నిర్మాణం పూర్తికావడం, తాత్కాలిక దారికి సంబంధించిన బిల్లుల చెల్లింపు, హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు, అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం వంటి అంశాలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం. అదే సమయంలో భూ భారతి రీ-సర్వే కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి గ్రామస్థుడు పూర్తి సహకారం అందించి తమ భూ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని కోరుతున్నాము అని అన్నారు.గ్రామస్థులు కూడా భూ భారతి రీ-సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తామని డిప్యూటీ కలెక్టర్లకు హామీ ఇచ్చారు.

## నేడుకామారెడ్డి లో దిశా సమీక్ష సమావేశం

కామారెడ్డి బ్యూరో జులై 16 (విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిశుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో దిశ సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, అధికారులు హాజరవుతారని, మీడియా మిత్రులు సకాలంలో హాజరై సమావేశాన్ని కవరేజ్ చేయగలరని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా నాణ్యమైన బోధన అందించాలి

### బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేక దృష్టి

### విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ జిల్లా ప్రతినిధి జులై 16 (విజన్ ఆంధ్ర) ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థినులు ఉత్తమ విద్యా ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని, సులభంగా అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. గురువారం హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యా బోధన, విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా అందిస్తున్న మైసూర్ బోండాను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేశారు. ప్రతిరోజూ అందిస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి, మెనూ గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలోని మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యాలను పరిశీలించి, ఆర్వో వాటర్ ప్లాంట్ పనితీరును తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందించే ఆహారం పరిశుభ్రంగా, పోషకాహార ప్రమాణాలతో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థినులతో ప్రత్యేక సమావేశంఅనంతరం ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సుల విద్యార్థినులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో నేరుగా మాట్లాడారు. ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఫిజిక్స్ పాఠ్యాంశానికి సంబంధించిన అంశాలను బోర్డుపై రాసి వాటిపై ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరీక్షించారు. వివిధ సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి, చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థినికి సులభంగా అర్థమయ్యే విధంగా అధ్యాపకులు పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన సాగించాలన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ఫిజిక్స్ వాలా తరగతులను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే నీట్, జేఈఈ తదితర జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా విద్యార్థినులను తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులు కూడా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అజ్మీర గోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ కవిత, అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు

## పత్రికల్లో నాపై చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం



బద్వేలు, జూలై 16 (విజన్ ఆంధ్ర) బద్వేలు పట్టణంలో నిన్నటిదినం నాపై దర్శి చెన్నకేశవులు, వారి బంధువులు నాపై దుర్భాషలాడుతూ పత్రికా ముఖంగా నాపై లేనిపోని ఆరోపణ చేశారని 2023వ సంవత్సరంలో పట్టణంలోని వెంకటయ్య నగర్ లో ఉన్న హజరత్ అయ్యా దగ్గర ఆరు లక్షల 70 వేలకు కొన్న ఇంటి స్థలాలను దర్శి చెన్నకేశవులు వికలాంగు రాయులైన వారి చెల్లెల్ని అడ్డం పెట్టుకొని ఆ ఇంటి స్థలాలు ఆక్రమించు కోవాలని దురుద్దేశంతో నాపై గొడవలు పడుతూ నన్ను అవమానించడం సరికాదన్నారు. బద్వేలు మున్సిపాలిటీ చెన్నంపల్లి గ్రామ పొలంలోని సర్వే నెంబర్ 1581 లో ప్రభుత్వం నివాస స్థలాలకు ఇచ్చిన నూ అశీ 278/1405 లో సర్వేనెంబర్ 1581 లోని ఫ్లాట్ నంబర్ 197,198 వరికుంట్ల వెంకటసుబ్బమ్మ మరియు సోమశిల లక్ష్మీదేవి లకు సంబంధించిన ఇంటి స్థలాలను తాను కొన్నట్లు తెలిపారు. ఈ విషయంపై 2023 లో దర్శి చెన్నకేశవులు కోర్టులో వేయగా 23 .9. 2025న కోర్టు దానిని డిస్మిస్ చేశారని అన్నారు. అనంతరం 2026 లో తాసిల్దార్ ఉదయభాస్కర్ రాజు మాకు హక్కు కలిగి ఉన్నట్లు ఎండార్స్మెంట్ కూడా ఇచ్చారని తెలిపారు. అయినను వికలాంగురాలు అయిన తన చెల్లెల్ని వెంటపెట్టుకొని మాపై దౌర్జన్యం చేస్తూ పత్రికా ముఖంగా కూడా నా వ్యక్తిగత విషయాలను బహిర్గతం చేస్తూ నన్ను అవమానిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం నాకు న్యాయం చేయాలని కోరారు.

## సిబిఐటీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు –టీఎస్ టీసీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు అయినేని సంతోష్ కుమార్ వెల్లడి

హైదరాబాద్, జూలై 16 (విజన్ ఆంధ్ర) : సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు, ఎం.శివరెడ్డి, యాజమాన్య ప్రతినిధి ఎన్. సుభాష్‌లపై ఎస్సీ, ఎస్టీ(అట్రాసిటీస్) చట్టం కింద కేసు నమోదైనట్లు తెలంగాణ స్టేట్ టెక్నికల్ కాలేజీ ఎంప్లాయీస్ అసోసియేషన్(టీఎస్ టీసీఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు అయినేని సంతోష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలోని ఈసీఈ విభాగంలో పనిచేస్తున్న నాన్–టీచింగ్ ఉద్యోగి సంజీవ్‌ను కులం పేరుతో దూషించి వేధించారంటూ చేసిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో జూలై 13న ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధితుడికి న్యాయం చేయాలని సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ సాంకేతిక విద్యాసంస్థల ఉద్యోగులకు తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్–1982 ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు

# మంత్రులు హడావిడిగా ప్రారంభోత్సవాలు

### అభివృద్ధికి మాత్రం నిధులు ఇచ్చింది శూన్యం

### బి ఆర్ ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు, బీఎస్.కేశవ్



గద్వాల జూలై 16 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గద్వాల నియోజకవర్గ ఇన్చార్జిబాసు హనుమంతు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,నియోజకవర్గానికి మంత్రులు వచ్చినప్పుడు కాంగ్రెసులో వర్గాల హడావుడి,ఆధిపత్యల పోరు తప్పా గద్వాలకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కనీసం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మంత్రులు నియోజకవర్గంలో పర్యటించడం సిగ్గుచేటు అని అన్నారు. గద్వాల నియోజకవర్గ ప్రజలను రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనూ తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ట్రాన్స్ఫర్ల ఓపెనింగ్ కి వచ్చిన ఉపముఖ్యమంత్రి కనీసం మా నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులపై ఎందుకు మాట్లాడలేదని అని ప్రశ్నించారు. ట్రాన్స్ఫార్మర్లు సబ్ స్టేషన్ ఓపెనింగ్ వచ్చిన ఉపముఖ్యమంత్రి గాలి మోటర్ల లో పోవడానికి టైం అయితుందని,చెప్పి,కనీసం నియోజకవర్గ అభివృద్ధి నిధులపై, ప్రజల సమస్యల గురించి మాట్లాడకుండా వెళ్లిపోవడం పై నియోజకవర్గ ప్రజలపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన పనులే కానీ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కనీసం పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయకుండా, కాలయాపన చేస్తున్నారని అన్నారు. ర్యాలంపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక్క కిలోమీటర్ దూరంలో ఉన్న ర్యాలంపాడు రిజర్వాయర్ ను సందర్శించకపోవడం పై మండిపడ్డారు. ప్రస్తుతం మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క ట్రాన్స్ఫార్మర్ మంజూరు కావడానికి నెలలు పడుతున్నాయని, రైతులు పంటలు ఎండిపోతున్న ప్రభుత్వం కనీసం పట్టించుకోవడంలేదని విమర్శించారు. మొన్న ధరూర్ మండల కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సభలో మీ మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పై సభకు వచ్చిన మహిళలు తిరుగుబాటే మీ ప్రభుత్వ పాలన యొక్క నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జి.రాఘవేంద్ర రెడ్డి, కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్, టిఆర్ఎస్ పార్టీ మా

## విద్యార్థుల భావి జీవితానికి ఉపాధ్యాయులే బలమైన పునాది

### నాణ్యమైన బోధనతో పాటు ఆంగ్ల భాష, కృత్రిమ మేధస్సుపై అవగాహన పెంపొందించాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ జిల్లా ప్రతినిధి జులై 16 ( విజన్ ఆంధ్ర ) ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి భావి జీవితానికి బలమైన పునాదిని పాఠశాల స్థాయిలోనే ఉపాధ్యాయులు వేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ సుబేదారిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఇన్–సర్వీస్ టీచర్ ట్రైనింగ్ (రెండో విడత) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడి, శిక్షణ ద్వారా నేర్చుకుంటున్న అంశాలు, వాటిని తరగతి గదిలో ఎలా అమలు చేయనున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. బోధనా నైపుణ్యాల పెంపు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఇటువంటి శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ముఖ్యంగా ఆంగ్ల భాషపై పట్టు పెంపొందేలా బోధన సాగించాలని, తద్వారా వారి ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్ కెరీర్‌కు బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. ఉపాధ్యాయులు తరగతి గదిలోకి వెళ్లే ముందు పాఠ్యాంశంపై పూర్తి స్థాయిలో సిద్ధమై బోధించాలని, ఆధునిక బోధనా పద్ధతులను అనుసరించి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ అత్యుత్తమ విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అదేవిధంగా, విద్యా రంగంలో వేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ˙ ఏఐ ) వినియోగంపై ఉపాధ్యాయులు అవగాహన పెంపొందించుకోవాలని, విద్యార్థులకు కూడా దాని ఉపయోగాలు, అవకాశాలపై సరైన మార్గదర్శనం చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ పాఠశాల విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, అభ్యాస పద్ధతులు, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించిన కలెక్టర్ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం అనంతరం పాఠశాల ఆవరణలోని వంటశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం ఏ వంటకాలు సిద్ధం చేస్తున్నారని వంట నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆ రోజు ఆలూ కర్రీ తయారు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలపగా, వండిన అన్నం, కూర నాణ్యతను పరిశీలించారు. కిచెన్ షెడ్డులో పరిశుభ్రత, ఆహార తయారీ విధానాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పరిశుభ్రమైన, నాణ్యమైన, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ మన్మోహన్, ఎంఈఓ నెహ్రూ నాయక్, ఉపాధ్యాయులు, శిక్షణలో పాల్గొన్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుందాం

### డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూలై 16 (విజన్ ఆంధ్ర)హనుమకొండ జిల్లా 60వ డివిజన్‌లో నిర్వహించిన ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పాల్గొని డివిజన్ లో సర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి తగు సూచనలు చేసారు. ఈ సందర్భంగా డా. రామకృష్ణ పెరుమాండ్ల మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కు ప్రతి పౌరుడికి అమూల్యమైన ప్రజాస్వామ్య హక్కు అని అన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటును నమోదు చేసుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకోవడం, తప్పులు సవరించుకోవడం, చిరునామా మార్పులు, మరణించిన లేదా అనర్హుల పేర్ల తొలగింపు వంటి ప్రక్రియలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటరు వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ప్రతి పౌరుడు బాధ్యతతో ఓటు హక్కును వినియోగించాలని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీ ఎల్ ఓ రజిత మాజీ కార్పొరేటర్ నాగరాజు అధ్యక్షులు పున్నం కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి సుధాకర్ రాజు మీనా స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల మన్ననలను పొందాలి

సూర్యాపేట జూలై 16:(విజన్ ఆంధ్ర)వినియోగదారుల మన్ననలు పొందితేనే ఏ వ్యాపారమైనా విజయవంతంగా ముందుకు సాగుతుందని ముస్లిం మత పెద్ద అత్తర్ మౌలానా అన్నారు. బుధవారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మూవీ మ్యాక్స్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన టీ హెవెన్ ఇరానీ చాయ్ కేఫ్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యువత ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఎదురు చూడకుండా స్వశక్తితో ఎదగాలి అని అన్నారు. టీ హెవెన్ ఇరానీ చాయ్ కేఫ్ మంచి పేరు తెచ్చుకొని విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాద నవీన్ గౌడ్, ఖలీల్ సాబ్, వజిత్ మౌలానా సాబ్, ముఫ్తి అస్రర్ సాబ్, మౌలానా రఫీ, మౌలానా షఫీద్, నిర్వాహకులు మహమ్మద్ రఫీ యుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### ప్రభుత్వ కార్యక్రమాల విజయానికి ఉద్యోగుల సమన్వయం ఎంతో కీలకం

కడప,జూలై 16 (విజన్ ఆంధ్ర)జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతమైన అమలులో అన్ని శాఖల ఉద్యోగుల సమన్వయం, అంకితభావం ఎంతో కీలకమని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్వో మల్లికార్జునుడు, జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు, ఎన్జీఓ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ఉద్యోగుల ఆరోగ్యమే వారి సేవలకు పునాదని పేర్కొన్న కలెక్టర్, ప్రతి ఉద్యోగి వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యం బాగుంటేనే విధులను సమర్థవంతంగా నిర్వహించగలరని, కుటుంబ సభ్యుల ఆరోగ్యంపైనా శ్రద్ధ చూపాలని అన్నారు. ఉద్యోగులు తమకు ఎదురయ్యే ఏ సమస్యనైనా వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను ఉద్యోగ సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వినతులను నమోదు చేసుకున్న జిల్లా కలెక్టర్.. జిల్లా స్థాయిలో పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగ సంఘాల సమావేశాలు, కార్యక్రమాల నిర్వహణ కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిపై స్పందిస్తూ, అన్ని ఉద్యోగ సంఘాలు సమన్వయంతో ముందుకు వస్తే జిల్లా యంత్రాంగం తరఫున తగిన స్థలాన్ని కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లాలో అమలవుతున్న ప్రతి ప్రభుత్వ కార్యక్రమం విజయవంతం కావాలంటే అన్ని శాఖల ఉద్యోగుల సమన్వయం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా విద్యాశాఖలో అమలవుతున్న కార్యక్రమాలను ప్రస్తావిస్తూ. పాఠశాల విద్యార్థులకు ప్రతిరోజూ సుమారు లక్ష మందికి నాణ్యమైన, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించే బృహత్తర కార్యక్రమాన్ని జిల్లాలో ఒక గొప్ప బాధ్యత తీసుకుని దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగడానికి సంబంధిత శాఖలు, అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేస్తున్నారని, ప్రతి రోజూ పనితీరులో మరింత మెరుగుదల సాధించేలా అందరూ కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రతి ఉద్యోగి బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ కోరారు. ఉద్యోగులు మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఎవరైనా ఇంకా నమోదు చేసుకోకపోతే వెంటనే నమోదు చేసుకునేలా చైతన్యం కల్పించాలని సూచించారు. అవసరమైన పత్రాలను సమర్పించి నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసి, జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ ఆగస్టు 3 వరకు పొడిగింపు

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి





వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 16 (విజన్ ఆంధ్ర) :ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనల మేరకు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారము వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి అన్ని మండలాల తహసిల్దార్లు మున్సిపల్ కమిషనర్ లతో జూమ్ సమావేశము నిర్వహించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆగష్టు 3 వ తేది వరకు ఎన్నికల కమిషన్ పోడిగించినందున ,ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మండల తహసీల్దార్లను ఆదేశించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరును నమోదు చేయడం, అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించడం, మార్పులు, చేర్పులు, సవరణలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటి ధృవీకరణను సమర్థవంతంగా నిర్వహించాలని, ఓటర్ల నుంచి వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మండలం వారిగా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ జూమ్ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, డి ఆర్ ఓ స్వర్ణ లత , ఆర్ డి ఓ వాసుచంద్ర, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహ రెడ్డి, ఎన్నికల విభాగం సుపరింటెన్డెంట్ నేమత్ హాలి , మండల తహసీల్దార్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తెలుగు భాషను మన సంస్కృతిగా భావించి విద్యార్థులకు బోధించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 16,(విజన్ ఆంధ్ర)తెలుగు భాషను మన సంస్కృతిగా భావించి విద్యార్థులకు బోధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాషను కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా భావించి విద్యార్థులకు బోధించాలని తెలుగు భాష ఉపాధ్యాయులకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న వినూత్న బోధనా పద్ధతులను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులలో తెలుగు భాషపై ఆసక్తి, అభిరుచిని పెంపొందించాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో ఇతర భాషల ప్రభావం కారణంగా విద్యార్థులకు తెలుగు భాషను సమర్థవంతంగా బోధించడం కొంత సవాలుగా మారిందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు తెలుగు ఉపాధ్యాయులు సృజనాత్మక బోధనా విధానాలను అవలంబించాలని తెలిపారు. ముఖ్యంగా కథలు, కవితలు, పద్యాలు, నాటికలు వంటి సాహిత్య ప్రక్రియలను ఉపయోగించి విద్యార్థులలో భాషా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు, శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్సు కో– ఆర్డినేటర్ జంబోజు సత్తయ్య, శిక్షణ కేంద్ర ఇన్‌చార్జి బోనగిరి శ్రీనివాస్, జిల్లా స్థాయి డి.ఆర్.పి.లు, తెలుగు భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విపత్తుల సహాయానికి సంసిద్ధంగా ఉండాలి: కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్, జూలై 16 (విజన్ ఆంధ్ర): జిల్లాలో విపత్తుల సమయంలో అత్యవసర సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. గురువారం స్థానిక టిటిడిసిలో కేంద్ర హోం శాఖ, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన మూడు రోజుల 'ఆపద మిత్ర' ఓరియంటేషన్ శిక్షణా ముగింపు శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 40 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వరదలు, అగ్నిప్రమాదాల వంటి విపత్తుల సమయంలో రెస్క్యూ ఆపరేషన్లు చేపట్టే నూతన నైపుణ్యాలను నేర్చుకున్నారని తెలిపారు. విపత్తు నిర్వహణకు అవసరమైన అత్యాధునిక పరికరాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి సురేష్ కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేధింపుల వల్లే రైతు ఆత్మహత్య..

### సిర్పూర్ టి ఆసుపత్రి ఎదుట మృతదేహంతో బాధితుల ఆందోళన...

### బాధ్యులపై హత్య నేరం కేసు నమోదు చేయాలి



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 16 (విజన్ ఆంధ్ర)కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి మండలంలోని హీరపూర్ గ్రామానికి చెందిన టేకం పెంటు బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే మృతుడు పెంటుకు సంబంధించిన భూమిని కాగజ్ నగర్ కు చెందిన వేణుగోపాల్ అనే వ్యక్తి రెవెన్యూ. పోలీస్ అధికారుల అండ దండలతో అక్రమంగా కబ్జా చేసి. నాలుగేళ్ల నుంచి వేధింపులకు గురి చేస్తున్నారని తుండు దెబ్బ జాతీయ అధ్యక్షుడు బుర్స పోచయ్య ఆరోపించారు. యువరైతు ఆత్మహత్యకు కారణమైన వేణు గోపాల్ పై హత్య నేరం కేసుతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అతనిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి 50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే సర్వేనెంబర్ 37 లో కబ్జాలో ఉన్న ఆదివాసీల భూములకు సంపూర్ణ హక్కులు కల్పించాలని కోరారు. వేణు గోపాల్ పై హత్య నేరం కేసుతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అతనిని కఠినంగా శిక్షించాలని సిర్పూర్ పోలీస్ స్టేషన్ లో మృతుని కుటుంబ సభ్యులతో కలిసి పిర్యాదు చేశారు.

## భూపాలపల్లి జిల్లాకు పాతిక పథకాలు

### పలు పోటీల్లో ఐదు, యోగా కోచ్ మధు సారధ్యంలో మరో 20 కైవసం

### కాలేశ్వరం జోన్ డిఐజి తో పాటు ఎస్పి ప్రశంసలు




కాటారం డివిజన్ ప్రతినిధి, జూలై 16 (విజన్ ఆంధ్ర) : రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో భూపాలపల్లి జిల్లా పోలీస్ జట్టు విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 25 పతకాలను కైవసం చేసుకుందిఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన 5వ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. పలు పోటీలలో 5 పథకాలు రాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం డీఎస్పీ కార్యాలయంలో క్రైమ్ రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న పీసీ ఎడ్ల మధు జోనల్ యోగ కోచ్‌గా సారథ్యం వహించి మరో ఇరవై పథకాలను సాధించారు. వివిధ క్రీడాంశాల్లో టైక్వాండోలో 1 స్వర్ణ పతకం, బాక్సింగ్‌లో 1 కాంస్య పతకం, ఉషులో 1 రజత పతకం, బాడీ బిల్డింగ్‌లో 1 కాంస్య పతకం, జిమ్నాస్టిక్స్‌లో 1 కాంస్య పతకం సాధించారు. అదే సమయంలో కాటారం డీఎస్పీ కార్యాలయంలో క్రైమ్ రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న పీసీ ఎడ్ల మధు జోనల్ యోగ కోచ్‌గా సారథ్యం వహించిన భూపాలపల్లి జిల్లా పోలీస్ యోగ జట్టు అద్భుత ప్రదర్శనతో 2 స్వర్ణ, 9 రజత, 9 కాంస్య పతకాలతో మొత్తం 20 పతకాలు సాధించింది. అలాగే కాలేశ్వరం జోన్-1 యోగ జట్టు మొత్తం 30 పతకాలు గెలుచుకుని విశేష ప్రతిభ చాటింది. ఈ విజయాలను పురస్కరించుకుని రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులను కాలేశ్వరం జోన్-1 డీఐజీ, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్. రామగుండం సీపీ కార్యాలయంలో అభినందించారు. అనంతరం భూపాలపల్లి జిల్లా ఎస్పీ శిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్., అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ తో పాటు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో క్రీడాకారులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ యోగ కోచ్‌గా విశిష్ట సేవలు అందించిన పీసీ ఎడ్ల మధును ప్రత్యేకంగా ప్రశంశల జల్లు కురిపించడం తో పాటు మధు కృషి, పట్టుదల, సేవాభావం గుణాన్ని కొనియాడారు.

## ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలి




గద్వాల జూలై 16 (విజన్ ఆంధ్ర బ్యూరో)ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండడంతో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. గురువారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి విద్య, వైద్యం, తాగునీరు, వర్షపాతం, ప్రజా పాలన, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించడంతో లక్ష్యం మేరకు విద్యార్థులు చేరేలా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాల వారీగా వర్షపాతం వివరాలను తెలియజేస్తూ వివిధ పంటల సాగు వివరాలను కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో ప్రజలు తెలియజేసిన వివిధ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ నర్సింగరావు నిర్దేశిత అంశాలపై జిల్లా అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిఐఈఓ హృదయ రాజ్, డిఈవో విజయలక్ష్మి, సిపిఓ వెంకటరమణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజ్ కుమార్, డిఎల్పిఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓటరు సవరణకు మరింత వేగం

- -శామీర్‌పేటలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి
- -ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణను వేగవంతం చేయాలని బీఎల్‌వోలకు ఆదేశం
- -ప్రతి అర్హ ఓటరికి ఫారం అందేలా క్షేత్రస్థాయిలో విస్తృత చర్యలు
- -తిరిగి స్వీకరించిన ఫారాల డిజిటలైజేషన్ పురోగతిపై సమీక్ష
- -ఫారాలు పూరించడంలో ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచన
- -బీఎల్‌వోల పనితీరును నేరుగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్
- -ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు



కుత్బుల్లాపూర్, జూలై 16 (విజన్ ఆంధ్ర): ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ పనులను మరింత వేగవంతం చేయాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. గురువారం జిల్లాలోని శామీర్‌పేట గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలతో మాట్లాడిన ఆయన, ఒక్కో బీఎల్‌వోకు మొత్తం ఎన్ని ఎన్యుమరేషన్ ఫారాలు కేటాయించబడ్డాయి, ఇప్పటివరకు ఎన్ని ఫారాలు పంపిణీ చేశారు, తిరిగి ఎన్ని ఫారాలు స్వీకరించారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్వీకరించిన ఫారాలను డిజిటలైజేషన్ చేస్తున్న విధానాన్ని కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఫారాలు పూరించడంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయం అందించాలని బీఎల్‌వోలకు సూచించారు. ప్రతి అర్హ ఓటరు వివరాలు సక్రమంగా నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో శామీర్‌పేట తహసీల్దార్ సి. హెచ్. శ్రీనివాస్, బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం ప్రారంభం



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 16 (విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష మరియు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జనకాపూర్, ఆసిఫాబాద్ లో జీవశాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారిగా పాల్గొన్న ఉప్పులేటి శ్రీనివాస్ జీవశాస్త్ర ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, నాణ్యమైన విద్యకు నాణ్యమైన బోధనే పునాది అని పేర్కొన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యాంశాలను బోధించే వ్యక్తి మాత్రమే కాకుండా, విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, పరిశోధనా దృక్పథం, శాస్త్రీయ వైఖరిని పెంపొందించే మార్గదర్శిగా ఉండాలని అన్నారు. జీవశాస్త్ర బోధనలో పాఠ్యపుస్తకానికే పరిమితం కాకుండా ప్రయోగాలు, పరిశీలనలు, చర్చలు, స్థానిక వనరుల వినియోగం, సాంకేతిక పరిజ్ఞానం, కార్యాచరణ ఆధారిత అభ్యాస పద్ధతులను సమర్థవంతంగా ఉపయోగించాలని సూచించారు. ప్రతి విద్యార్థి అభ్యసించే అవకాశాన్ని కల్పించే పరివర్తనాత్మక తరగతి గది బోధన ద్వారా మాత్రమే నిజమైన అభ్యాస ఫలితాలు సాధ్యమవుతాయని వివరించారు. అలాగే, ఉపాధ్యాయులు నిరంతరం స్వీయ అభ్యాసం కొనసాగిస్తూ, వినూత్న బోధనా పద్ధతులను అవలంబించి, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని, ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ప్రతి ఉపాధ్యాయుడు తన పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యాస ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని, ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు సబ్జెక్టు బోధనలో వినూత్న విధానాలు, అనుభవాత్మక అభ్యాసం, సమర్థవంతమైన మూల్యాంకన పద్ధతులు, తరగతి గది నిర్వహణ, నాణ్యమైన అభ్యాస ఫలితాల సాధన వంటి అంశాలపై మంచి అవగాహన నేర్పరుచుకోవాలని దిశానిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్ర ఇంచార్జ్ ఉమబాల, జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్లు రాజేష్, శ్రీనివాస్, దుర్గాప్రసాద్ మరియు జీవశాస్త్ర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మినరసింహ స్వామి ఆలయ బోర్డ్ మెంబెర్ ఈశ్వరమ్మ యాదవ్ కి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర గొర్రెలు,మేకల అభివృద్ధి సహకార సమైక్య చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య



గద్వాల జూలై 16 (విజన్ ఆంధ్ర)హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లో యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమితులైన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ని తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు చిన్న శ్రీశైలం యాదవ్, లైవ్ స్టోక్ కార్పొరేషన్ చైర్మెన్ చరణ్ కౌశిక్ యాదవ్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ రాఘుజునాథ్ యాదవ్,మహిళా కాంగ్రెస్ నాయకురాలు అంజలి యాదవ్, యాదవ కుల ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు. అలాగే ఈమధ్య జరిగిన వివాదస్పద సంఘటనకు సంబంధించి సుదీర్ఘంగ చర్చించారు. అనంతరం ఈశ్వరమ్మ ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.

## సీతమ్మసాగర్ సీతారామ ప్రాజెక్టులపై ప్రభుత్వ ఫోకస్.. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలే లక్ష్యం

### ప్రాజెక్టు పనులు వేగవంతం చేయండి.. అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల ఆదేశాలు

### 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం.. సీతారామ పనులు త్వరలో పూర్తి చేస్తాం



కొత్తగూడెం బ్యూరో, జూలై 17(విజన్ ఆంధ్ర)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు వ్యూ పాయింట్ వద్ద అధికారులు మ్యాప్‌లు, సాంకేతిక నమూనాల ద్వారా బ్యారేజ్, పంప్‌హౌస్‌లు, కాలువలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థ, ఆయకట్టు, పూర్తయిన మరియు పెండింగ్ పనులపై వివరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రావిటీ, లిఫ్ట్ ఇరిగేషన్ విధానాల ద్వారా నీటిని ప్రతి సాగుభూమికి అందించేలా కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే భారీగా ప్రజాధనం వ్యయం అయినందున సీతమ్మసాగర్, సీతారామ, దేవాదుల ప్రాజెక్టుల మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి నెలా పురోగతిని సమీక్షించి అవసరమైన నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సీతారామ ప్రాజెక్టు జీవనాడి వంటిదని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయితే సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. సీతమ్మసాగర్‌కు సంబంధించిన న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి పనులు వేగవంతం చేస్తామని, డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేసి ఇల్లందు సహా జిల్లాలోని అన్ని ప్రాంతాలకు గోదావరి జలాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాలు సముద్రంలో వృథాగా కలిసిపోకుండా వాటిని రైతుల పొలాలకు చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు ఎలక్ట్రికల్, మెకానికల్ పనుల కోసం రూ.1,000 కోట్లకు పైగా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రాజెక్టు పురోగతి, భూసేకరణ, పునరావాసం, విద్యుత్ అనుసంధానం, మౌలిక సదుపాయాలపై మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రులు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను కూడా పరిశీలించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, రామదాసు నాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యా చందన, నీటిపారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాలో ఎస్సై ల బదిలీలు

కామారెడ్డి బ్యూరో జులై 16(విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లాలో ఎస్సై ల బదిలీలు జరిగాయి. శాంతిభద్రతల పర్యవేక్షణ మరింత పటిష్టంగా ఉండేలా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది. మాచారెడ్డి ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అనిల్‌ను భిక్కనూరు స్టేషన్‌కు బదిలీ చేశారు. భిక్కనూరులో విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులును రాజాంపేటకు పంపగా, రాజాంపేటలో ఉన్న మహేష్‌ను జిల్లా కేంద్రంలోని సీసీఎస్‌కు కేటాయించారు. ఇక బీబీపేట స్టేషన్ బాధ్యతలు చూస్తున్న విజయ్ ను మాచారెడ్డికి, బాన్సువాడ టౌన్ ఎస్సై నవీన్ చంద్రను బీబీపేటకు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలతో పలు మండలాల్లో కొత్త ఎస్సైలు బాధ్యతలు చేపట్టనున్నారు. కొత్తగా వచ్చిన అధికారులు తమ పరిధిలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించినట్లు సమాచారం. బదిలీ అయిన అధికారులు వెంటనే కొత్త స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలుస్తోంది

## తాడిచెర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవాలు భూపాలపల్లి ఏరియాలో ఘనంగా నిర్వహణ



భూపాలపల్లి జిల్లా: 16 జూలై ( విజన్ ఆంధ్ర) గురువారం సింగరేణి సంస్థకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన తాడిచెర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవాల సందర్భంగా ఈరోజు భూపాలపల్లి ఏరియాలో పలు చోట్ల విజయోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీ-2 ఉపరితల గనిలో నిర్వహించిన కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజయోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తాడిచెర్ల-2 బ్లాక్ సాధన ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను కార్మికులకు పంపిణీ చేశారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, కార్మికులతో కలిసి మిఠాయిలు పంచుకొని విజయోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విజయం సింగరేణి భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని, ఇదే స్ఫూర్తితో ఉత్పత్తి, భద్రత, నాణ్యతలో మరిన్ని విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ ప్రాజెక్ట్ సింగరేణి కి డైరెక్ట్ గా కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .ఈ గని ద్వారా భూపాలపల్లి ఏరియా కు చాలా ఉపయోగమని , స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి తెలిపారు. అనంతరం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అధికారులు, ఉద్యోగులకు తాడిచెర్ల-2 బ్లాక్ సాధనపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మిఠాయిలు పంచుకొని అందరితో కలిసి విజయోత్సవాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా తాడిచెర్ల-2 బ్లాక్ సాధనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తూ, సంస్థ అభివృద్ధికి ఇదొక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. అదేవిధంగా భూపాలపల్లి ఏరియాలోని అన్ని ఓపెన్‌కాస్ట్, భూగర్భ గనులు, ఏరియా కార్యాలయాలు మరియు వివిధ విభాగాల్లో కూడా తాడిచెర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేసి, మిఠాయిలు పంచుకొని ఈ చారిత్రాత్మక విజయాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఈ సమావేశానికి ఏజీఎం (సివిల్) రవికుమార్ , ఏజీఎం (ఐ ఈ డీ ) జోతి ,గ్రా, ఖుఖ రాజ-2-శ్యామ్ సుందర్ , డీజీఎం (ఎఫ్&ఏ) శ్రీ పి. రాజేశ్వర్, ఏరియా సర్వే ఆఫీసర్ శైలేంద్ర కుమార్, కేటీకే-1 గ్రూప్ పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి , అన్నీ డిపార్ట్మెంట్ల అధికారులు, గుర్తింపు సంఘం ఏ ఐ టి యు సి అసిస్టెంట్ సెక్రటరీ పాషా , ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టియూసి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బి .మధుకర్ రెడ్డి , సి ఎం ఓ ఏ ఐ ప్రెసిడెంట్ నజీర్, అన్నీ గనుల మరియు డిపార్ట్మెంట్ అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

## గిరిజనుల సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వ పాలకులు

### -సిపిఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి




రంగారెడ్డి/అబ్దుల్లాపూర్ మెట్, జూలై 16 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాలకులు పోరాడి సాధించుకున్న రాష్ట్రంలోనే గిరిజనులని కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటూ వారి సంక్షేమాన్ని పూర్తిగా మర్చిపోయాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి ఆరోపించారు. తెలంగాణ గిరిజన సమాఖ్య అబ్దుల్లాపూర్ మెట్ మండల మహాసభని గురువారం కుంట్లూరు రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్ 2 సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ మెట్టు మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన మహాసభకి ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిధులుగా హాజరై మహాసభను ఉద్దేశించి మాట్లాడుతూ.... తెలంగాణ గిరిజన సమాఖ్య అనేది తెలంగాణ రాష్ట్రంలోని షెడ్యూల్ తెగలకి చెందిన ప్రజల హక్కుల సాధన కొరకు వారి సంక్షేమం కొరకు మరియు సమాజంలో వారు ఎదురుకుంటున్న కుల వివక్షకి వ్యతిరేకంగా పోరాడే సంఘం అని అన్నారు. గిరిజనులకు విద్య రంగంలో, ఉద్యోగ రంగంలో, రాజకీయ రంగంలో తగిన ప్రాతినిధ్యం కొరకు, అటవీ హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. గిరిజనుల జనాభాకి అనుగుణంగా నిధుల కేటాయింపు, రిజర్వేషన్ల పెంపు, పోడు భూములకి పట్టాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై పోరాటం చేస్తుందని అన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమాల్ని నిర్వహిస్తామన్నారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లకుండా చూసి గిరిజనుల అభివృద్ధికి ఆనిధులు ఉపయోగించాలన్నారు. నైపుణ్యం కలిగిన గిరిజన యువతకి ప్రత్యేకమైన సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రమావత్ సక్రు నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణలోని గిరిజనుల అభివృద్ధి కొరకు ప్రభుత్వాలు ప్రకటించిన నిధులని వెంటనే విడుదల చేయాలనీ అలాగే గిరిజన యువతకి ప్రత్యేకమైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మెట్టు మండల సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా, తెలంగాణ గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రమావత్ సక్రు నాయక్, నాయకులు లోక్య నాయక్, లావుడియాశంకర్, వినోద్, వెంకటేష్, దేవా, వర్య శంకర్, క్రాంతి, శ్రీదేవి, వంశీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో నిందితుడు ఆత్మహత్య కేసును పరిశీలిస్తున్న దోమకొండ ఎస్ఐ ప్రభాకర్



కామారెడ్డి బ్యూరో జులై 16(విజన్ ఆంధ్ర)తేదిన 15-07-2026 నాడు చింతామన్‌పల్లి గ్రామానికి చెందిన రంగబోయిన స్వామి తన కుమారుడు రంగబోయిన సందీప్ (23 సంవత్సరాలు) ఆత్మహత్య చేసుకున్న విషయమై దోమకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో, తన కుమారుడిపై గతంలో నమోదైన ఫోక్సో కేసు నేపథ్యంలో కొందరు వ్యక్తులు నిరంతరం ఫోన్ కాల్స్, సందేశాలు, బెదిరింపులు మానసిక వేధింపులకు గురిచేయడం వల్ల మనస్తాపానికి గురై తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు.ఫిర్యాదు ఆధారంగా దోమకొండ పోలీస్ స్టేషన్‌లో సంబంధిత చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించబడిందని అన్నారు.ప్రస్తుతం దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందిని. ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలపై అన్ని పలు కోణాల్లో సమగ్ర విచారణ జరుగుతోందని ఎస్ హెచ్ ఓ ప్రభాకర్ తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలి: కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఆదిలాబాద్, జూలై 16 (విజన్ ఆంధ్ర):ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి అర్హుడికి అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలపై నమోదైన అట్రాసిటీ కేసుల దర్యాప్తు, విచారణలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా, పెండింగ్ కేసులను ప్రత్యేక డ్రైవ్ ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని ఆయన సూచించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి కమిషన్ చైర్మన్, సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, ఉద్యోగాలలో రిజర్వేషన్ల అమలు, సబ్‌ప్లాన్ నిధుల వినియోగం తదితర అంశాలపై శాఖల వారీగా సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షా సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకు అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ముఖ్యంగా మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లోని అర్హులందరికీ చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కరించేలా సేవలందించాలని అధికారులను ఆదేశించారు. అట్రాసిటీ కేసులలో



బాధితులకు చట్టప్రకారం అందాల్సిన పరిహారం, పునరావాసం, ఇతర సౌకర్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్ స్పష్టం చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులు, సర్వీస్ అంశాల్లో ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, రోస్టర్ విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి నెల చివరి వారంలో నిర్వహించే సివిల్ రైట్స్ డే (నాగరిక హక్కుల దినోత్సవం) సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు.ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాసంస్థలను జిల్లా అధికారులు తరచూ తనిఖీ చేయాలని చైర్మన్ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, వసతి, పారిశుధ్యం, భద్రత, వైద్య సేవలు అందుతున్నాయో లేదో నిరంతరం పరిశీలించి, ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఆయా వర్గాల అవసరాలున్న ప్రాంతాల్లోనే వినియోగించాలని, మంజూరైన గ్రామ పంచాయతీ, వీఓ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఒకవేళ ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి సంబంధించిన నిధులు ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే, తాము ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి విడుదలకు కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని కమిషన్‌కు వివరించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కామన్ మెనూ అమలు, ఉపకార వేతనాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కూలీలకు అధిక పనిదినాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తు కూడా జిల్లాలో వేగంగా కొనసాగుతోందని వెల్లడించారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఏ పీవో మంద మకరందు, ఏఎస్పీ సాయి రుత్విక్ కొట్టే, అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రూ, రాజేశ్వర్, డీఆర్ఓ స్రవంతి, ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్డీఓలు జగదీశ్వర్ రావ్, మోహన్ సింగ్, డీఎస్పీ జీవన్ రెడ్డిలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే కులవృత్తులకు అధిక ప్రాధాన్యత

## తెలంగాణ రాష్ట్ర రవాణా, బి.సి.సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 16 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రంలోని బి.సి.కుల వృత్తులను ఎక్కువగా ప్రోత్సహించాలని తెలంగాణ రాష్ట్ర రవాణా, బి.సి. సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. గురువారం ఆషాఢ బోనాల సందర్భంగా హెచ్ఎండీఏ మైదానంలో "బోనాలు చేతివృత్తుల మేళాను-2026"ను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కురుమ, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ ఠాగూర్, ఈర్లపల్లి శంకర్, కార్పొరేషన్ల చైర్మన్లు, సెక్రెటరీ బాల మాయదేవితో కలసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆలోచనలకు అనుగుణంగా కులవృత్తులను ప్రోత్సహించడం, బీసీ వర్గాలకు చెందిన కళాకారులకు తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూలై 16 నుంచి 26 వరకు పది రోజులపాటు నిర్వహిస్తున్న ఈ మేళాలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బీసీ చేతివృత్తుల కళాకారులకు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగమైన అనేక కులవృత్తులు కనుమరుగు అవ్వకుండా



మరింతగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ కులవృత్తులు రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడమే కాకుండా పర్యావరణహితమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని కూడా ప్రోత్సహిస్తాయన్నారు. సంప్రదాయ ఉత్పత్తులను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు భావితరాలకు కులవృత్తుల ప్రాధాన్యతను తెలియజేస్తూ కుల వృత్తుల కళాకారుల జీవనోపాధిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ ప్రదర్శనలను సందర్శించి బీసీ కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇలా చేయడం ద్వారా సంప్రదాయ కులవృత్తులను ఆదరించడమే కాకుండా వేలాది మంది కళాకారుల జీవనోపాధికి తోడ్పాటు అందించినవారవుతారన్నారు. ప్రదర్శన ప్రారంభానంతరం మంత్రి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి వృత్తి కళాకారులతో ముచ్చటించారు. ఈ ప్రదర్శనలో టెర్రకోట ఉత్పత్తులు, మట్టి పాత్రలు, జనపనార ఉత్పత్తులు, గద్వాల్ చీరలు, పోచంపల్లి ఇకత్ చేనేత వస్త్రాలు, నిర్మల్ బొమ్మలు, నిర్మల్ చిత్రకళా ఉత్పత్తులు, వెండి ఫిలిగ్రీ కళాఖండాలు, వరాహి హస్తకళ ఉత్పత్తులు, వరంగల్ దుర్రీలు, నారాయణపేట చేనేత వస్త్రాలు, పెంబర్తి ఇత్తడి కళాఖండాలు, సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలోని సేంద్రీయ ఆహార ఉత్పత్తులు, రానున్న వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలు, పూసల కళాఖండాలు, సంప్రదాయ మందులు, విశ్వకర్మ కళాకారుల ఉత్పత్తులు, ప్రభుత్వ విజయ డెయిరీ ఉత్పత్తులు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రదర్శనలో పాల్గొన్న కళాకారుల నైపుణ్యాన్ని మంత్రి అభినందిస్తూ, తమ సంప్రదాయ కళలు, కులవృత్తులను భావితరాలకు అందించే దిశగా వారు నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సి. ఈ ఓ ఎబిసి కార్పొరేషన్ అలోక్ కుమార్, సెక్రెటరీ బి.సి రెసిడెన్సీ యల్ సైదులు, ఎం.డి బి.సి. కార్పొరేషన్ మల్లయ్య బట్టు, బి.సి. స్టడీ సర్కిల్ హరికృష్ణ, వివిధ బీసీ కుల కార్పొరేషన్ల చైర్మన్లు, పలు సంఘాలు,అధికారులు, కళాకారులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# బి.యన్ రెడ్డినగర్ డివిజన్ లో పార్కు స్థలం కబ్జా!!

### -కబ్జాస్థలంలో నిర్మాణం చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### -తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



ఎల్బీనగర్, జూలై 16 (విజన్ ఆంధ్ర): అక్రమంగా పార్కు స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్న వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ నియోజకవర్గం బి.యన్.రెడ్డినగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం డివిజన్ పరిధిలోని మారుతీనగర్ కాలనీలో పార్క్ స్థలం కబ్జాకు గురికావడం జరిగిందని, దీనికితోడు సర్వే నెంబర్ 179లో ఉన్నటువంటి పార్కు స్థలాన్ని 2017లో తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కబ్జాకు గురిచేసిన పార్క్ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపడుతుండగా మారుతి నగర్ కాలనీ వాసులు నిలిపివేయడం జరిగిందన్నారు. ఖాజాగా మళ్లీ స్థలములో నిర్మాణం పనులు అక్రమంగా మొదలుపెట్టారన్న విషయాన్ని కాలనీవాసుల సమాచారంతోనే భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డితో కలిసి అక్రమంగా నిర్మిస్తున్న స్థలానికి చేరుకొని కాలనీ వాసులతో కలిసి వెంటనే నిర్మాణం పనులను నిలిపివేయడం జరిగిందన్నారు. పార్కు స్థలం కబ్జా అంశంపై సంబంధిత ఎంఎంసీ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీ పార్కు స్థలాన్ని ఏవిధంగా రిజిస్ట్రేషన్ చేస్తారని, అప్పటి జిహెచ్ఎంసి అధికారులు ఏవిధంగా గృహ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని వారు అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కు స్థలం కబ్జా చేయడంతో పాటు అక్రమంగా రిజిస్ట్రేషన్, అనుమతులను రద్దు చేయాలని, కబ్జాకు గురి చేసిన వ్యక్తులపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎంఎంసీ అధికారులు పట్టించుకోని పార్కు స్థలాన్ని సంరక్షించి అభివృద్ధి చేసి కాలనీ వాసులకు అందజేయాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, జిల్లా కౌన్సిల్ నెంబర్ శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ నాథ్, విష్ణువర్ధన్ రెడ్డి, ఓబీసీమోర్చా అధ్యక్షులు మహేష్ గౌడ్, నాయకులు రవిశంకర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ శర్మ, సంగమేశ్వర్ రావు, మహేందర్ రెడ్డి, ప్రభాకర్ యాదవ్, శ్రీనివాసరావు, నాగేష్,మురళి, నరసింహ, విజయ్ కుమార్, శబరి నాథ్, సునీల్ రెడ్డి, సందీప్, రాజు, సాయిరామ్, కాలనీ అధ్యక్షులు దుర్గాప్రసాద్, కాలనీ సభ్యులు అరుణ, దుర్గ, స్వాతి, సత్య, ఉమా, శారద, బిందు, సత్యవేణి, మాధవి, భార్గవి, యాదమ్మ, సుచిత్ర, సరిత, ప్రసన్న, అశ్విని, సునీత, శ్రీమాల, మహేశ్వరి, రమ్య, నాగలక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు

## ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలి

### ప్రజలకు వైద్య సేవలను అందుబాటులో ఉంచాలి

### ప్రజా రక్షణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు


అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 16, (విజన్ ఆంధ్ర)వ్యవసాయ సాగులో విత్తనాలు, ఎరువులు రైతులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వ్యవసాయ సాగు, వాతావరణ మార్పులు, విద్యారంగ అభివృద్ధి, ప్రజా రక్షణ ఇతర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వానాకాలం సాగుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, జిల్లాల వారీగా విత్తనాల నిల్వలు, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. వానాకాలం - 2026లో 138.49 లక్షల ఎకరాలలో పంటల సాగు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని, ఇందుకు అవసరమైన 19.68 లక్షల క్వింటాళ్ల విత్తనాల అవసరానికి గాను 74.44 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులకు ఎటువంటి కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఈ ఏడాది 530.43 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకుని, సుమారు 3.98 కోట్ల రూపాయల విలువైన విత్తనాలను సీజ్ చేసి 73 మందిని అరెస్టు చేసి, 39 క్రిమినల్ కేసులు, 2 పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా స్థాయి ప్రత్యేక తనిఖీ బృందాలు విత్తన విక్రయ కేంద్రాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, అనుమానాస్పద ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని, పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని ఆదేశించారు. రాష్ట్రంలో వానాకాలం - 2026లో ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అయిన నేపథ్యంలో వ్యవసాయ సాగులో ప్రయోజనకర పద్ధతులను, పంట మార్పిడి విధానాలను రైతులకు వివరించి లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 5 జిల్లాలలో సాధారణ, 27 జిల్లాలలో లోటు, ఒక జిల్లాలో తీవ్ర లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. మండలాల వారీగా 36 మండలాలలో అధిక, 142 మండలాల్లో సాధారణ, 358 మండలాలలో లోటు, 85 మండలాలలో తీవ్ర లోటు వర్షపాతం నమోదైందని వివరించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని తెలిపారు.సురక్షితమైన త్రాగునీటి సరఫరా కొరకు అమృత్ 2.0 పథకం క్రింద పైప్‌లైన్లు, ఓవర్ హెడ్ ట్యాంక్ లు, అంతర్గత పంపిణీ వ్యవస్థలకు సంబంధించిన మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి



చేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలలో త్రాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.సీజనల్ వ్యాధుల నియంత్రణకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్రంలోని 33 జిల్లాలలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, జిల్లా, డివిజన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. సున్నిత ప్రాంతాలలో జ్వరాలపై ప్రత్యేక నిఘా చేపట్టి, ప్రతిరోజూ నివేదికలు పంపాలని, ప్రతి శుక్రవారం "డ్రై డే" కార్యక్రమం నిర్వహిస్తూ దోమల నివారణ చర్యలు, లార్వా నిర్మూలన, ఫాగింగ్, నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో శుభ్రత కార్యక్రమాలను ముమ్మరం చేయాలని తెలిపారు. పట్టణాలు, గ్రామాలు, పాఠశాలలు, వసతి గృహాలు, నిర్మాణ ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లు చేపట్టాలని, గత ఏడాదితో పోలిస్తే డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా కేసులు గణనీయంగా తగ్గినప్పటికీ, టైఫాయిడ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిరంతరం పర్యవేక్షించాలని, ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రులలో మందులు, పరీక్షా కిట్లు, రక్త నిల్వలు, అంబులెన్స్ సేవలు, అత్యవసర చికిత్స సౌకర్యాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వ విద్యాసంస్థలు, పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, తెలంగాణ మోడల్ స్కూళ్లలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల నమోదు వేగవంతం చేయాలని తెలిపారు. జిల్లాల కలెక్టర్లు పాఠశాలల వారీగా నమోదు పురోగతిని ప్రతిరోజూ సమీక్షిస్తూ, లక్ష్య సాధనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. ప్రీ-ప్రైమరీ విభాగాల ఏర్పాటు, బోధకులు/సిబ్బంది నియామకం, టీచింగ్-లెర్నింగ్ మెటీరియల్, ఫర్నిచర్‌తో పాటు అవసరమైన ఇతర సామగ్రి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, నియామకాలు, కొనుగోళ్లు పెండింగ్‌లో ఉన్న జిల్లాలు వాటిని తక్షణమే పూర్తి చేయాలని తెలిపారు. ప్రీ-ప్రైమరీ విభాగాలకు సంబంధించిన యూడైస్ప్లస్ వరాలను పూర్తిగా నవీకరించి, విద్యార్థుల ప్రవేశాల సమాచారాన్ని సకాలంలో నమోదు చేయాలని సూచించారు. యూడైస్‌లో నమోదు కాని ప్రవేశాలను వెంటనే అప్‌డేట్ చేసి, వాస్తవ గణాంకాలు ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల ప్రవేశాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, తెలంగాణ మోడల్ స్కూళ్లలో కూడా నిర్దేశించిన ప్రవేశ లక్ష్యాలను పూర్తి చేసి, ఖాళీ సీట్లను త్వరితగతిన భర్తీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించే దిశగా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, ప్రతి పాఠశాల స్థాయిలో విద్యార్థుల నమోదును పర్యవేక్షించి, లక్ష్య సాధనకు అవసరమైన చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా పనుల వేగాన్ని మరింత పెంచాలని తెలిపారు. కేంద్రీకృత వంటశాలలు అన్నింటినీ సెప్టెంబర్ 30వ తేదీలోపు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని, తద్వారా విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రజారోగ్య పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్య, ఐసీడీఎస్, గిరిజన సంక్షేమ, రెవెన్యూ శాఖలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, త్రాగునీటి నాణ్యత, పాఠశాలలు, వసతి గృహాల పరిశుభ్రత, ప్రజలలో అవగాహన కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని ఆదేశించారు.జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె. హరిత, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారి చెన్నూరి కిష్టయ్య, సంబంధిత శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రీ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి పాఠశాలకు ఇన్స్ట్రక్టర్స్, ఆయాలను నియమించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడానికి పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయడానికి అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం వల్ల లోటు వర్షపాతం నమోదు అయిందని, జిల్లాలో సింహభాగం పత్తి, కంది పంటలు సాగు చేస్తున్నారని, వరి సాగుకు ప్రత్యామ్నాయంగా పప్పు ధాన్యాల పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, గ్రామాలలో పారిశుద్ధ్యం పనులు, దోమల వృద్ధిని అరికట్టే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నెలలు నిండిన గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని, విష జ్వరాలు, చికెన్ గున్యా, మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం త్రాగునీటి ఇబ్బంది లేకుండా మిషన్ భగీరథ, స్థానిక నీటి వనరుల ద్వారా త్రాగునీటి పంపిణీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో వచ్చిన అర్జీలు, గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, మిషన్ భగీరథ ఈ.ఈ. సిద్దిక్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంబటి రాంబాబు ఆంబోతులా రంకెలేయడం దారుణం : గోరంట్ల

కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల వేళ చోటుచేసుకున్న పరిణామాలు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రవర్తనపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను గౌరవప్రదంగా ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తుంటే, అంబటి రాంబాబు పెద్దపెద్దగా అరుస్తూ ఆ కార్యక్రమాన్ని అడ్డుకోవడాన్ని బుచ్చయ్య చౌదరి తీవ్రంగా తప్పుబట్టారుగా రంకెలేస్తూ ప్రవర్తించడం అత్యంత దారుణం. బతికున్నప్పుడు ముద్రగడను అవమానించారు. ఇప్పుడు చావు దగ్గర కూడా నీచమైన రాజకీయం చేయడం వైసీపీ నేతలకే చెల్లింది" అని ధ్వజమెత్తారు. కన్న తండ్రి చివరిచూపు కోసం వచ్చిన ముద్రగడ కుమార్తెను భౌతికకాయం వద్దకు రానివ్వకుండా అడ్డుకోవడాన్ని బుచ్చయ్య చౌదరి తీవ్రంగా ఖండించారు. కుటుంబంలో ఇలాంటి గొడవలు పెట్టడం, కన్నబిడ్డను దూరం చేయడం ఏ రకమైన సంస్కృతి అని ఆయన ప్రశ్నించారువైసీపీ అధినేత జగన్ ఎక్కడికి వెళ్లినా అక్కడ అల్లర్లు సృష్టించడం పరిపాటిగా మారిందని బుచ్చయ్య చౌధరి ఆరోపించారు. కేవలం రాజకీయ మైలేజ్, హైప్ క్రియేట్ చేసుకోవడం కోసమే ఇలాంటి శవ రాజకీయాలు, డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అంత్యక్రియలకు వెళుతూ కూడా భారీ ర్యాలీలు చేయడం ఏంటని నిలదీశారు.



## దేవునిపై ప్రతిఒక్కరికి సంపూర్ణ విశ్వాసం ఉండాలి - ఫాదర్ జిన్

**- ఘనంగా కార్మల్ డే ఉత్సవం**





మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 16,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల పట్టణంలోని కార్మెల్ ఉన్నత పాఠశాలలో కార్మల్ డే ను (కార్మెల్ మాత పండుగ) ను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫాదర్ జిన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఫాదర్ జిన్ మాట్లాడుతూ కార్మెల్ డే పర్వదిన సందర్భంగా ప్రతిఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. దేవునిపై ప్రతిఒక్కరి కి సంపూర్ణ విశ్వాసం కలిగి ఉండాలన్నారు.ప్రపంచ వ్యాప్తంగా ఈ పండుగను భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకుంటారని అన్నారు.మౌంట్ కార్మల్ పవిత్ర మరియమ్మకు ఇజ్రాయేల్ లోని మౌంట్ కార్మెల్ అనే పవిత్ర పర్వతం మీద దర్శనం ఇవ్వడంతో కార్మెల్ మాత అనే పేరొచ్చిందని అన్నారు.మాతను ఆశ్రయించేవారికి దేవుడు తన కృపను ప్రసాదిస్తాడని భక్తుల విశ్వాసం. ఈ కార్మెల్ మాత పండుగ పురస్కరించుకొని విద్యార్థుల నృత్యాలు, నాటికలు అందరిని అలరించాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల మదర్ మరియ ఆగస్టిన్,పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ సారూప్య,సిబిఎస్ఈ ప్రిన్సిపల్ సిస్టర్ రేనిట్, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ జే.నరేందర్ గౌడ్

**- సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలి**

**- రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి విధుల్లో క్రమశిక్షణతో పనిచేయాలని పోలీసులకు ఆదేశం**



నర్సాపూర్, జూలై 16 (విజన్ ఆంధ్ర న్యూస్): మెదక్ జిల్లా తూప్రాన్ డివిజన్ డీఎస్పీ జే.నరేందర్ గౌడ్ గురువారం సంవత్సర సందర్శనలో భాగంగా నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసుల నమోదు విధానం, పరిపాలనా నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించిన డీఎస్పీ, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల విచారణలో జాప్యం లేకుండా చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్న ఆయన, ట్రాఫిక్ నియంత్రణను మరింత పటిష్టం చేయడంతో పాటు వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం చేపట్టాలని అధికారులకు సూచించారు. స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన డీఎస్పీ, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, ప్రమాదకర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన డీఎస్పీ, వారి సమస్యలను అడిగి తెలుసుకొని పోలీసు అధికారుల కిట్లను పరిశీలించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో పాటు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే స్వీకరించి చట్టబద్ధంగా పరిష్కరించే చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీలో నర్సాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంగకృష్ణ, నర్సాపూర్ ఎస్ఐ రంజిత్ రెడ్డి, ఎస్ఐ కృష్ణ, ఏఎస్ఐలు శివకుమార్, ముజీబ్ అహ్మద్, సుందర్ రాజు, స్టేషన్ రైటర్ సురేష్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పంట పొలాల్లో చీడపీడల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

**-వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త ఆకుల దినేష్**



ముధోల్: 16జూలై: విజన్ ఆంధ్ర ప్రస్తుత వానకాలంలో ఎల్ నినో ప్రభావంతో సాధారణ వర్షపాతం కన్నా తక్కువగా మోతాదు లో నమోదయిందని రైతులు సాగు చేస్తున్న పంటల తెగుళ్ల నివారణపై అప్రమత్తంగా ఉండాలని ముధోల్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఆకుల దినేష్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురువక పంట పొలాల్లో తేమ తగ్గి అధిక ఉష్ణోగ్రతల వల్ల సోయా చిక్కుడు, పత్తి, పంట ఎదుగుదల మందగించి చీడపీడల ఉధృతి అవకాశం ఉందన్నారు. సోయా చిక్కుడు లో కాండంతో ఈగ, ఆగుతిని గొంగళి పురుగులు, కంది పంటలు రసం పీల్చే పురుగులు, పత్తి పంటలు పచ్చ దోమ, తామర పురుగులు, పెనుబంక, తెల్ల దోమ లాంటి పురుగుల ఉధృతి అధికంగా కనిపించే అవకాశం ఉందన్నారు. 30 -35 సెంటిగ్రేట్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రత, తేమ ఒత్తిడి ఉన్నప్పుడు శిలీంద్రం వల్ల సోయా పంటలు వేరుకొల్లు వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుందన్నారు.ఈ వ్యాధి నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 50 డబ్ల్యూ.పీ. 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కల వేర్ల చుట్టూ డ్రెంచింగ్ చేయాలన్నారు. సోయాచిక్కుడు పంటలో కాండం తొలుచు ఈగ నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 17.8% ఎస్.ఎల్. 1 మి.లీ. లేదా బీటా-సైఫ్లూత్రిన్ 8.49 శాతం+ ఇమిడాక్లోప్రిడ్ 19.81 శాతం ఓ.డి.1 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి గమనించిన వెంటనే ఇమిడాక్లోప్రిడ్ 17.8 శాతం ఎస్.ఎల్.ను 1:20 నిష్పత్తిలో కాండం పూత చేయాలని, అవసరమైతే ఫ్లోనికామిడ్ 50 శాతం డబ్ల్యూ.జి. 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అదేవిధంగా, నేలలో తేమను సంరక్షించేందుకు అంతరకృషి నిర్వహించి కలుపు మొక్కలను పూర్తిగా తొలగించాలని, వర్షాభావ ఒత్తిడిని తగ్గించేందుకు 19:19:19 లేదా 13:0:45 వంటి నీటిలో కరిగే ఎరువులను ఆకులపై పిచికారీ చేయడం ద్వారా పంటల ఎదుగుదలకు తోడ్పాటు అందించవచ్చని సూచించారు. రైతులు వర్షపాతం తక్కువ ఉండడంతో పంటల పై చీడపీడల నివారణ, పలు సలహాలు, సూచనలకు వ్యవసాయ అధికారులకు సంప్రదించాలని కోరారు.

# క్రీడల్లో గెలుపు ఓటములు సహజం... విజయం కోసం పట్టుదలతో పోరాడాలి.

**- తెలంగాణ ట్రాన్స్‌కో & డిస్కంల ఇంటర్ సర్కిల్ క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో డైరెక్టర్ల పిలుపు**



హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 16 ( విజన్ ఆంధ్ర ) క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, పట్టుదలతో విజయం కోసం శక్తివంచన లేకుండా పోరాడిన వారికే విజయం సొంతమవుతుందని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ వి. తిరుపతి రెడ్డి అన్నారు . హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ట్రాన్స్‌కో, టీజీఎన్పీడీసీఎల్ , టీజీఎస్పీడీసీఎల్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 202627 సంవత్సరానికి సంబంధించిన ఇంటర్ సర్కిల్ వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ , క్యారమ్ క్రీడా పోటీలను ముఖ్య అతిథిగా విచ్చేసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఫైనాన్స్ వి. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి క్రీడలను ఎంతో ప్రోత్సహిస్తున్నారని అన్నారు . ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని అలవరచుకొని, క్రమశిక్షణతో, అంకితభావంతో పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని, అదే నిజమైన క్రీడాస్ఫూర్తికి నిదర్శనమని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసం, పట్టుదల, జట్టు భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎంత నిబద్ధతతో పనిచేస్తామో, అదే ఉత్సాహంతో క్రీడల్లోనూ పాల్గొనడం ఉద్యోగుల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తుందని అన్నారు. నిరంతరం పని ఒత్తిడితో పనిచేసే విద్యుత్ ఉద్యోగులకు ఏంతో ఉపశమనమని అన్నారు. అనంతరం డైరెక్టర్ ఆపరేషన్స్ టి. మధుసూదన్ మాట్లాడుతూ వరంగల్ పోరాటాల గడ్డ అని, ఈ నేలలో ఉద్యమస్ఫూర్తి ప్రతి ఒక్కరిలోనూ నిండి ఉంటుందని తెలిపారు. అదే స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని విజయం వైపు అడుగులు వేయాలని క్రీడాకారులను ప్రోత్సహించారు. డైరెక్టర్ హెచ్ఆర్డీ సి. ప్రభాకర్ మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఉద్యోగులు సేవా కార్యక్రమాల్లోనే కాకుండా క్రీడారంగంలోనూ ఎల్లప్పుడూ ముందుంటారని, రాష్ట్ర స్థాయి ఈ ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీలకు ఉమ్మడి వరంగల్ వేదిక కావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీలలో 20 టీంలు వాలీబాల్, 11 టీంలు బాల్ బ్యాడ్మింటన్, 15 టీంలు క్యారమ్ పోటీలలో పాల్గొంటున్ననారని తెలిపారు . ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ రాజు చౌహన్ , సీజియం వేణు బాబు , ప్రెసిడెంట్ స్పోర్ట్స్ కౌన్సిల్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆపరేషన్ హనుమకొండ బి . సామ్య నాయక్ , స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు ఎ. ఆనందం ఎస్ఈ వరంగల్, సి.హెచ్ . సంపత్ రెడ్డి ఎస్ఈ, జనగామ, పి . విజయేందర్ రెడ్డి ఎస్ఈ మహబూబాబాద్, ఎ. రమేష్ ఎస్ఈ జయశంకర్ భూపాలపల్లి , ఎస్ఈ ములుగు బి. భిక్షపతి , స్పోర్ట్స్ ఆఫీసర్ ఎన్ .జగన్నాద్, కే.దర్శన్ కుమార్ కన్వీనర్ , యాకుబ్ బాషా , ప్రేమ్ కుమార్ మెంబర్లు పాల్గొన్నారు.

## యాక్షన్ ప్లాన్ ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

**- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి పనులు వేగవంతం చేయాలి..**

**- వనమహోత్సవానికి పూర్తి సన్నద్ధత అవసరం: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల, జూలై 16 (విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణతో పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, వనమహోత్సవ ఏర్పాట్లపై గృహనిర్మాణ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఇప్పటివరకు మంజూరైన గృహాలు, వివిధ దశల్లో కొనసాగుతున్న నిర్మాణాలు, పూర్తయిన ఇళ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. గుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్న నిజమైన అర్హులకు ప్రాధాన్యతనిస్తూ ఇళ్లను మంజూరు చేయాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను దశలవారీగా త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఏఈలు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నిర్మాణాల పురోగతిని పరిశీలించి, లబ్ధిదారులను ప్రోత్సహించి పనులు వేగంగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్ల మంజూరు ప్రక్రియలో ఎలాంటి అలసత్వానికి తావివ్వకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, రెండో దశలో నిర్మాణానికి ఆసక్తి ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ప్రాధాన్యమిస్తూ మంజూరు ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. వనమహోత్సవానికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేందుకు అన్ని శాఖలు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన మొక్కలను ముందుగానే అందుబాటులో ఉంచడంతో పాటు గుంతలు తవ్వి సిద్ధం చేయాలని సూచించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీపీఓ జయశీలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి


**- జిల్లా క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్‌కు దిశానిర్దేశం చేసిన వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**




వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 16 ( విజన్ ఆంధ్ర ) : కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్‌కు సిడిఆర్, ఐపిడిఆర్, టవర్ డంప్ అనాలిసిస్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ (ఎ) ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ లు హ్యూమన్ ఇంటెలిజెన్స్ ద్వారా నేరాల దర్యాప్తు, పెండింగ్ కేసుల ఛేదన అంశాలపై నిర్వహించిన ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుతం నేరాల స్వరూపం వేగంగా మారుతున్నందున సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన ప్రతి దర్యాప్తు అధికారికి అత్యంత అవసరమని తెలిపారు. నేరస్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, డిజిటల్ కమ్యూనికేషన్‌ను విస్తృతంగా వినియోగిస్తున్న నేపథ్యంలో సిడిఆర్, ఐపిడిఆర్ టవర్ డంప్ డేటా విశ్లేషణతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో హ్యూమన్ ఇంటెలిజెన్స్ ద్వారా సమర్థవంతమైన శోధన ద్వారా కీలక ఆధారాలను సేకరించి కేసులను త్వరితగతిన ఛేదించవచ్చని సూచించారు. పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సాంకేతిక ఆధారాలను వినియోగించి నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, ప్రతి కేసులో డిజిటల్ సాక్ష్యాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి కోర్టులో బలమైన అభియోగపత్రాలు దాఖలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, సోషల్ మీడియా వేదికల ద్వారా నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించడం, పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ కనుగొనడం, మోసాలు, సైబర్ నేరాలు, మహిళలు చిన్నారులకు సంబంధించిన కేసుల్లో డిజిటల్ ఇంటెలిజెన్స్‌ను సమర్థంగా వినియోగించాలని సూచించారు. ప్రతి దర్యాప్తు అధికారికి సహాయకంగా ప్రతి క్రైమ్ స్టాఫ్ సిబ్బంది ఆధునిక దర్యాప్తు పద్ధతులపై నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుని ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిటిసి డిఎస్పి శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్, ఐటి సెల్ ఎస్ఐ శంకర్,ఐటి సెల్ సిబ్బంది, జిల్లా క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి

**- జిల్లా కలెక్టర్ ప్రియాంక.**



నారాయణపేట ,జూలై 16 (విజన్ ఆంధ్ర) : అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్ లో పీ ఎం ఎఫ్ ఎం ఈ, పీఎం విశ్వకర్మ పథకాల కింద తిరస్కరించబడిన దరఖాస్తులపై కలెక్టర్ బ్యాంకర్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూఎస్‌బీఐ శాఖలలో తిరస్కరణలు అధికంగా ఉన్నాయని తెలిపారు. అన్ని దరఖాస్తులను స్పష్టంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తున్నప్పటికీ, ఎస్‌బీఐలో మాత్రమే ఎక్కువ తిరస్కరణలు నమోదవుతున్నాయని పేర్కొన్నారు.ఈ విషయంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ( ఎల్ డి ఎం) సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.వివిధ బ్యాంకులకు కేటాయించిన పీఎం విశ్వకర్మ దరఖాస్తులను బ్యాంకుల వారీగా సమీక్షించి, అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు.బ్యాంకుల వారీగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాల వివరాలను ఆ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్ సమావేశంలో వివరించగా, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.బ్యాంకర్లు, ఏపీఎంలు, డీపీఎంలు పరస్పర సమన్వయంతో పనిచేసి, ఎలాంటి గ్యాప్‌లు లేకుండా అన్ని పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ఆమె సూచించారు.పీ ఎం డీ డి కే వై కార్యక్రమంపై ప్రస్తుతం ప్రత్యేక సమీక్ష జరుగుతోందని, ఢిల్లీ నుంచి ప్రత్యేక అధికారి కూడా సమీక్ష నిర్వహిస్తున్నందున, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. బ్యాంకులు ఆమోదించిన రుణాలను వీలైనంత త్వరగా గ్రౌండింగ్ చేయాలని, ఆగస్టు 15 న చివరి గడువుగా నిర్దేశించినందున, అప్పటిలోగా 100 శాతం గ్రౌండింగ్ పూర్తి చేయాలని సూచించారు.అన్ని పథకాలలో లక్ష్యాలను 100 శాతం సాధించే దిశగా బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. స్త్రీ నిధి రుణాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను కూడా క్రమం తప్పకుండా సమీక్షించి, పురోగతిని వేగవంతం చేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో డీ ఆర్డీ ఓ వెంకట్ రాములు, ఎల్ డీ ఎం విజయ్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, మున్సిపాల్టీ కమిషనర్ శంకర్, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

## బాత్రూంలో చుక్క నీరు లేదు.. మరి కేంద్రం ఇచ్చిన నిధులన్నీ ఎవరి జేబుల్లోకి వెళ్లాయి?!

### కోట్ల నిధులున్న గురుకులంలో అసలేం జరుగుతోంది? తెరవెనుక పెద్ద స్కామేనా?



మహబూబాబాద్ బ్యూరో జులై16( విజన్ ఆంధ్ర) : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గాంధీనగర్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ఇప్పుడు భారీ ఆర్థిక అక్రమాల ఆరోపణలకు కేంద్రబిందువుగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'పీఎం-శ్రీ' (్రావీ-ాా=×) పథకం కింద ఈ మోడల్ స్కూల్‌కు కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. మౌలిక వసతులు కల్పించాల్సిన ఈ భారీ నిధులు ఏమయ్యాయన్నదే ఇప్పుడు జిల్లావ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. కాగితాల్లో కోట్లు.. బాత్రూంలో చుక్క నీరు లేదు! ఈ గురుకులంలో గత నెల రోజులుగా నీటి ఇబ్బందులు తట్టుకోలేక గురువారం విద్యార్థినులు పెద్ద ఎత్తున రోడ్డెక్కి ధర్నాకు దిగారు. ఉదయం లేస్తే వాష్ రూమ్‌లకు వెళ్లడానికి కూడా నీళ్లు లేక నరకం చూస్తున్నామని విద్యార్థినులు కన్నీరుమున్నీరయ్యారు. అయితే, ఇక్కడ అసలైన వివాదం ఏమిటంటే... పాఠశాలలో నీటి మోటార్ పాడైతే, దాన్ని బాగు చేయడానికి నిధులు లేవంటూ విద్యార్థినుల నుండి తలకొక రూ. 10 వసూలు చేయడానికి హెచ్‌ఎం యత్నించడం తీవ్ర దుమారం రేపుతోంది.

నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి?

'పీఎం-శ్రీ' కింద పాఠశాల ఆధునికీకరణ, నీటి వసతి, పారిశుధ్యం కోసం లక్షలాది రూపాయల గ్రాంట్లు విడుదలవుతున్నా... కనీసం ఒక మోటార్ రిపేర్ చేయించలేని స్థితిలో పాఠశాల యాజమాన్యం ఉందా? లేక వచ్చిన నిధులను దారి మళ్లించి జేబులు నింపుకున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ప్రశ్నించిన విద్యార్థినులను ఉపాధ్యాయులు వేధించడం చూస్తుంటే ఈ నిధుల వెనుక పెద్ద స్కామే దాగి ఉందనే ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. కోట్ల రూపాయల పీఎం-శ్రీ నిధుల ఖర్చుపై తక్షణమే విజిలెన్స్ విచారణ జరిపించాలని, విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న హెచ్‌ఎం, అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎల్‌నినో ప్రభావం.. వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులు.

**- ట్యాంకర్లతో నీరు పోసి వరి నారును కాపాడుతున్న రైతన్న.**



మహబూబాబాద్ బ్యూరో జూలై 16( విజన్ ఆంధ్ర ) : మహబూబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లి గ్రామంలో వర్షాలు కరువై.. నీటి ట్యాంకర్లే రైతుకు ఆధారం నారు బ్రతికించేందుకు రైతుల పోరాటం.. ట్యాంకర్లతో సాగు ఎల్‌నినో ఎఫెక్ట్.. ఎండలో ఎండిపోతున్న వరి నారు వానలు లేక విలవిల్లాడుతున్న రైతులు.. ట్యాంకర్లతో నారుకు జీవం గంధంపల్లి రైతు బాలకృష్ణ తన రెండు ఎకరాల పొలం వరి నారును బ్రతికించడం కోసం ఆవేదన.. ట్యాంకర్లతో వరి నారు సంరక్షణ సాగునీరు లేక రైతు కష్టం.. ట్యాంకర్లతో పంటకు ఊపిరి వర్షం కరువై.. వరి నారుకు ట్యాంకర్లే వరం ప్రతి చుక్క నీరే ప్రాణం.. నారును కాపాడేందుకు రైతుల తపన ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవకపోవడంతో గంధంపల్లి గ్రామ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాటేందుకు సిద్ధం చేసిన వరి నారు ఎండిపోకుండా ఉండేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి పోస్తూ పంటను కాపాడుకునేందుకు శ్రమిస్తున్నారు. వర్షాలు కురవాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## నీటి బొట్టును - ఒడిసిపట్టు

**- కామారెడ్డి మున్సిపాలిటీలో28 వేల అనుమతి ఉన్న గృహ నిర్మాణాలు**

**- అనుమతి లేని గృహ నిర్మాణల కోసం మున్సిపల్ సిబ్బందితో పరిశీలన**

**- అక్రమ నిర్మాణపై ఉక్కుపాదం - డిపిఓ వినిత్**



కామారెడ్డి బ్యూరో జులై 16(విజన్ఆంధ్ర) : ప్రతి వ్యక్తి నీటి బొట్టును ఒడిసి పట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కామారెడ్డి మున్సిపల్ టిపిఓ వినీత్ అన్నారు. లేనినొ ప్రభావం జిల్లా పై ఉందన్నారు. అనంతరం భుదవారం 19 వార్డు రామారెడ్డి రోడ్డు లోని 12 షట్టర్లను బుధవారం ఉదయం అనుమతులు లేని వాటిని తొలగించినట్లు ఆయన తెలిపారు. కామారెడ్డి పట్టణ కేంద్రంలో మరో రెండు అనుమతులు లేని షట్టర్లు ఉన్నాయని వాటిని కూల్చివేస్తామన్నారు. హనుమంతుల్లేకుండా ఎవరైనా నిర్మించినట్లయితే మున్సిపల్ యక్ట్ ప్రకారం అనుమతులు లేని నిర్మాణలను కూల్చివేసేందుకు కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్ పకడిపందిగా ప్రణాళికతో ఉందన్నారు అనంతమైన మాట్లాడుతూ 26వ తేదీ ఆగస్టు 2020 తేదీ నుండి వెంచర్లు చేసిన వారికి అనుమతులు రాలేవని అందులో ప్లాట్లు కొనదని, కోన్నట్లయితే మోసపోతార ని ప్రజలకు ఆయన సూచించారు. కోన్నవారు మోసపోతారని రిజిస్ట్రేషన్ కావని అయినా మున్సిపల్ పరిధిలో అవి చెల్లవన్నారు. ఎల్ ఎస్ ఆర్ ప్రకారం నిబంధనలు ఉంటాయన్నారు.త్వరలో మరో రెండు అనుమతులు లేని కమర్షియల్ షట్టర్లను తొలగిస్తామని తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో అధికారికంగా 28 వేల నిర్మాణాలు ఉన్నాయన్నారు. అనుమతి లేని వాటిని ఇబ్బందితో పరిశీలిస్తున్నట్లు టిపిఓ వినీత్ తెలిపారు

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు బ్లాక్ స్పాట్లపై ఎస్పీ ప్రత్యేక దృష్టి

**- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం**



బోయినపల్లి రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 16 (విజన్ ఆంధ్ర): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గురువారం బోయినపల్లి మండలం కోదురుపాక చౌరస్తాలో ప్రమాదాలు తరచూ జరిగే బ్లాక్ స్పాట్ ప్రాంతాన్ని పరిశీలించారు. వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, బోయినపల్లి ఎస్ఐ రమాకాంత్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించారు. ప్రమాదాలకు దారితీసే కారణాలను పరిశీలించిన ఎస్పీ, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా నివారించే చర్యలను వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. ప్రజల ప్రాణ రక్షణకు ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించిన ఆయన, ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు నిర్మించడం, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడం, రోడ్డు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించి సురక్షిత ప్రయాణాన్ని అలవాటు చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎస్పీ మిడ్ మానేర్ డ్యామ్‌ను సందర్శించి, సంబంధిత ఇంజనీర్లతో డ్యామ్ భద్రత, ముందస్తు జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. డ్యామ్ పరిసర ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, బోయినపల్లి ఎస్ఐ రమాకాంత్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వరల్డ్ మిఠాయి, నమ్కీన్ కన్వెన్షన్-26 ప్రారంభం





హైదరాబాద్, జూలై 16 (విజన్ ఆంధ్ర): హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జూలై 16–18 వరకు జరిగే వరల్డ్ మిఠాయి, నమ్కీన్ కన్వెన్షన్(డబ్ల్యూఎంఎన్సీ) పర్చేసింగ్–2026 గురువారం ఘనంగా ప్రారంభమైంది. రాజేష్ దాదూ(దాదూస్), పి.వి.వి.ఎస్. మల్లిఖార్జున రావు(సురుచి ఫుడ్స్), చైతన్య ముప్పాల(ఆల్మండ్ హౌస్), రాజేష్ రామ్నానీ(కరాచీ బేకరీ), ఫిరోజ్ హెచ్. నఖ్వీ(ఏఐఎం ఈవెంట్స్, ఎఫ్ఎస్ఎన్ఎం) జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ముడి పదార్థాలు, డ్రైఫ్రూట్స్, మెషినరీ, ప్యాకేజింగ్, ఆటోమేషన్ తదితర రంగాలకు చెందిన 300కుపైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. అనుముల బాబురావు, మహ్మద్ అబ్దుల్ మజీద్, నాగార్జున ముప్పాల, పూనంచంద్ పన్వార్, సుధీర్ షా పాల్గొన్నారు. హల్దీరామ్స్, పిస్తా హౌస్, అమూల్ మిఠాయి, అదానీ స్పైసెస్, బాలాజీ రతన్‌లాల్ మిఠాయి, వీకేసీ నట్స్, స్వాని ఎంటర్‌ప్రైజెస్, నివృతి ఆగ్రో ఫుడ్ ప్రొడక్ట్స్, పారస్ పాలిమర్స్, ప్రెస్టెయిర్ సిస్టమ్స్ ఎల్ఎల్పీ, కరాచీ బేకరీ, గిర్నార్ ఫుడ్ మెషిన్, విపిన్ అగర్వాల్–ది సాఫ్రాన్ ఎక్స్‌పర్ట్, మహేంద్ర మిఠాయివాలా, ఉపద్రష్ట డెయిరీ స్పెషాలిటీస్, రామ్ భరోసా సంస్థలు మద్దతు అందించాయి. జూలై 17న ఫన్నా బాబు మెమోరియల్ డబ్ల్యూఎంఎన్సీ క్రికెట్ లీగ్ ఫైనల్, జూలై 18న ఫ్యాక్టరీ విజిట్స్ నిర్వహించనున్నారు. 30 వేల మందికిపైగా వ్యాపార సందర్శకులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

# పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్, అకౌంట్స్ అంశాలపై జూలై 17న పెన్షన్ అదాలత్..

కరీంనగర్(విజన్ ఆంధ్ర బ్యూరో), జూలై 16: అకౌంటెంట్ జనరల్, హైదరాబాద్ కార్యాలయం ఆధ్వర్యంలో పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్, అకౌంట్స్ సంబంధిత అంశాలపై జూలై 17 (శుక్రవారం) ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రత్యేక పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ ఏవో సుధాకర్ తెలిపారు. పూర్వ కరీంనగర్ జిల్లాకు చెందిన డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు), పెన్షనర్లు ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు. పెన్షన్ సంబంధిత సమస్యల పరిష్కారం, ప్రావిడెంట్ ఫండ్, అకౌంట్స్ అంశాలకు సంబంధించిన సందేహాల నివృత్తి, అలాగే అకౌంటెంట్ జనరల్ కార్యాలయం వార్షిక తనిఖీలో పేర్కొన్న అభ్యంతరాలు, లోపాల పరిష్కారానికి ఈ అదాలత్ వేదికగా నిలుస్తుందని తెలిపారు. అందువల్ల సంబంధిత అధికారులు, పెన్షనర్లు అవసరమైన పత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరేట్ ఏవో విజ్ఞప్తి చేశారు.

# కేజీబీవీ పాఠశాల లో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం..

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 16 (విజన్ ఆంధ్ర) : కోమురం భీమ్ ఆసిఫాబాద్



జిల్లా ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు కాగజ్నగర్ టౌన్ లోని కేజీబీవీ పాఠశాల ప్రాంగణంలో జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాబృంద సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, బాల్యవివాహాల ముప్పులు, రోడ్డు ప్రమాదాలు నివారణ, చట్టం–శాంతి భద్రత, మహిళల భద్రత, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, హెల్ప్‌లైన్ నంబర్లు (1930, 100, 1098) వినియోగం వంటి ముఖ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజ సేవా భావన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాగజ్నగర్ టౌన్ ఎస్.ఐ రాజు ,పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రమాదేవి, కళబృందం సభ్యులు రోహిత్, రాంచందర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, రజిత, సంఘవి , విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కళాబృందం ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, యువతలో సమాజహితం, చట్టం–శాంతి, భద్రత, జాగ్రత్తలు వంటి విషయాల్లో మరింత అవగాహన పెంచడమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు.

# సాంఘిక సంక్షేమ గురుకులాలలో పోస్టుల భర్తీకి చర్యలు

**- టి జి ఎస్ డబ్ల్యు ఆర్ ఐ ఈ ఎస్ సమన్వయకర్త కోటూరి రామ కళ్యాణి**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 17,(విజన్ ఆంధ్ర ) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థచే నడుపబడుతున్న సాంఘిక సంక్షేమ గురుకులాలలో తాత్కాలిక అధ్యాపకులు, ఉపాధ్యాయుల భర్తీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ / టి జి ఎస్ డబ్ల్యు ఆర్ ఐ ఈ ఎస్ సమన్వయకర్త కోటూరి రామ కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 9 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో బోధన చేసేందుకు తాత్కాలిక బోధనా సిబ్బంది ఎంపిక కొరకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. సైన్స్, ఆర్ట్స్ కళాశాలలో అందుబాటులో ఉన్న ఖాళీల మేరకు తాత్కాలిక పద్ధతిన జూనియర్ లెక్చరర్ / పి జి టి/ టి జి టి/ స్పెషల్ టీచర్ల కొరకు ఈనెల 23వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా లక్షెట్టిపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో కార్యాలయ పని వేళలలో అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. 25వ తేదీన జూనియర్ లెక్చరర్, పి జి టి క్యాడర్ ఖాళీలకు, 27వ తేదీన టి జి టి, స్పెషల్ టీచర్ క్యాడర్ 2 రోజులపాటు ఉదయం 9 నుండి తరగతి బోధన పరిశీలన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జూనియర్ లెక్చరర్, పి జి టి పోస్టులకు యు జి సి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పి.జి. డిగ్రీ తో పాటు బి.ఈడి. అర్హత, టి జి టి పోస్ట్ కు యు జి సి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి బి.ఎస్ సి./బి. ఎ./ బి. కాం. డిగ్రీ కనీసం 50 శాతం మార్కులతో పాటు బి. ఈడి. అర్హత కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు నిర్దేశిత తేదీలలో తమ పూర్తి బయోడేటా తో పాటు ధ్రువపత్రాల పరిశీలన కొరకు తమ విద్యార్హతలను తెలిపే ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఒక జత నకలు ప్రతులను తీసుకొని లక్షెట్టిపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో సకాలంలో హాజరుకావాలని తెలిపారు. బాలికల విద్యాలయాలలో పనిచేయడానికి మహిళ అభ్యర్థులు మాత్రమే అర్హులని, ప్రకటించబడిన ఖాళీలలో ఎంపిక కమిటీ నిర్ణయానికి లోబడి మార్పులు ఉండవచ్చని తెలిపారు. జిల్లాలో 40 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పురుషులకు జూనియర్స్ లెక్చరర్ విభాగంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటని, జువాలజీ, సివిక్స్ సబ్జెక్టులలో ఒక్కొక్క పోస్టు, పి.జి.టి. విభాగంలో మ్యాథమెటిక్స్, బయోసైన్స్, సోషల్ స్టడీస్ లో ఒక్కొక్క పోస్టు, ఇంగ్లీష్ లో 2 పోస్టులు, టి.జి.టి. విభాగంలో బయో సైన్స్ ఒక్క పోస్టు, పార్ట్ టైం హిందీ లో 4 పోస్టులు, ఆర్ట్ టీచర్ 2 పోస్టులు, లైబ్రరీ ఒక పోస్టు ఉన్నాయని తెలిపారు. మహిళలకు జూనియర్ లెక్చరర్ విభాగంలో ఇంగ్లీష్, కెమిస్ట్రీ, సివిక్స్ సబ్జెక్టులలో ఒక్కొక్క పోస్టు, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులో 2 పోస్టులు, పి.జి.టి. విభాగంలో ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులలో ఒక్కొక్క పోస్టు, టి.జి.టి. విభాగంలో మ్యాథమెటిక్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీ లలో ఒక్కొక్క పోస్టు, హిందీ పార్ట్ టైం 4 పోస్టులు, పి.ఈ.టి./ పి.డి. 2 పోస్టులు, మ్యూజిక్ టీచర్, క్రాఫ్ట్ టీచర్, లైబ్రరీయన్, స్టాఫ్ నర్స్ లలో ఒక్కొక్క పోస్టు ఉన్నాయని తెలిపారు. జూన్ 27, 2026 నాడు లక్షెట్టిపేటలో నిర్వహించిన పార్ట్ టైం టీచర్స్ ఎంపిక డెమోకు హాజరైన వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# గ్రామీణ ప్రజలు ఓటరుగా నమోదు చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**





వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 16 ( విజన్ ఆంధ్ర ) : గ్రామాల్లో ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు అయ్యేవిధంగా బిఎల్ఓ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. గురువారం వికారాబాద్ నియోజకవర్గం, దారూర్ మండల కేంద్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ, మహిళా సంఘం సమావేశం, ఇందిరమ్మ మహిళా శక్తి కుట్టు కేంద్రం, తరిగోపులలో ప్రాథమిక పాఠశాలను, ఆయిల్ ఫామ్ సాగు, వ్యవసాయ పంట పొలాలను జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఎస్ఐఆర్ లో భాగంగా ఇంటింటికి ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా తిరిగి వచ్చే విధంగా బిఎల్ఓ తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో ప్రజలకు సహకరించాలని అదేవిధంగా తండాలలోని ప్రజానీకానికి సైతం ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించి పూర్తిస్థాయిలో ఎన్యూమరేషన్ ఫారాలను వెనక్కి తీసుకుని డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో లేని వారు ఆన్ లైన్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించాలి అనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కలెక్టర్ తెలిపారు. మహిళా సంఘం ఏర్పాటు చేసుకున్న సమావేశానికి జిల్లా కలెక్టర్ హాజరై మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ తెలిపారు. బ్యాంకు లింకేజీ రుణాలను ఎప్పటికప్పుడు చెల్లించాలని కలెక్టర్ సూచించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకంను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునే విధంగా డ్వాక్రా మహిళలు తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులకు ఏకరూప దుస్తులను సిద్ధం చేస్తున్న ఇందిర మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పంపిణీకి సిద్ధం ఉన్న దుస్తులను పాఠశాలకు అందజేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. సకాలంలో వర్షాలు కురియని పక్షంలో ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. రైతు నేస్తం సమావేశాలు నిర్వహించి యూరియా, డీఏపి లభ్యతపై ఏఈఓల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం తరిగోపుల ప్రాథమిక పాఠశాలను సందర్శించి గుణింతాలు, గణితంలో విద్యార్థుల నైపుణ్యతను గుర్తించి జిల్లా కలెక్టర్ అభినందించారు. నాణ్యమైన విద్యా ప్రమాణాలతో బోధించడంతోపాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ సూచించారు. తరిగోపులలో ఆయిల్ ఫామ్ సాగును జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఆయిల్ ఫామ్ సాగుకు ఆసక్తి చూపే రైతులను గుర్తించి ఆధునిక సాంకేతికతను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఆయిల్ ఫామ్ సాగు వల్ల లాభాలు, ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ, అంతర పంటల సాగుపై కూడా రైతులకు సూచించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, డిఆర్ఓ స్వర్ణలత, డిహెచ్ఎస్ఓ సత్తార్, జిల్లా వ్యవసాయ అధికారి కవిత, తహసిల్దార్ సాజిదా బేగం, ఎంపీడీఓ నరసింహులు, ఎంఈఓ చెన్నయ్య, దారూర్ సర్పంచ్ పర్మిల తదితరులు ఉన్నారు.

# డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి....

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 16,(విజన్ ఆంధ్ర)ద: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ త్వరగా పూర్తి అయ్యే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 100 శాతం పూర్తి చేయడంలో రాజకీయ పార్టీలు తమ సహకారం అందించాలని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 76 శాతం డిజిటలైజ్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, గ్రామీణ ప్రాంతాలలో ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని, పట్టణ ప్రాంతాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ స్థాయి అధికారులకు అందే విధంగా చొరవ తీసుకోవాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని, కానీ ప్రక్రియ ముందే పూర్తి చేసే విధంగా రాజకీయ పార్టీలు కృషి చేయాలని తెలిపారు. ఎ.ఎస్.డి. ఓటర్ల జాబితా, రేషనలైజేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టడం జరుగుతుందని, మ్యాపింగ్ కాని వారిని గుర్తించాలని తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు బూత్ స్థాయి అధికారులకు సహకరించి ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ చికిత్సలో సరికొత్త విప్లవం

**- హైటెక్ సిటీ యశోద**

**- హాస్పిటల్స్‌లో అత్యాధునిక 'ఇన్-హౌస్ ఎన్ జి ఎస్' సేవలు ప్రారంభం!**

**- సమగ్ర జన్యు పరీక్షల ద్వారా క్యాన్సర్ రోగులకు వ్యక్తిగతీకరించిన చికిత్స**

**- రిపోర్టుల వేగవంతం, ఊపిరితిత్తులు, రొమ్ము, జీర్ణాశయ క్యాన్సర్ రోగులకు ఎంతో మేలు.**

**- ప్రముఖ మెడికల్ ఆంకాలజిస్ట్ (క్యాన్సర్ నిపుణులు) డాక్టర్ శిఖర్ కుమార్**




హనుమకొండ జిల్లా ప్రతినిధి జూలై 16 ( విజన్ ఆంధ్ర ) : క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స రంగంలో సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెస్తూ.. హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్ తాజాగా 'ఇన్–హౌస్ నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్' (ఎన్ జి ఎస్) సదుపాయాన్ని ప్రారంభించింది. క్యాన్సర్ రోగుల జన్యు నిర్మాణాన్ని విశ్లేషించి, వారికి అత్యంత ఖచ్చితమైన, వ్యక్తిగతీకరించిన వైద్యం అందించడంలో ఈ సాంకేతికత కీలక మైలురాయిగా నిలవనుంది. గురువారం రోజున హనుమకొండ యశోద క్లినిక్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ మెడికల్ ఆంకాలజిస్ట్ (క్యాన్సర్ నిపుణులు) డాక్టర్ శిఖర్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వైద్యరంగం సాంప్రదాయ "అందరికీ ఒకే రకమైన చికిత్స" విధానం నుండి 'ప్రెసిషన్ ఆంకాలజీ' వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఆధునిక చికిత్సలైన టార్గెటెడ్ ఓరల్ థెరపీలు, ఇమ్యూన్ చెక్‌పాయింట్ ఇన్హిబిటర్స్ వంటి రోగుల జీవనకాలాన్ని, వారి జీవన నాణ్యతను గణనీయంగా పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో, యశోద హాస్పిటల్స్ సొంతంగా (ఇన్–హౌస్) ఈ ఎన్ జి ఎస్ ల్యాబ్ ఏర్పాటు చేయడం విశేషం. ఇన్–హౌస్ ఎన్ జి ఎస్ వల్ల కలిగే ముఖ్య ప్రయోజనాలు, వేగవంతమైన నివేదికలు, ఆసుపత్రి ప్రాంగణంలోనే ఈ పరీక్షలు నిర్వహించడం వల్ల రోగి యొక్క జన్యుపరమైన మార్పులను అత్యంత వేగంగా, ఖచ్చితంగా గుర్తించవచ్చును. పరీక్షా ఫలితాల ఆధారంగా ఆంకాలజిస్టులు ప్రతి రోగి ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా చికిత్సను డిజైన్ చేయడానికి వీలవుతుంది. ముఖ్యంగా ఊపిరితిత్తుల (లంగ్ ), రొమ్ము (బ్రేస్ట్ ), జీర్ణాశయ సంబంధిత (గ్యాస్ట్రోయింటెస్టినల్ ) క్యాన్సర్లతో పాటు ఇతర కణితుల (తుమర్స్ ) చికిత్స నిర్ణయాలలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. "సొంతంగా ఎన్ జి ఎస్ సదుపాయాన్ని ప్రారంభించడం ద్వారా ప్రెసిషన్ ఆంకాలజీ విభాగంలో యశోద హాస్పిటల్స్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. అత్యాధునిక సాంకేతికతను రోగులకు మరింత వేగంగా, చేరవ చేయడమే మా లక్ష్యం." అని ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది. ఒకే గూటి కింద ప్రపంచ స్థాయి క్యాన్సర్ కేర్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్‌లో ఇప్పటికే అత్యంత అనుభవజ్ఞులైన మల్టీడిసిప్లినరీ క్యాన్సర్ నిపుణుల బృందం అందుబాటులో ఉంది. అత్యాధునిక రోబోటిక్ ఆంకోసర్జరీ, భారతదేశంలోనే తొలి రేడియేషన్ థెరపీ వ్యవస్థలతో పాటు, ఇప్పుడు ప్రారంభమైన ఎన్ జి ఎస్ సదుపాయంతో క్యాన్సర్ రోగులకు ఒకే చోట పూర్తిస్థాయి, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సమగ్ర వైద్య సేవలు లభించనున్నాయి. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది సాయి వెంకట్, విజయ్ కుమార్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# దశాబ్దకాల పోరాటానికి దక్కిన ఫలితం..

**- అనఘాపురి పార్కు స్థలానికి హైడ్రా రక్షణ**

**- అనఘాపురి కాలనీ అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ రెడ్డి**



బోడుప్పల్,జూలై 16(విజన్ ఆంధ్ర) :ప్రజల ఐక్యత, పట్టుదల ఉంటే ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవచ్చని అనఘాపురి కాలనీ వాసులు మరోసారి నిరూపించారు. బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అనఘాపురి కాలనీ సర్వే నంబర్ 92లోని లేఔట్ లో కేటాయించిన 498 గజాల పార్కు స్థలాన్ని కాపాడేందుకు కాలనీ సంక్షేమ సంఘం దాదాపు పదేళ్లుగా సాగించిన పోరాటానికి ఫలితంగా హైడ్రా అధికారులు రంగంలోకి దిగి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. 2014లో గ్రామపంచాయతీ నుంచి ఆర్‌టీఐ ద్వారా పార్కు స్థలానికి సంబంధించిన రికార్డులను సేకరించి కాలనీ కార్యక్రమాలకు వినియోగిస్తూ పరిరక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. 2024లో జరిగిన ఆక్రమణ ప్రయత్నాలను మున్సిపల్ అధికారుల సహకారంతో అడ్డుకున్నామని, తాజాగా మళ్లీ ఆక్రమణకు యత్నించడంతో ప్రస్తుత సంఘం అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారని తెలిపారు. దీనిపై స్పందించిన హైడ్రా అధికారులు స్థలాన్ని పరిశీలించి తగిన చర్యలు చేపట్టారు. హైడ్రా,ఎంఎంసీ అధికారులకు కాలనీ సంక్షేమ సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు దాచేపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఏనుగు సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు ఉమ్మడోజి యాదగిరి చారి,సహాయ కోశాధికారి గొట్టిముక్కల వెంకటరెడ్డి, సమన్వయ కార్యదర్శి రచ్చ సత్యనారాయణ, కార్యనిర్వహణ కార్యదర్శి సమరామిరెడ్డి, సంయుక్త కార్యదర్శి కొమ్మ బాబు, సాంస్కృతిక కార్యదర్శి బాకీ బాలరాజు, సలహాదారులు మైస రవిచంద్రన్, మట్ట సెట్టయ్య సత్యనారాయణ, కార్యవర్గ సభ్యుడు వనపర్తి మనోజ్,కాలనీ వాసులు కండే రావు హనుమంతరావు, ఇల్లందుల జగదీశ్వరయ్య, బెజగం భాస్కర్, ఎంకర్ల లక్ష్మణ్, ఎర్రోజు యాదగిరి చారి మహేందర్, దామర్ల పర్వతాలు,జి. కృష్ణాచారి,నితిన్ రెడ్డి, అజయ్, మాధవ్, రాము పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తాం

**- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**

**- మంత్రిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**



హైదరాబాద్, జూలై 16 (విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంత్రి శ్రీధర్ బాబు ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి "టీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీ" ని అందజేసింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సంక్షేమ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని, ముఖ్యమంత్రితో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు కుంచెం శ్రీనివాస్, వి. రవికుమార్, పర్కాల సమ్మయ్య గౌడ్, చొల్లేటి బ్రహ్మచారి, ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పీ ఎం కిసాన్ కటాఫ్ తేది పెంచాలి



నారాయణపేట, జూలై 16 ( విజన్ ఆంధ్ర) : దేశ వ్యాప్తంగా రైతులకు పెట్టుబడి సాయం అందించే పీ ఎం కిసాన్ సమ్మాన్ నిధి కి దరఖాస్తు చేసుకోవడానికి కటాఫ్ తేది పెంచి అవకాశం ఇవ్వాలని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా కేంద్ర ప్రభుత్వానికి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ సమావేశంలో ఈ విషయాన్ని చర్చించి సన్నకారు, చిన్నకారు రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ పథకంలో చేరుటకు కటాఫ్ తేది 2019 జనవరి 31 వరకు మాత్రమే ఇచ్చారు.ఆ తర్వాత పథకంలో చేరుటకు దరఖాస్తు చేసుకుందామంటే కటాఫ్ తేది పెంచలేదు. ఈ పథకం ప్రారంభము అయినప్పుడు 5 సంవత్సరాల తర్వాత ఈ పథకంలో చేరుటకు అవకాశం ఇస్తామని చెప్పి ఇవ్వలేదు కావున అర్హత గల రైతులు పెట్టుబడి సాయం పొందలేక పోతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అర్హత గల సన్నకారు, చిన్నకారు రైతులు ఈ పథకంలో చేరుటకు నిబంధనలు సడలించి కటాఫ్ తేది పెంచాలని కోరారు.

# ప్రజాసేవేలక్ష్యంగానిరంతరం అందుబాటులోఉంటా.

**- ఊట్కూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సి. సూర్యప్రకాశ్ రెడ్డి**



ఊట్కూర్, జులై 16 ( విజన్ ఆంధ్ర) : రాష్ట్ర పాడి పరిశ్రమ, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ఊట్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు సి. సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో మల్లెపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆయనను ఘనంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్తతో సమన్వయంగా ముందుకు సాగుతానని అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మల్లెపల్లి కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, సూర్యప్రకాశ్ రెడ్డి నాయకత్వంలో మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తూ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేపల్లి కాంగ్రెస్ నాయకులు రాములు, కృష్ణంరాజు, శంకరప్ప, వెంకటప్ప, నర్సప్ప, శంకర్ తరుణ్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వెల్కటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హైమావతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 16 జూలై : ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ప్రతి రోజు క్రమంతప్పకుండా చదవాలని, సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి విద్యార్థులకు సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్పాఠశాల ప్రాంగణం మొత్తం కలియతిరిగారు. మైదానంలో చెట్లు ప్రశాంతమైనవాతావరణం బాగుందని ప్రిన్సిపల్నుఅభినందించారు.పదవ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అన్ని సబ్జెక్ట్స్ తరగతులు అవుతున్నాయా, మధ్యాహ్న భోజనం బాగుందా అని అడగ్గా అన్ని తరగతులు బాగానే అవుతున్నాయని భోజనం బాగుందని విద్యార్థులు కలెక్టర్ కి తెలిపారు.గోడపైన రాయించిన తెలుగు వ్యాకరణం, ఇంగ్లీష్ టెన్సెస్, గణిత సుత్రాలు, సైన్స్ సుత్రాలను చూపిస్తూ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. గోడపైన రాసినవి రోజు చూస్తుంటే వాటిని ఎప్పటికీ మర్చిపోకుండా జ్ఞాపకం ఉంటాయని, రోజు ఒకసారి వాటిని తప్పనిసరిగా చదవాలని తెలిపారు.సబ్జెక్టులో ఏదైతే రాదన్న టాపిక్ పలు మార్లు చదివితే రానీదంటూ ఏదీ ఉండదని, సమయాన్ని వృథా చేయవద్దని పుస్తక జ్ఞానంతో పాటు రోజు న్యూస్ పేపర్ చదవాలని సూచించారు.ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను పెండింగ్ ఉంచకుండా అదే రోజు చదవాలని, మంచి క్రమశిక్షణతో కూడిన అలవాట్లనుఅలవర్చుకోవాలని, సబ్జెక్టుకు సంబంధించి ఏలాంటి డౌట్స్ ఉన్నా ఉపాధ్యాయుల దృష్టికి తేవాలని,భయపడుతూ, సార్ఏమంటారో, అనివెనకడుగు వేయకూడదని, ధైర్యంగా తెలపాలని జీవితంలో ఏ రంగం ఎంచుకున్న దృఢంగా నిలబడినాలని తెలిపారు.పదవ తరగతి అనేది జీవితానికి ఒక పునాది వంటిదని ఇక్కడ బాగా చదివి అందరూ ఫస్ట్ క్లాస్ లో ఉత్తీర్ణులు కావాలని, మీకు మీ పాఠశాలకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.

# నంగునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి16 జూలై : సిద్దిపేట జిల్లా అంతట సీజనల్ వ్యాధులకు సంబంధించి మెడిసిన్, పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, ప్రజలు వీటి బారిన పడకుండా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి డాక్టర్లను ఆదేశించారు. గురువారం నంగునూరు మండలం రాజగోపాల్ పేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలోపరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో సీజనల్ వ్యాధులకు ప్రబలకుండా మెడిసిన్స్, వైద్య పరికరాలుఅందుబాటులో ఉంచుకోవాలని, పిఎచ్ సి పరిధిలోని యుపిహెచ్ సి లోఏఎన్ఎం,సూపర్వైజర్ ల ద్వారా ప్రజల్లో సీజనల్ వ్యాధులకు సంబంధించి అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ను ఆదేశించారు.ఓపి ఎంత, ఆసుపత్రి సిబ్బంది అందరూ వచ్చారా ఆరా తీస్తూ అటెండెన్స్ లీవ్ లీటర్లు, ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు. రోజు 50నుండి 60 ఓపీ ఉంటుందని అందరూ వచ్చారని ఏంఓ కలెక్టర్ కి తెలిపారు. మెడికల్ ఆఫీసర్ నుండి సిబ్బంది సమయపాలన పాటించాలని రోగులకు ఎల్లప్పుడూఅందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యంఅందించాలనిఆదేశించారు. పిహెచ్ సి వచ్చిన రోగులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యంచేయించుకోవాలని సూచించారు. వైద్యులు అందించిన మందులు, మంచి ఆహారపు అలవాట్లుఅలవర్చుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

# సామాజిక-ఆర్థిక అభివృద్ధిలో నాబార్డ్ కీలక పాత్ర పోషిస్తూ దేశ అభివృద్ధికి అండగా నిలుస్తోంది

**- జిల్లా కలెక్టర్ ప్రియాంక.**



నారాయణపేట జూలై 16 (విజన్ ఆంధ్ర) : గ్రామీణాభివృద్ధి, వ్యవసాయాభివృద్ధి సమగ్ర సామాజిక–ఆర్థిక అభివృద్ధిలో నాబార్డ్ ఎల్లప్పుడూ కీలక పాత్ర పోషిస్తూ దేశ అభివృద్ధికి అండగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రీఫైనాన్సింగ్, రైతులకు ఆర్థిక సహాయం, మహిళా సంఘాలకు ఫైనాన్షియల్ సపోర్ట్, నేచురల్ ఫార్మింగ్ ప్రోత్సాహం వంటి అనేక రంగాల్లో నాబార్డ్ ఎంతో విశేషమైన సేవలు అందిస్తోందన్నారు. నా బార్డ్ డే సందర్భంగా గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నారాయణపేట జిల్లాలో కూడా నాబార్డ్ ఇటీవల తన కార్యకలాపాలను మరింత విస్తరించడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. మనలాంటి గ్రామీణ జిల్లా అభివృద్ధికి నాబార్డ్ వంటి సంస్థలు చేరువ కావడం ఎంతో అవసరం అని తెలిపారు.స్వయం సహాయక సంఘాల ( ఎస్ హెచ్ జి ఎస్) సభ్యులు నాబార్డ్ అందిస్తున్న అభివృద్ధి అవకాశాలు, పథకాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని తమ జీవనోపాధిని మరింత మెరుగుపరచుకోవాలని ఆమె సూచించారు. దేశంలో ఎన్నో ఆర్థిక సంస్థలు ఉన్నప్పటికీ, గత 45 సంవత్సరాలుగా గ్రామీణ ప్రజలకు నమ్మకమైన భాగస్వామిగా నాబార్డ్ సేవలందిస్తోందన్నారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన ఏ సమావేశం జరిగినా, జిల్లా కలెక్టర్ పిలుపు వచ్చిన వెంటనే స్పందిస్తూ, "మేము సిద్ధంగా ఉన్నాం... అవసరమైతే డీపీఆర్‌లు తయారు చేస్తాం... మా వద్ద నిధులు ఉన్నాయి... జిల్లాకు అవసరమైన సహకారం అందిస్తాం" అనే సానుకూల దృక్పథంతో నాబార్డ్ అధికారులు ఎప్పుడూ ముందుంటున్నారని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఈ సహకారం మరింత బలపడాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నానని అన్నారు. ముఖ్యంగా మన జిల్లా మహిళలకు నా బార్డ్ సంస్థలు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, మనం కూడా ముందుకు రావాలని, మనం ఏం చేయగలం? మన గ్రామాల్లో ఏ అవకాశాలు ఉన్నాయి? ఏ వ్యాపారాలు ప్రారంభించవచ్చు? అనే విషయాల్లో ధైర్యంగా ముందుకు రావాలని మహిళా సంఘాల సభ్యులకు ఆమె సూచించారు. సంఘాలతో నిరంతరం అనుసంధానంగా ఉండాలని, రుణం తీసుకోవడమే కాకుండా ఆ రుణాన్ని సరైన విధంగా ఉపయోగించి మరింత ఆదాయం వచ్చేలా వ్యాపారాన్ని విస్తరించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు, ఇతర అవకాశాలను కూడా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నా బార్డ్ అందించబోయే ప్రెజెంటేషన్‌లో కూడా ఈ అంశాల గురించి వివరంగా తెలియజేస్తారనీ, అందరూ శ్రద్ధగా విని, ఎలాంటి సహాయం అవసరమైనా నాబార్డ్ సంస్థ ద్వారా, అలాగే సంబంధిత ప్రభుత్వ శాఖల ద్వారా తాము ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం "కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలి" అనే లక్ష్యంతో పనిచేస్తోందనీ, అలాగే నారాయణపేటను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆ మహత్తర లక్ష్య సాధనలో నాబార్డ్ తన సహకారం, మార్గదర్శకత్వాన్ని మరింతగా అందించాలని, ఆ లక్ష్య సాధనలో మనమందరం భాగస్వాములు కావాలని రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో, చురుకుదనంతో ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం స్వయం సహాయక సంఘాల బలోపేతం మహిళా పారిశ్రామిక వేత్తల అభివృద్ధి విజయ గాథల గురించి ట్రైనీ శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో డీ ఆర్డీవో వెంకట్ రాములు, నాబార్డు డీ డీ మహేందర్ బాబు, ఎల్ డి ఎం విజయ్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సాయిబాబా, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, కార్యదర్శి పద్మమ్మ, కోశాధికారి అంజమ్మ, మున్సిపల్ కమిషనర్ శంకర్, డీ పీ ఎం లు, ఏ పీ ఎం లు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



కడప,జూలై 16( విజన్ ఆంధ్ర)జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్2026) కార్యక్రమం నిర్దేశిత ప్రణాళిక ప్రకారం విజయవంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గురువారం విజయవాడ నుండి ాx= నిర్వహణ, పురోగతిపై.రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జేసీ డా. నిధీమీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డిఆర్వో మల్లికార్జునుడు, సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు.జిల్లాలోని 18,96,231 మంది ఓటర్లకు సంబంధించిన గణన పత్రాల పంపిణీని 100 శాతం పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే ఇప్పటివరకు 16,46,067 గణన పత్రాలను డిజిటలీకరించి, 86.81 శాతం పురోగతి సాధించినట్లు వివరించారు. ఓటర్ల వివరాల ధృవీకరణలో భాగంగా 2,50,109 మంది ఏఎస్‌డీ (గైర్హాజరు, మరణించిన, శాశ్వతంగా నివాసం మార్చుకున్న తదితర) ఓటర్లను పునఃపరిశీలించినట్లు తెలిపారు. అదేవిధంగా 1,12,679 నో మ్యాపింగ్ కేసులు, 3,40,730 లాజికల్ వ్యత్యాసాల కేసులను గుర్తించి పరిష్కార చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఓటర్ల ఫొటోల నాణ్యత మెరుగుదల, లోపాల సవరణ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ వంటి అంశాలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, బూత్ స్థాయి అధికారులు సమన్వయంతో ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లాలోని ఎన్నికల నమోదు అధికారుల (ఈఆర్వోలు)తో సమీక్షించారు ఈ సందర్భంగా.ఎస్ఐఆర్ కార్యక్రమంలో మిగిలిన ప్రక్రియలను వేగవంతం చేసి, ఈ నెల 22వ తేదీలోగా జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇంటింటి సందర్శన, గణన పత్రాల సేకరణ, డిజిటైజేషన్, ఓటరు వివరాల ధృవీకరణ, పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి బూత్ స్థాయి అధికారితో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ, అర్హులైన ప్రతి ఓటరి వివరాలు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ఈఆర్వోలు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వోలు మురళి,శిరీష, చంద్రమోహన్,చిన్నయ్య, వెంకటపతి,జాన్ ఇర్విన్, నీలమయ్య, ప్రతాప్ రెడ్డి తదితరులు. పాల్గొన్నారు.

# రోడ్లపై అక్రమ పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు


**- అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్**



నారాయణపేట ,జూలై 16 (విజన్ ఆంధ్ర) : డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇబ్బందులు, అక్రమ పార్కింగ్ లపై పలు విన్నతులు వచ్చినందున జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించడం లక్ష్యంగా అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్ పట్టణంలోని ప్రధాన రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ శివశంకర్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్యతో కలిసి సరబ్ బజార్, మెయిన్ చౌక్ నుంచి ఓల్డ్ బస్టాండ్, సత్యనారాయణ చౌరస్తా, యాద్గిరి ప్రధాన రహదారి తదితర రద్దీ ప్రాంతాలను సందర్శించి ట్రాఫిక్ పరిస్థితిని సమీక్షించారు. రహదారులపై అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలు, షాపుల ముందు ఆక్రమణలు, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే పరిస్థితులను పరిశీలించి సంబంధిత షాపు యజమానులు, వాహనదారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సౌకర్యమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలను నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంటుందని అన్నారు. షాపులకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపై కాకుండా అందుబాటులో ఉన్న పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపివేయాలని సూచించారు. రోడ్లపై అక్రమ పార్కింగ్, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే ఆక్రమణలు, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నిలిపివేయడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే వాహనాలను టోయింగ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. వ్యాపారులు కూడా తమ దుకాణాల ముందు రహదారిపై వస్తువులను ఉంచకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలని కోరారు. నారాయణపేట పట్టణంలో ట్రాఫిక్‌ను మరింత క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి సురక్షితమైన, ట్రాఫిక్ అంతరాయం లేని పట్టణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ శివశంకర్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా వార్డు మెంబర్ల ఇంచార్జ్ గా గొట్టం ప్రశాంత్ కుమార్ నియామకం

- **జిల్లా వార్డు మెంబర్ల హక్కుల కోసం పోరాటం**
- **ప్రజలచే ఎన్నుకోబడిన వార్డు మెంబర్లకు ప్రభుత్వం పారితోషికం ఇవ్వాలి**
- **ప్రజాపాలన ప్రభుత్వంలో సమన్యాయం పాటించాలి**
- **తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్ల అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి**






వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 16 ( విజన్ ఆంధ్ర ) : ప్రజలచే ఎన్నుకోబడిన రాజకీయ ప్రతినిధులకు ప్రభుత్వం చెల్లించే జీతభత్యాలు వార్డు మెంబర్లకు కూడా ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్ల అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎంపీటీసీ ఎంపీపీ జడ్పిటిసి ఎమ్మెల్యే ఎంపీ ఎమ్మెల్సీ లు ఎలాగైతే ప్రజల చేత ఎన్నుకోబడ్డారు అలాగే వార్డు మెంబర్లు కూడా ప్రజల చేత ఎన్నుకోబడ్డారని ఆమె స్పష్టం చేశారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర వార్డు నెంబర్ల అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి జిల్లా వార్డు మెంబర్ల ఇన్చార్జిగా ధారూర్ మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన గొట్టం ప్రశాంత్ కుమార్ ను జిల్లా ఇన్చార్జిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆమె మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వంలో రాజకీయ ప్రతినిధులకు జీతభత్యాలు ఏ విధంగా చెల్లిస్తున్నదో అదే విధంగా వార్డు మెంబర్లకు కూడా చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. వార్డు మెంబర్లు తమ వార్డుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అహర్నిశలు కృషి చేస్తారని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వార్డు మెంబర్ల నూతన ఇన్చార్జి గొట్టం ప్రశాంత్ కుమార్ విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో గురువారం మాట్లాడారు. నాపై నమ్మకం ఉంచి నాకు ఈ పదవి బాధ్యతలు అప్పగించిన పెద్దలందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వార్డు మెంబర్ల హక్కుల కోసం న్యాయ పోరాటం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో వార్డు మెంబర్ల కమిటీలు వేసి వారి వారి గ్రామాలకు సంబంధించిన సమస్యల చిట్టాను చర్చించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. వార్డు మెంబర్లకు జీతభత్యాలు వచ్చే విధంగా వార్డు మెంబర్లు అందరూ ఐకమత్యంగా పోరాడాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన పేర్కొన్నారు. వార్డు మెంబర్ల హక్కులు సాధించేంతవరకు నిరంతరాయంగా ప్రభుత్వంతో పోరాడుదాం అని ఆయన పిలుపునిచ్చారు.

# సేవా స్ఫూర్తితో ఘనంగా శివప్రసాద్ జన్మదిన వేడుకలు..



సూర్యాపేట జూలై 16:(విజన్ ఆంధ్ర) : యువ నాయకులు దిండుగల్ల శివప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని సూర్యాపేట పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏడవ వార్డు యువ నాయకులు మామిడి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏరియా హాస్పిటల్‌లో రోగులకు బ్రెడ్ పంపిణీ చేసి మానవతా దృక్పథాన్ని చాటారు. అనంతరం కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ సమీపంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పలువురు నిరుపేదలు, ప్రయాణికులు,అవసరమైన వారికి భోజనం అందించారు. రాత్రి స్థానిక వార్డు ప్రజల మధ్య భారీ కేకు కట్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జన్మదిన వేడుకలను ఆడంబరంగా కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు సేవ చేయడమే నిజమైన వేడుక అని పేర్కొన్నారు.నాయకుడి సేవాభావం, ప్రజల పట్ల అంకితభావాన్ని కొనియాడుతూ ఆయన మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో వార్డు యువ నాయకులు వీరమల్ల రవి చరణ్ గౌడ్, బంధా కిరణ్,బోడ వినోద్,సందీప్,కోల మహేష్,బొజ్జ ఉపేందర్,పోలేటి పవన్, బన్నీ,బంధా సాయి, తండు బన్నీ, మహేష్, అభిమానులు, మిత్రులు, స్థానిక నాయకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరోపణలు నిరూపిస్తే అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తా ..



సూర్యాపేట జూలై 16:(విజన్ ఆంధ్ర) : తనపై జిల్లా యువజన అధ్యక్షుడు బొమ్మిడి అశోక్ చేసిన ఆరోపణలను నిరూపిస్తే వెంటనే అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తానని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు బెలిదే శ్రీనివాస్ సవాల్ విసిరారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తాను గెలుపు కోసం కృషి చేసిన వారికి పదవులు ఇస్తానని ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. యువజన అధ్యక్షుడిగా ఉన్న బొమ్మిడి అశోక్ ఆర్యవైశ్య సమాజానికి చేసిన సేవలేమిటో చెప్పాలని ప్రశ్నించారు. తాను అధ్యక్ష పదవిలో లేకపోయినా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానని తెలిపారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన బొమ్మిడి అశోక్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అనంతరం పలువురు ఆర్యవైశ్య సంఘ సభ్యులు మాట్లాడుతూ, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి రూ.10 లక్షలు తీసుకున్నారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఖండించారు. సంఘంలో ప్రతి రూపాయి ఖర్చును సభ్యుల సమక్షంలోనే పారదర్శకంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. వ్యాపారాలను పక్కనబెట్టి సమాజ సేవ కోసం పనిచేస్తున్న వ్యక్తిపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం తగదని అన్నారు.పట్టణ ఆర్యవైశ్య సభ్యులకు పదవుల కేటాయింపు కూడా సభ్యులందరి సమక్షంలోనే జరుగుతుందని, వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని రద్దు చేశామని ఎప్పుడూ చెప్పలేదని, ఆ పదవిపై తుది నిర్ణయం తర్వాత తీసుకుంటామని స్పష్టం చేశారు. సంఘ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిక్కుమళ్ల కృష్ణ, వుప్పల సత్యనారాయణ, రాచకొండ శ్రీనివాస్, వుప్పల శ్రవణ్ కుమార్, మిట్టపల్లి రమేష్, బొల్లం సురేష్, తోట లక్ష్మి నర్సయ్య, బచ్చు జగన్మోహన రావు, చల్లా సత్యనారాయణ, గుడిపాటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 17న జిల్లాకు రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమిషన్ చైర్మన్, సభ్యుల రాక....జిల్లా కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 16,( విజన్ ఆంధ్ర)
ఈ నెల 17న రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులతో కలిసి జిల్లాకు రానున్నారని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని, అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

## కేజీబీవీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్



నిజామాబాద్, జూలై 16 :( విజన్ ఆంధ్ర ) నందిపేట మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. పాఠశాల ఆవరణను, డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, తరగతి గదులను పరిశీలించారు. బియ్యం బస్తాలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడ కూడా నీరు నిలువ ఉండకూడదని నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. చిన్నచిన్న లోపాలను గమనించిన కలెక్టర్, వాటిని సరి చేసుకోవాలని సూచించారు. బాలికలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని అన్నారు. అనంతరం 7వ తరగతి గదికి వెళ్లి విద్యార్థినులతో భేటీ అయ్యారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పలు ప్రశ్నలు వేసి, విద్యార్థినుల అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. వ్యక్తిగత భద్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, తల్లిదండ్రులు, సంరక్షకులు తప్ప ఇతరులు ఎవరు వచ్చినా వారితో వెళ్లకూడదని జాగ్రత్తలు సూచించారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు, బహుమతులను విద్యార్థినులకు అందించారు. ఇష్టపడి చదువుకోవాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగాలని ఉద్బోధించారు. వారిలో స్ఫూర్తిని పెంపొందింపజేశారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని నిర్వాహకులను ఆదేశించారు. కాగా, పాఠశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయం పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ శ్రీనివాస్ రావు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శాంతికుమారి తదితరులు ఉన్నారు.

## నందిపేట తహసీల్దార్ కార్యాలయంను తనిఖీ చేసిన కలెక్టర్



నిజామాబాద్, జూలై 16 : (విజన్ ఆంధ్ర )నందిపేట మండల తహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించిన సందర్భంగా లోపాలను గుర్తించి, తహసిల్దార్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, అక్రమాలకు తావు కల్పించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ భూములు కబ్జాకు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఎంతమాత్రం ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. రికార్డులను పక్కాగా నిర్వహిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ ఉన్నారు.

## ఈనెల 18న జరిగే యువ సంగ్రామసదస్సును విజయవంతంచేయాలి

**- జిన్నారం నుంచి యువత భారీగా తరలిరావాలి**

**- గూడెం విక్రమ్ రెడ్డి,ఆది రామకృష్ణ**



సంగారెడ్డి జిన్నారం, జూలై 16 (విజన్ ఆంధ్ర న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 18న నిర్వహించనున్న యువ సంగ్రామ సదస్సుకు జిన్నారం మున్సిపల్ పరిధి నుంచి యువత పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని యువ నాయకుడు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తనయుడు గూడెం విక్రమ్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ఆది రామకృష్ణ పిలుపునిచ్చారు. జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆది రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశానికి గూడెం విక్రమ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువ సంగ్రామ సదస్సు లక్ష్యాలు, యువత పాత్ర, సభ విజయవంతానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. యువత సమస్యల పరిష్కారం, యువ శక్తి ఐక్యత, పార్టీ బలోపేతమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ప్రతి యువకుడు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని గూడెం విక్రమ్ రెడ్డి కోరారు. జిన్నారం మున్సిపల్ నుంచి అత్యధిక సంఖ్యలో యువత పాల్గొని సదస్సు విజయానికి తోడ్పడాలని ఆది రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు నాయి కోటిరాజేష్, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు మిరాజ్ ఖాన్, కౌన్సిలర్లు, యువజన విభాగం సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనకు ఆకస్మిక తనిఖీలు

**- యువత చెడు అలవాట్లకు దూరం ఉండాలి**

**- నారాయణపేట సీఐ శివశంకర్**



నారాయణ పేట, జూలై 16 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా కేంద్రంలో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా టౌన్ సీఐ శివశంకర్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ పోలీసులతో కలిసి బస్టాండ్, పాన్ షాపులు, కిరాణా దుకాణాలు తదితర ప్రాంతాల్లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శివశంకర్ మాట్లాడుతూ యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా లేదా వినియోగానికి పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. నారాయణపేట జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే బస్టాండ్ ఏరియాలో అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పోలీసు జాగిలం విక్కీ, పిసి పరమేశ్, టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో లక్షల ఆదాయం సాధించొచ్చు..

**- తక్కువ నీటితో అధిక లాభం, రైతులు ముందుకు రావాలి,**

**- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,**





అచ్చంపేట జూలై 16 (విజన్ ఆంధ్ర ) : ఆయిల్ ఫామ్ సాగుతూ లక్షల రూపాయలు ఆదాయం రైతులు సాధించవచ్చుని వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా ఆయిల్ ఫామ్ సాగు లాభదాయకమైన పంటగా నిలుస్తోందని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని లింగోటం గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతు రాజశేఖర్ గౌడ్ తన 4 ఎకరాల్లో సాగు చేసిన ఆయిల్ ఫామ్ తోటను జిల్లా ఉద్యాన శాఖ, ఇతర రైతులు , ఆయిల్ ఫామ్ కంపెనీ అధికారులతో కలిసి గురువారం కలెక్టర్ హెమంత కేశవ్ పాటీల్ పరిశీలించారు. ఈ సందర్భంగా తోటలో మొక్కల పెరుగుదల, దిగుబడి, నీటి వినియోగం, నిర్వహణ పద్ధతులు, కోత విధానాలను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ రైతుతో మాట్లాడి పంట సాగుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ. లింగోటం గ్రామ రైతు రాజశేఖర్ గౌడ్ సాధించిన విజయం ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ డిమాండ్ ఉన్న ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని, ముఖ్యంగా వరికి బదులుగా తక్కువ నీటితో అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్ ఫామ్ వంటి పంటలను సాగు చేయడం ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని, వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులకు ఆయిల్ ఫామ్ సాగు, నిర్వహణ, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. విజయవంతమైన రైతుల అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవడం ద్వారా ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రగతిశీల రైతు రాజశేఖర్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. రైతు సాధించిన విజయాన్ని కొనియాడుతూ, ఇదే స్ఫూర్తితో మరింత మంది రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయాలని కలెక్టర్ కోరారు. భారత వాతావరణ శాఖ అధికారం వెల్లడించిన వివరాల ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లాలో ఈ సంవత్సరం వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు ఉన్నాయని, ప్రాజెక్టుల్లో కూడా నీటి నిలువలు కేవలం త్రాగునీటి అవసరాల కోసమే ఉన్నాయని, రైతులు ఈ విషయాలను అర్థం చేసుకోని, వరికి ఇతర ప్రత్యామ్నాయ పంటలను పండించేలా ముందుకు రావాలని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. అక్కడ వచ్చిన కొంతమంది రైతులు 30 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు రాగా, కలెక్టర్ వారి అందరిని అభినందించి, అందుకు అవసరమైన చర్యలను వెంటనే తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు రైతు రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ..నాలుగేళ్ల క్రితం నాలుగు ఎకరాల్లో ఆయిల్ ఫామ్ మొక్కలను నాటినట్లు తెలిపారు. ఈ ఏడాది మొదటిసారిగా వాణిజ్య స్థాయిలో దిగుబడి రావడం ప్రారంభమైందని చెప్పారు. ఎకరానికి సుమారు నాలుగు టన్నుల చొప్పున మొత్తం 16 టన్నుల ఆయిల్ ఫామ్ గింజలు ఉత్పత్తి అయ్యాయని వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ప్రతి టన్నుకు రూ.23,783 చొప్పున మొత్తం రూ.3,65,000కు పైగా ఆదాయం వచ్చినట్లు కలెక్టర్‌కు రైతు వివరించారు. . ఈ పంటకు నీటి అవసరం తక్కువగా ఉండటంతో పాటు, నీటి వినియోగం కూడా సమర్థవంతంగా ఉంటుందని వివరించారు. సరైన నిర్వహణ, ఎరువుల వినియోగం, సమయానుకూల సంరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశం మాట్లాడుతూ...., ఆయిల్ ఫామ్ తోటల్లో పండిన గెలలను ఎలా గుర్తించాలి, కోతకు సరైన సమయం ఏది, ఏ విధానంలో గెలలను కోయాలి, కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి వంటి అంశాలను కలెక్టర్‌తో పాటు అక్కడికి వచ్చిన రైతులకు వివరించారు. రైతు మొక్కలు నాటిన సంవత్సరం నుంచి వరుసగా నాలుగు సంవత్సరాల పాటు ప్రతి ఎకరానికి రూ.4,200 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా రైతులకు ప్రారంభ దశలో ఆర్థిక భారం తగ్గుతుందని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం, అచ్చంపేట డివిజన్ ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, నాగర్ కర్నూల్ డివిజన్ ఉద్యాన శాఖ అధికారి జగన్, వ్యవసాయ అధికారులు, గ్రామ సర్పంచ్ వివిధ గ్రామాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లు అధికారంలో ఉండి జిల్లాకు ఏం చేశావు

**- కేసీఆర్ కు దత్తపుత్రుడిగా కమిషన్ లు దండుకున్న చరిత్ర నీది.**

**- కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక దొంగ దీక్షలు.**

**- వేముల ప్రశాంత్ రెడ్డి పై మండిపడ్డ డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి.**




నిజామాబాద్ జులై16:( విజన్ ఆంధ్ర ) : కేసీఆర్ దత్తపుత్రుడిగా, పదేళ్లు అధికారంలో ఉండి జిల్లాకు ఒరగబెట్టింది ఏమీ లేదని మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పై జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. కేవలం తమ ఉనికిని కాపాడుకోవడానికే దొంగ దీక్షలు చేపడుతున్నారని ఆరోపించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ సారధ్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ను చూసి ఓర్వలేకనే ప్రశాంత్ రెడ్డి అవాకులు చవాకులు పేలుస్తున్నారని నగేష్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి అక్రమాలలో కేసీఆర్ దత్తపుత్రుడిగా ప్రశాంత్ రెడ్డికి వాటా ఉందని ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన మీ పార్టీని ప్రజలు ఎప్పుడో మర్చిపోయారని ఆయన అన్నారు. పదేళ్లు మీ పార్టీ అధికారంలో ఉండి జిల్లాను ఎందుకు అభివృద్ధి చేయలేదని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా దోచుకున్నారని విమర్శించారు. కోట్లాది రూపాయలతో జరుగుతున్న భీంగల్ అభివృద్ధి మీకు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. అధికారంలో ఉండి కూడా భీంగల్ అభివృద్ధి నీ ఎందుకు విస్మరించారని ఆయన ప్రశ్నించారు. డాక్టర్ల సలహా మేరకే నిరాహార దీక్ష చేపట్టారని, ప్రజలను మభ్యపెట్టడానికి ప్రశాంత్ రెడ్డి చేస్తున్న నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఓటరు సవరణ ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పనిచేస్తున్నారని ఆయన అన్నారు. సుదర్శన్ రెడ్డి గతంలో మంత్రిగా ఉన్నప్పుడు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిధులు కేటాయిస్తే, టిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పూర్తి వివక్షతకు గురి చేశారని ఆరోపించారు. కమిషన్లు దండుకునే దానిపై ఉన్న శ్రద్ధ ప్రజలకు, రైతులకు ప్రయోజనం చేకూర్చే పనులు చేయలేదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గాల విభజన లో భాగంగా కాంగ్రెస్ పార్టీ 120 స్థానాలు సాధించడం ఖాయమన్నారు. భారతీయ జనతా పార్టీతో బీఆర్ఎస్ కు లోపాయికార ఒప్పందం ఉందని ఆయన ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భక్తవత్సలశీ, రత్నాకర్ గౌడ్, జావిద్ అక్రమ్, విపుల్ గౌడ్, రాజు, నరేందర్ గౌడ్, గోపి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 29న 'ఏథర్ కమ్యూనిటీ డే-2026'

హైదరాబాద్, జూలై 16 (విజన్ ఆంధ్ర) : ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ తన 'ఏథర్ కమ్యూనిటీ డే-2026' కార్యక్రమాన్ని ఆగస్టు 29న బెంగళూరులో 'ఎ న్యూ డాన్ ఆఫ్ మ్యాజిక్' థీమ్‌తో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఈఎల్ ప్లాట్‌ఫామ్ ఆధారంగా రూపొందించిన తొలి మాస్-మార్కెట్ స్కూటర్‌తో పాటు కొత్త సాంకేతికతలు, ఛార్జింగ్, వాహన యాజమాన్య సేవలకు సంబంధించిన ఆవిష్కరణలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. రూ.1 లక్ష - 1.25 లక్షల ధర శ్రేణి వినియోగదారులను లక్ష్యంగా చేసుకున్న ఈ స్కూటర్ ఏథర్ మార్కెట్ విస్తరణలో కీలక మైలురాయిగా నిలవనుందని తెలిపారు. గత ఏడాది కమ్యూనిటీ డేలో ఈఎల్ ప్లాట్‌ఫామ్, రెడక్స్ కాన్సెప్ట్ వాహనం, తదుపరి తరం ఫాస్ట్ ఛార్జింగ్ టెక్నాలజీ, ఏథర్‌స్టాక్ 7.0ను పరిచయం చేసినట్లు చెప్పారు.

## ఆకట్టుకున్న 'శివోహం అమోఘం' నృత్య ప్రదర్శన




హైదరాబాద్, జూలై 16 (విజన్ ఆంధ్ర) : మహా శివుడిని కీర్తిస్తూ 'శివోహం అమోఘం' శీర్షికతో సుమారు 200 మంది నాట్య కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య రూపకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో స్పందన ఆర్ట్స్ నిర్వహించిన 35వ వార్షికోత్సవాలు రవీంద్రభారతిలో నృత్య, సంగీత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు కె.వి.రమణారావు మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ నృత్యాలు దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. దైవస్మరణకు సాహిత్యంతో పాటు నృత్యం, సంగీతం కూడా గొప్ప మాధ్యమాలని తెలిపారు. 'శివోహం' పేరిట కళాకారులు అందించిన నాట్య ప్రదర్శన నిజంగా అమోఘంగా ఉందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పి.వెంకటేష్, న్యాయవాది బర్మా చక్రపాణి, బీజేపీ నాయకుడు నర్సింగ్‌రావు, నటుడు కోటేశ్, సాహితీవేత్త సత్యం తదితరులు పాల్గొన్నారు. స్పందన ఆర్ట్స్ సంస్థ స్థాపకులు శ్రీకాంత్ గౌడ్ వార్షిక నివేదికను సమర్పించారు. సంస్థ అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షత వహించగా, నృత్య దర్శకుడు రామ్‌దాసు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అడ్ల సతీష్‌కుమార్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# కడసారి వీడ్కోలుకు కూడా కష్టాలే!!

**- స్మశాన వాటికలో నరకం చూస్తున్న జనం**

**- రూపాయి అంత్యక్రియల పథకం ఏది?**

**- తుప్పుపట్టిన 30 లక్షల దహన యంత్రం**

**- పాములు, పొదల మధ్య అంతిమయాత్ర**

**- సీపీఐ నాయకుల ఆగ్రహం**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 16 (విజన్ ఆంధ్ర): కడసారి వీడ్కోలు కూడా కన్నీటి కష్టంగా మారిన వేళ. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఖని స్మశాన వాటిక దుస్థితిని చూసి చలించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నగర సమితి బృందం, గుండె తరుక్కుపోయే వాస్తవాలను ప్రజల ముందుంచింది, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోశిక మోహన్, నగర కార్యదర్శి కనకరాజ్, కార్పొరేటర్ మార్కపురి సూర్య ఆధ్వర్యంలో స్మశానాన్ని సందర్శించగా, అక్కడి దృశ్యం ప్రతి ఒక్కరినీ కలచివేసింది, బిడ్డను, తండ్రిని, తల్లిని పోగొట్టుకుని గుండె పగిలే బాధతో వచ్చే బంధువులకు, ఆఖరి మజిలీకి సరైన దారి కూడా లేకపోవడం, చనిపోయిన వారిని మోసుకొచ్చే వారే పడిపోయేలా గంగానగర్ ఫ్లైఓవర్ నుండి స్మశానం లోపలి వరకు తవ్వి వదిలేసిన రోడ్డు, చీకటిలో కన్నీళ్లతో తడుముకుంటూ నడవాల్సిన దుస్థితి, ఎక్కడా ఒక్క విద్యుత్ దీపం లేకపోవడం చూసి వారు ఆవేదన చెందారు, ఒకప్పుడు నీళ్లు పోసేందుకు ఉన్న రెండు మూడు పంపులు నేడు చెత్తలో కూరుకుపోయి కనిపించకుండా పోవడం, మొత్తం స్మశానం పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు, చెత్తాచెదారంతో నిండి పాములు తిరిగేలా ఉండటం అత్యంత బాధాకరమని, ఇది శానిటేషన్ విభాగం నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు, ప్రజాధనంతో 30 లక్షలు వెచ్చించి తెచ్చిన ఎలక్ట్రిక్ దహన యంత్రం నేడు తుప్పుపట్టి శిథిలమై మూలనపడటం చూస్తే, పాలకులకు చావుపైన కూడా చిత్తశుద్ధి లేదా అనే ప్రశ్న ఎదురవుతోందన్నారు, పేదవాడికి ఆఖరి భరోసాగా ఉన్న రూపాయి అంత్యక్రియల పథకాన్ని కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా నిలిపివేయడం మానవత్వానికే మాయని మచ్చ అని, వెంటనే ఆ పథకాన్ని పునరుద్ధరించి, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు, పక్కనే ఉన్న మంచిర్యాలలో మహాప్రస్థానం పేరుతో దేవాలయంలా స్మశానాన్ని నిర్మిస్తే, రామగుండంలో మాత్రం ఎందుకు ఈ వివక్ష అని ప్రశ్నిస్తూ, ప్రస్తుత స్థలం సరిపోనందున అదనపు స్థలం కేటాయించి, మౌలిక వసతులతో మహాప్రస్థాన తరహాలో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు మాటేటి శంకర్, శనిగరపు చంద్రశేఖర్, తొడుపునూరి రమేష్ కుమార్, కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ కరీం, కలువల జగన్, పోతరాజు నాగరాజు, సాధుల శివ తదితరులు పాల్గొన్నారు.

## అక్షర హై స్కూల్ ను సందర్శించిన ఎంఈఓ రాములు



అయిజ జులై 16 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ పరిధిలోని ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా ప్రారంభమైన శ్రీ అక్షర హై స్కూల్ ను ప్రిన్సిపల్ యు.మహేందర్ తో కలిసి,మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) రాములు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న విద్యా సేవలు, విద్యార్థుల హాజరు, నమోదు (ఎన్‌రోల్‌మెంట్) తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించేలా పాఠశాలను నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.అలాగే హాజరు పట్టికలు, అడ్మిషన్ రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ ప్రియాంక.**



నారాయణపేట జూలై 16 (విజన్ ఆంధ్ర) : మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. బేటీ బచావో - బేటీ పడావో పథకంలో భాగంగా జిల్లా కేంద్రంలోని సత్య సాయి కాలనీ లో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ కు వచ్చిన విద్యార్థినులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ విద్యకు ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. అందరూ సెల్ ఫోన్ లో చాట్ జీపీటీ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలని, ఇప్పుడు అదే వర్డ్ డాక్యుమెంట్‌ను కూడా ఇది తయారు చేసి ఇస్తుందన్నారు. మనం ఏదైనా సమాచారం కోసం టైప్ చేసి రాయడానికి సమయం తీసుకునేలోపే, అడిగిన సమాచారాన్ని సిద్ధం చేసి అందిస్తుందన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ అంత ముందుకు వెళ్లిందనీ, ఈ బేసిక్స్‌తో పాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ నేర్చుకోవడం కూడా అంత కష్టమేమీ కాదన్నారు. శిక్షణలో ఇవన్నీ నేర్చుకోవాలని, తర్వాతి క్లాస్‌లో మీరు ఇవన్నీ చేయగలుగుతున్నారా ? లేదా చూస్తానని ఆమె చెప్పారు. ప్రాక్టీస్ చేయడం ద్వారా కొత్త విషయాలు నేర్చుకోవడమే కాకుండా, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని కూడా ఉపయోగించిన వారవుతారనీ ఆమె తెలిపారు. అందరూ తప్పనిసరిగా డిగ్రీ పూర్తి చేయాలని, ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు కూడా చాలా వస్తున్నాయనీ, ప్రభుత్వ ఉద్యోగాలకు మాత్రమే కాకుండా, ప్రైవేట్ ఉద్యోగాలకు కూడా తప్పకుండా అప్లై చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యుఓ రాజేందర్ గౌడ్, వార్డు కౌన్సిలర్ కందేన్ పల్లి సత్యమ్మ, డీ డబ్ల్యు ఓ కార్యాలయ ఉద్యోగులు, కంప్యూటర్ శిక్షకులు పాల్గొన్నారు.

# వరుణ దేవుడ ..కరుణించు

## అక్షర పాఠశాల విద్యార్థుల ప్రార్థనలు



ముధోల్:16జూలై:విజన్ ఆంధ్ర : వరుణ దేవుడ.. కరుణించు అంటూ మండల కేంద్రంలోని శ్రీ అక్షర పాఠశాల విద్యార్థులు బుధవారం ఆకాశం వైపు చూస్తూ అద్భుత ప్రదర్శన చేశారు. ఈయేడు వర్షాకాలం సీజన్ ముందుగా వర్షాలు కురవడంతో రైతులు పంట పొలాల్లో విత్తనాలను విత్తుకున్నారు. గత 20 రోజుల నుండి వర్షాలు కురువక పోవడంతో విత్తనాలు ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన చెందుతున్నారు.దీంతో అక్షర పాఠశాల విద్యార్థులు వర్షం కురవాలని వరుణ దేవునికి పూజలు,పాటలు, నటన ద్వారా రైతులను ఆదుకోవాలని ఆకాశం వైపు చూస్తూ వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడిపంటలు పుష్కలంగా పండాలని వేడుకున్నారు.

## ఈ నెల 18న కెరీర్ గైడెన్స్ ఉచిత శిక్షణ కార్యక్రమం ..

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 16,(విజన్ ఆంధ్ర ) : జిల్లాలోని కాగజ్ నగర్ మండల కేంద్రంలో గల ఎస్ పి ఎం లో ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటల నుండి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై ఒక్క రోజు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. 3 సెషన్స్ లో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుండి కమర్షియల్ టాక్స్ రిటైర్డ్ జాయింట్ కమిషనర్ అనురాధ, 4 మంది సభ్యులు హాజరై విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ అనంతరం తీసుకోవలసిన కోర్సులు, ఎంచుకోవలసిన ఉన్నత విద్య అవకాశాలపై క్షుణ్ణంగా వివరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# సాగునీటి కోసం కన్నీటి పోరాటం

**- తాలిపేరు ప్రాజెక్టు పక్కనే ఎండిపోతున్న నారుమడులు**

**- వర్షాలు లేక కర్షకుల కన్నీరు....**

చర్ల, జూలై 16 (విజన్ ఆంధ్ర) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని పడితెలం గండి ప్రాంతంలో రైతన్నల కష్టం వర్ణనాతీతం, కళ్ళముందే నారుమడులు ఎండిపోతుంటే, ఆ ఆవేదనను మాటల్లో చెప్పడం సాధ్యం కాదు, వర్షాలు లేక ఆకాశం వైపు చూస్తున్న రైతులు, ఇప్పుడు తమ పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు

### ప్రాజెక్టు పక్కనే ఉన్నా అందని సాగునీరు

ఈ ప్రాంతానికి అతి సమీపంలో తాలిపేరు ప్రాజెక్టు ఉన్నప్పటికీ, స్థానిక రైతుల పంట పొలాలకు మాత్రం చుక్క నీరు అందడం లేదు, ప్రాజెక్టు ఉన్నా ప్రయోజనం లేక, నేటికీ వేల ఎకరాల పంట భూములు వర్షంపైనే ఆధారపడి సాగువుతున్నాయి, సరైన సమయంలో సాగునీరు అందక రైతులు తీవ్ర సందిగ్ధంలో పడుతున్నారు , ఇప్పుడు పంటలు వేయాలా? వద్దా? అని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు

### చెమటనే నీరుగా పోస్తూ నారుమడుల కోసం నిత్యం పోరాటం

పడితెలం గండి ప్రాంతం లో ఉన్న ఎండిపోతున్న రెండు ఎకరాల భూమిలో సేద్యం చేస్తున్నారు గూడూరి మురళీ ప్రసాద్, మహాలక్ష్మి అనే రైతు దంపతులు, వీరి పరిస్థితి మరీ దయనీయంగా మారింది, సుమారు రెండు ఎకరాల భూమిలో వరి నాట్ల కోసం పెంచిన నారుమడి ఎండిపోతుండటంతో, వారు చేసేది లేక ప్రాణాలు పణంగా పెట్టి పోరాడుతున్నారు, కొంత దూరంలో ఉన్న ఒక చిన్న గుంతలోని నీటిని బకెట్ల సహాయంతో మోస్తూ, ఆ నీటిని నారుమడులకు అందిస్తూ ఆ దంపతులు పడుతున్న శ్రమ చూస్తే కడుపు తరుక్కుపోతుంది,తమ రెక్కల కష్టాన్ని నారుమడులకు నీరుగా పోస్తూ, ఎండిపోతున్న ఆశలను చిగురింపజేయాలని వారు చేస్తున్న ప్రయత్నం కన్నీరు పెట్టిస్తోంది ...

### ఎల్ నినో ప్రభావం

ఎల్ నినో ప్రభావం వవల్ల భూమి తనలోని తేమను కోల్పోతుంది.



చేతులతో నారు తడుపుతున్న తీరు

పంటలు పండించే భూమి ఎండుబారి, సాగుకు తగిన నీరు దొరకక ఇబ్బందులు మొదలవుతాయి. నదులు, చెరువులు ఎండిపోవడం వల్ల తాగునీటికి కూడా కొరత ఏర్పడుతుంది. ఇది కేవలం రైతులకే కాకుండా, అందరి ఆహార అవసరాలపై ప్రభావం చూపిస్తుంది

### ఆవేదనలో రైతులు

వర్షాలు లేకపోవడం, ప్రాజెక్టు నుండి సాగునీరు విడుదల చేయకపోవడంతో ఈ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, పంటలు పండక ఆర్థికంగా నష్టపోతామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి, తాలిపేరు ప్రాజెక్టు నుండి సాగునీరు విడుదల చేసినప్పటికీ ఈ ప్రాంతానికి నీరు అందదని వాపోతున్నారు, పక్కనే ఉన్న చెరువు కూడా ఎండిపోవడంతో



ఎండిపోతున్న నారు మడి



నారు తడిపేందుకు నీరు మోసుకొస్తున్న దంపతులు

చేసేది లే లెక్క రైతులు నీళ్లు మోస్తూ నారు తెలుపుతున్నారు,తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు, గత ఏడాది కంటే నారు ఈ సంవత్సరం చాలా తక్కువగా వేసామని, సకాలంలో వర్షాలు రాకపోవడంతో అనుమానం తో పంటలు వెయ్యాలా వద్దా అని రైతులు ఆవేదన వ్యక్తిని చేస్తున్నారు, పాలకుల నిర్లక్ష్యంతో పచ్చని పంట పొలాలు ఎడారిగా మారుతున్నాయని, ఈ పరిస్థితుల్లో రైతులకు ప్రభుత్వమే భరోసా కల్పించాలని వారు కోరుతున్నారు.



రైతు: గూడూరి మురళీ ప్రసాద్ ,
ఈ ఏడాది వర్షాలు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు ఈ మధ్యకాలంలో కురిసిన అరకుల వర్షాలు నమ్ముకుని నారు పోసాము తీరా నారు వేసిన తర్వాత వర్షాలు రాకపోయేసరికి నారు ఎండిపోయే పరిస్థితి వచ్చింది, చేసేదిలేక పక్కనే ఉన్న బురద ఉన్న కొంత నీటినీ బకెట్లతో నీరు తెచ్చి నారు తెడుపుతున్నాం.. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

## రైతుల గోస కరెంటు కష్టాల విలయతాండవం..,

**- రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని ఆవేదన**




పెద్దపల్లి, జులై 16 (విజన్ ఆంధ్ర) : పెద్దపల్లి జిల్లాలో వర్షాలు సరిగా కురవక, చెరువులు ఎండిపోవడంతో రైతులు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో బోర్లు, బావులపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతులకు ఇప్పుడు విద్యుత్ కోతలు మరింత కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. నాట్లు వేసే కీలక సమయంలో విద్యుత్ ఎప్పుడు వస్తుందో, వచ్చినా ఎంతసేపు ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క మడి కూడా తడపడం కష్టంగా మారిందని, రాత్రింబవళ్లు మోటార్ల వద్దే కాపలా కాస్తున్నామని రైతులు వాపోతున్నారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, పెట్టుబడులు కూడా వృథా అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసి రైతులకు నిర్ణీత సమయాల్లో నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.




# అమ్మల కడుపు కోత... కార్పొరేట్ స్కూళ్ల 'ఫీజు' మోత!!

**- గోదావరిఖనిలో విద్యా వ్యాపారం**

**- నిబంధనలు 'నల్ల'బల్లెక్కిన వేళ...**

**- విద్యాశాఖ అధికారుల 'మామూలు' నిద్ర!**



హైదరాబాద్, జూలై 16: రెక్కాడితే గానీ డొక్కాడని బొగ్గుగని కార్మికుల చెమట చుక్కలు... తమ పిల్లలైనా ఏసీ గదుల్లో చదివి 'పెద్దోళ్ళు' కావాలని ఆశపడే సామాన్య తల్లిదండ్రుల కలలు... వీటన్నింటినీ క్యాష్ చేసుకుంటూ, నిబంధనలను బొందపెడుతోంది గోదావరిఖనిలోని కార్పొరేట్ విద్యా సామ్రాజ్యం.

### అక్షరం ముక్క లేదు... అన్నీ అంగడి సరుకులే!

ఒకప్పుడు బడి అంటే సరస్వతీ నిలయం. కానీ నేడు గోదావరిఖనిలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు వెళ్తే అదొక సూపర్ మార్కెట్‌ను తలపిస్తోంది.

### పుస్తకాల దందా

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బయట మార్కెట్లో దొరికే పుస్తకాలను సూచించాలి. కానీ, ఇక్కడ కథ వేరు. స్కూల్ లోగో వేసిన బుక్స్ మాత్రమే కొనాలి, అది కూడా వాళ్లు చెప్పిన రేటుకే! బయట రూ. 50 దొరికే నోట్‌బుక్, ఇక్కడ రూ. 150.

### యూనిఫాం ఏకఛత్రాధిపత్యం

బట్టల క్వాలిటీ 'థర్డ్ క్లాస్'... రేటు మాత్రం 'ఫస్ట్ క్లాస్'. సదరు స్కూల్ యాజమాన్యం కుదుర్చుకున్న సదరు దుకాణంలోనే, కొందరు ఏకంగా బడిలోనే బట్టలు, బెల్టు, టై, చివరకు షూస్ కూడా కొనాలనే హుకుం.

### ఫీజుల మోత

ఏటా ఇష్టారాజ్యంగా పెంచే ఫీజులు ఒకవైపు... డొనేషన్ల పేరిట గుంజే వసూళ్లు మరోవైపు. సామాన్యుడి జేబుకు చిల్లు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. "రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించిన డబ్బులన్నీ స్కూల్ ఫీజులకే సరిపోతున్నాయి. పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేయక తప్పడం లేదు." గోదావరిఖనిలోని ఒక బాధిత తండ్రి ఆవేదన.

### బట్టబయలైన బాగోతం: మీడియా, విద్యార్థి సంఘాల 'ఆపరేషన్'

ఇటీవల కాలంలో గోదావరిఖనిలో కొన్ని విద్యార్థి సంఘాలు, మీడియా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో జరిపిన ఇన్వెస్టిగేషన్‌లో ఈ దందాలన్నీ ఆధారాలతో సహా బట్టబయలయ్యాయి. కౌంటర్ల వెనుక జరుగుతున్న బ్లాక్ మార్కెట్ దందాను, పేరెంట్స్‌ను ఎలా బెదిరిస్తున్నారో సాక్ష్యాలతో సహా వెలికితీశారు. కానీ ఏం లాభం?

### అధికారులు ఉన్నారా? ఊదారా?

ఈ మొత్తం ఎపిసోడ్‌లో విద్యాశాఖ అధికారుల పాత్ర 'కంటి తుడుపు' చర్యలకే పరిమితమైంది. గోదావరిఖనిలో విద్యాశాఖ అధికారుల తీరు చూస్తుంటే 'ఉన్నారా లేరా' అనే అనుమానం కలగక మానదు. క్షేత్రస్థాయిలో ప్రైవేట్ స్కూళ్ల దందా ఇంత ఘోరంగా సాగుతున్నా, అధికారుల తనిఖీలు మాత్రం కేవలం కాగితాలకే పరిమితమవడం విచారకరం. ఇప్పటివరకు ఏ ఒక్క పెద్ద కార్పొరేట్ స్కూల్‌పైనా గట్టి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏదైనా విమర్శ వచ్చినప్పుడు, ప్రజా ఒత్తిడి పెరిగినప్పుడు కేవలం కంటితుడుపు చర్యగా, 'తూ తూ మంత్రం'గా నోటీసులు ఇవ్వడం... ఆ తర్వాత సైలెంట్ అయిపోవడం వీరికి





అలవాటుగా మారింది. కళ్లెదుటే నిబంధనలను తుంగలో తొక్కుతూ విద్యా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నా, ఏమీ తెలియనట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ అధికారులు చోద్యం చూస్తున్నారు.

### ఇకనైనా కళ్లు తెరుస్తారా?

కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాల ఏసీ గదుల కాసుల గలగలల వెనుక... పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల కన్నీళ్ల కష్టం దాగుంది. కలెక్టర్ గారు, విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి, ఈ విద్యా వ్యాపారానికి అడ్డుకట్ట వేయకపోతే... 'చదువు' సామాన్యుడికి శాశ్వతంగా దూరమయ్యే ప్రమాదం ఉంది. 'బడి'ని బడిలా ఉంచండి... దోపిడీ కేంద్రాలుగా మార్చకండి!

**- గడ్డం సంతోష్ రాజ్**

**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

# విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని రామన్నపేటలో మహాధర్నా

**- విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన జీవో నెంబర్ 9, ఆర్ఆర్ యాక్ట్ ను రద్దు చేయాలి**

**- ప్రభుత్వ నాయకులు కమిషన్లు రావనే విద్యార్థుల స్కాలర్షిప్లు ఇవ్వట్లేదు**

**- పల్లగొర్ల మోదీరాందేవ్**



రామన్నపేట : విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని జీవో నెంబర్ 9ను ఆర్ఆర్ యాక్ట్ రద్దు చేయాలని వేల మంది విద్యార్థులతో రామన్నపేటలో మహా ధర్నా నాయకులకు పోలీసులకు వాగ్వాదం తదినంతరం శాంతియుతంగా ధర్నా ముగించారు లిబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ వీఆర్.కృష్ణన్న, బీసీ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ గారి ఆదేశం అనుసారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీజేవైఎం జిల్లా అక్కినపల్లి సైదులు, బిజెపి కార్యవర్గ సభ్యులు పల్లపు దుర్గయ్య, టిఆర్ఎస్ నాయకులు సురేష్, అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు. రామన్నపేట సుభాష్ సెంటర్లో మహాధర్నా రాస్తారోకో చేశారు విద్యార్థులు వారు మాట్లాడుతూ విద్యార్థులకు రావలసిన 10 వేలకోట్ల స్కాలర్షిప్ ఫీజు బకాయిలు ఇవ్వకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుంది ఈ ప్రభుత్వం, విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన జీవో నెంబర్ 9ను ఆర్ఆర్ యాత్రను రద్దు చేయాలన్నారు విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి, పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించాలి విద్యాశాఖ మంత్రిని నియమించి వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి,, వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి గాంధీ విగ్రహాలు పెట్టడానికమూసి సుందరీకరణ ఫోర్త్ సిటీకి లక్షల కోట్లు ఉంటాయి గాని విద్యార్థులకు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉండయా, ప్రభుత్వం స్కాలర్షిప్లు ఇవ్వక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు కాలేజ్ యజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను వేధిస్తున్న ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చెలమతనం లేదు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించింది అన్నారు ఇంజనీరింగ్ ఎంబీఏ ఎంసీఏ చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు ప్రభుత్వమే భరించాలి సంక్షేమ హాస్టల్లకు సొంతభవనాలు నిర్మించాలి అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికి ఓవర్సీస్ స్కాలర్షిప్ ఇవ్వాలి మెస్ చార్జీలు పెంచాలి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన విద్యార్థులకు 5 లక్షల లక్షల భరోసా కార్డు ఇవ్వాలి 100రోజుల్లోనే విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక విద్యార్థుల చావులపై పేలాలు ఏరుకుంటుంది ప్రభుత్వం 100 రోజుల్లో రాజీవ్ గాంధీ ఇంద్రగాంధీ విగ్రహాలు తప్ప రాష్ట్ర ప్రజల బ్రతుకులు ఏమి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.50 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి ప్రభుత్వాన్ని నిరుద్యోగులు జబ్బకు సంచేసుకొని ఊరూరు తిరిగి అధికారంలో తీసుకొస్తే ఈ ప్రభుత్వం నిలువున ముంచింది హాస్టలకు సొంత భవనాలులేవు ఉన్న అద్దె కొంపలకు బెచ్చులూడి విద్యార్థులు చనిపోయే ప్రమాదం ఉన్న ఈ ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తుంది ఆర్ కృష్ణన్న కొట్లాడి విద్యార్థుల కోసం పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించే విధంగా పెట్టిస్తే ఆ జీవోను ఈ ప్రభుత్వం ట్రస్ట్ బ్యాంక్ పెడతామని తుంగలోకి దొరుకుతుంది రాజకీయంగా ఆర్థికంగా విద్యా పరంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అగ్రవర్ణ ఎదవకుండా కుట్ర చేస్తున్నారు ప్రభుత్వం నాయకులు ఇక ఊరుకునే ప్రసక్తే లేదు ఈ ప్రభుత్వం వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలి పెంచిన ఫీజులన్నీ ప్రభుత్వమే భరించాలి ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలి జనాభా తమాషా ప్రకారం గా ఎస్సీ ఎస్టీ బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలి విద్యారంగానికి నిధులు కేటాయించాలని లేనియెడల పెద్ద ఎత్తున వీ ఆర్ కృష్ణన్ ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకోలు బస్సులు దానాలు చేసి ప్రభుత్వని అట్టుడికిస్తామని హెచ్చరిస్తున్నాం ఈ సమావేశంలో లిబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీజేవైఎం కార్యదర్శి అక్కెనపల్లి సైదులు, బిజెపి కార్యవర్గ సభ్యులు పల్లపు దుర్గయ్య,బూాూ ఊరెళ్ళ మహేష్ బీసీ సంఘం నాయకులు ఎడ్ల మహాలింగం, జినుకల కృష్ణ,బిఆర్ఎస్ నాయకులు సురేష్, మనీష్, అనిత, లింగస్వామి, వినయ్, వెంకట్, భాస్కర్, రమాదేవి, ఉషశ్రీ, ఉదయ్ శ్రీ, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.